సమాలోచనం - 17

# మరో వైపు
# గురజాడ ఆధునిక చేతన

మాదిరాజు రంగారావు



2013
రసధుని - సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Literary Criticism

# MARO VAIPU - GURAJADA ADHUNIKA CHETHANA

(Sahithya Samalochanam)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2013

Price : 70/-

For Copies :
**Navodaya Book House**
'X' Roads, Kachiguda,
Hyderabad - 27.
Ph : 040 - 24652387

Printed at

*Presented*

*to*

***Dr. M. Santhosh Kumar***

*with affection and blessings*

*on*

***his Birthday 16th September***

# మరో వైపు
# గురజాడ ఆధునిక చేతన

**సూచిక :**

1. దేశ భక్తి గీతం - ఆధునిక మార్గం........................................ 5

2. సంస్కరణ మార్గం - పూర్ణమ్మ కథ........................................13

3. కన్యక - వ్యక్తి స్వేచ్ఛ - నిరంకుశాధికారం................................18

4. కన్యాశుల్కం - ప్రజాస్వామ్య దార్శనికత..................................23

5. కన్యాశుల్కం - సంవిధాన కళ............................................29

6. గురజాడ - ప్రజాస్వామ్య హృదయం......................................34

7. కన్యాశుల్కం - మధురవాణి వ్యక్తిత్వ వికాసం..............................40

8. చీకటి నుండి వెలుగులోకి - గిరీశం......................................44

9. ముత్యాల సరాలు - ఆధునిక యుగ భావన..............................48

10. కన్యాశుల్కం - యుగ కర్త అస్తిత్వం.....................................54

11. గురజాడ పరిపూర్ణ వ్యక్తిత్వం...........................................59

12. గురజాడ విమర్శనా దృక్పథం..........................................64

13. గురజాడ చూపులో దార్శనికత ప్రజాస్వామ్య భావన.....................69

14. గురజాడ ప్రభావం.........................................................74

# 1. దేశభక్తి గీతం

# గురజాడ ఆధునిక మార్గం

"దేశమును ప్రేమించుమన్నా" గీతం పై పొరలో దేశం పట్ల ప్రేమతోనూ, లో పొరలో నిఖిల మానవ చింతనతోనూ ఆవిష్కారాన్ని పొందింది. ఇది ఆధునిక యుగంలో తెలుగు కవిత్వం – మరో వైపుకు చెందింది. ఈ యుగానికి సంకేతంగా నిలిచిందీ. నూరు సంవత్సరాల ఆయువు కాలంలో ఎన్నో కాలం పెట్టిన పరీక్షలకు తట్టుకొనీ బ్రతికిందీ. ఇప్పటికీ సరి కొత్తగా ఉందీ. ఈనాడు నెలకొని ఉన్న సమాజ స్థితి గతుల్లో అన్వయయ శోభను పొందుతూంది. సార్వ కాలిక మయిన సార్వజనీన మయిన ప్రయోజన విస్తృతితో రాణిస్తూంది. గురజాడ 'దేశభక్తి' గీతం విషయం (content) లో విశాలమైన క్షేత్ర పరిధులూ లక్ష్యం (target) లో బహుముఖీన మయిన (multiple) సమాజ శ్రేయో గుణమూ కలిగిందీ. అనితరమయిందీ. దీనిలో విషయ నిర్వహణం (treatment) ప్రత్యేకంగా పేర్కొదగిందీ. ఇది వివిధాంశాలతో శ్లిష్టమయిందీ. ఇది ఒక వరస క్రమంలో కాకుండా వివిధ సందర్భాల్లో అవసరమయిన విధంగా చోటు చేసుకున్నాయి. ఈ (intersperce) విధానంలో సంశ్లిష్ట శిల్పాన్ని తలపిస్తాయి. ఇవి అన్నీ కలిసి మొత్తం మీద గీతానికి సావయవ సుందర రూపాన్ని సంతరింపజేసాయి. విషయానికి సంబంధించిన వేరు వేరు అంశాల్ని అవసరం మేరకు సంయోజన పరచి కళాత్మకతను ప్రదర్శించడంలో కవి ఉపజ్ఞత గోచరిస్తుంది. సృజన క్రమం (creative process) లో ఈ సంవిధానం నిస్సందేహంగా ఉన్నత మయిందీ. ఇది సామాజిక తత్పరత (involvement) తో సజీవత్వాన్ని పొందింది. ఆయా పరిమితుల్లో అంశాలొకటొకదీ ఒక దానితో ఒకటి కలిసి, ఒక దాని కొకటి పోషకంగా నిర్మాణ కళను పొందాయి. యాభై ఆరు పంక్తుల దీర్ఘ గీతం ప్రవాహ సదృశంగా సాగింది. మొత్తం మీద విషయ పరంపర, భావ నిర్భరత దృష్టికి వస్తాయి. ఇవి సృజన రూపంలో కవిత్వ కళకు విశాలావకాశాన్ని సంతరింపజేసాయి. ఈ దిశలో ఈ గీతం ప్రత్యేక స్థానాన్ని వహించింది. ఈ రచనా సమాలోచనంలో విశ్లేషణ కందే అంశాలు.

1. స్థానికం (local) దేశం (country) అంతర్జాతీయం (international) స్థాయిల్లో విషయమూ (content) భావన (thought) కు చెందిన సృజన క్రియ (creative process) ను కలిగిందీ. ఇది నవ్యమైన దృష్టితో ఏర్పడిందీ.

2. శ్రామిక ఆర్థిక సమాజ వికాస స్పృహను కలిగిందీ.

3. నైతికమూ ఉదారత శాంతి కాముకత అవసరాన్ని చూపేదీ.

4. వర్తమాన వాస్తవికతలో పురోగమన దార్శనికత కలిగిందీ.

5. ఆధునిక చేతనతో మానవీయ స్పందనం కోరేదీ.

ఈ ఐదు లక్షణాలూ సృజన క్రియలో భాగాలుగా ఉన్నాయి. ఒక వ్యాసంలో వలె నిర్దిష్టమైన క్రమంలో ఉండే వీలు లేదు. కవితావేశంలో 1) ఒక దానితో మరొకటి అనుబంధంగానో 2) ఒక దాని నుండి మరొకటి ఉత్పన్నంగానో 3) ఒక దానికి మరొకటి విస్తరణంగానో 4) ఒక దానికి మరొకటి పోషకంగానో పరి పరివిధాలుగా గోచరిస్తాయి. ఈ intersperce తో కూడిన సంశ్లిష్ట విధానం కవిత్వ కళలో భాగ మయింది. ఆధునిక కవిత్వానికీ గీతం ప్రేరణ రూపంగా పని చేసింది, ఇదొక మలుపు. మరొకటి, విషయమూ భావ నిర్భరతతో పాటు సామాజిక తత్పరతతో ఉన్నత మయిన ఆశయంతో రచన ప్రధానమయిన ప్రవాహ (mainstream) రూపాన్ని తలపిస్తూంది. ఈ మరోవైపు – ఆధునిక కవిత్వానికి ఆయువు పట్టుగా మారింది. ఈ సృజన రూపాన్ని సహృదయుల దృష్టికి తీసుకొని రావడమే ప్రస్తుతోద్దేశం.

ఈ గీతం రచనా కాలం 1910 (1913 ఆగస్టు 9 తేదీ కృష్ణా పత్రికలో ప్రచురితమైంది.) అప్పటికి అంతర్జాతీయంగా స్వేచ్ఛ – సమానత– సౌభ్రాత్రం భావనతో, హేతు దృష్టి వైజ్ఞానిక ప్రభావంతో ప్రకాశించే ప్రజాస్వామ్య దార్శనిక మూలాల్ని స్పృశిస్తూంది. ఈ కారణంగానూ కాలం గడచే కొద్దీ సమాజంలో ఆధునికానికి అభిముఖంగా మార్పులు వచ్చే కొద్దీ ప్రయోజనం విస్తరిస్తూ ఆకర్షణ పెరుగుతూ వచ్చింది. ఆ తరువాత ఈ మరో వైపు – గురజాడ ప్రభావ ముద్రలతో శ్రీశ్రీ ఆరుద్ర దాశరథి మొదలయిన కవులూ తమ తమ వ్యక్తిత్వాల ప్రత్యేకతలతో ఆధునిక కవిత్వానికి వైవిధ్యాన్ని చేకూర్చారు. ఇదీ ఈనాడు స్వేచ్ఛా కవిత్వ యానంలో ముందుకు

సాగుతూంది. ఈ రచన ఆధునిక చేతనతో ప్రజాస్వామ్య స్వేచ్ఛను తలపిస్తూంది. ఈ కారణాల్ని బట్టి మిగతా కవుల దేశ భక్తి గీతాల్ని పరిమితిలో అధిగమించిందీ, లక్ష్యంలో శిఖరాయమాణంగా ఉంది. ఆధునిక కవిత్వానికి "మరోవైపు" పథ ప్రదర్శన గౌరవాన్ని పొందిందీ. కొత్త యుగానికి సింహ ద్వార మయింది.

(2)

*"దేశ మంటే మట్టి కాదోయ్*
*దేశ మంటే మనుషులోయ్"*

ప్రజను ఉద్దేశించి ప్రబోధ గుణంతో ఆరంభ మయింది విషయ ప్రాధాన్యాన్ని సూచిస్తూంది. దేశం అస్తిత్వానికి మూలం భూమి, మట్టీ, సీమలతో బయటి స్వరూపం. మనుషులూ ప్రజలూ జీవితమూ సమాజమూతో లోపలి స్వరూపం, ఇది మనోభావ సమర్పకమయిందీ. ఇది గురజాడ దృష్టిలో ప్రధానమైందీ. మానవ చేతనకు మొదటి స్థానమీయబడింది. దేశ మంటే ఆ మనుషుల్ని గురించి ఆలోచన, "మరో వైపు" లో సందర్భోచితంగా ఉంది. ఈ భావ స్థితిలో దూరాన్వయం కన్నా అంతర్భావాన్వయం సమంజసంగా ఉంటుంది.

*"ఆకులందున అణగి మణగీ*
*కవిత కోకిల పలక వలెనోయ్*
*పలుకులను విని దేశ మందభి*
*మానములు మొలకెత్తవలె నోయ్!"*

సమాజంలో కవీ ఒక వ్యక్తి! తన కర్తవ్యాన్ని పాలించే అవసరం రెండు విధాలుగా గోచరిస్తుంది. కవిగా సృజన ప్రయోజన క్షేత్రాన్ని విస్తరించడంలో తప్పులేదు. ప్రజల అభిమానం పొందడంలోనే సార్థకత ఉంది. సృజన స్వేచ్ఛలో కవి సామాజిక బాధ్యతను తలపించే నిర్దేశంతో గీతం సమాప్త మయింది. ఆకులలో వలె మనుషులలో ఒకరుగా ఉన్న కవిలో conscious artist తాను చేసే పనిపట్ల జాగరూకత వివేచన గల కళాకారుని స్ఫురింపజేస్తూంది.

ఈ గీతం పై సమాలోచనంలో విశ్లేషణలో మొదటి అంశం - స్థానిక (local) దేశ (country) అంతర్జాతీయ (international) స్థాయిల్లో విషయమూ (content) భావన (thought) కు చెందిన సృజన క్రియ (creative process) కు చెందిందీ. దీని క్రమారోహణం మూడు అంచెలుగా తీర్చబడింది. తప్పని అవసరాల నుండీ, కావలసిన స్థితికీ రావలసిన మార్పుకూ, క్రమింపజేసే ఉత్సాహ రూపాన్ని ప్రతిఫలింపజేస్తూంది.

*"పాడి పంటలు పొంగి పొరలే*
*దారిలో నువు పాటు పడవోయ్"*

పాడి పంటలూ స్థానీయం గానూ దేశం మొత్తం మీదనూ భారతీయ గ్రామీణ జీవన విధానికి సంబంధించింది. వ్యావసాయక వాతావరణాన్ని తలపిస్తుంది.

*"అన్ని దేశాల్ క్రమ్మ వలెనోయ్*
*దేశి సరుకుల నింప (నమ్మ) వలెనోయ్"*

ఈ నాలుగు చరణాలు కలిపి, స్థానికం దేశం ప్రపంచం ఒక పరంపరలో క్రమారోహణాన్ని భావింపజేస్తాయి. ఈ క్రమంలో విస్తరించే సంబంధాలతో పెరిగే వాణిజ్యం ఆర్థిక శక్తికి దోహదం చేస్తుంది. వర్తక వ్యాపారాల్లో ఆదాన ప్రదాన ప్రభావం సమాజ సమున్నతికి దారి తీస్తుంది. సంపన్నం చేస్తుంది. సంపద ఆర్థిక శక్తికి మూలం. కూడ బెట్టిన డబ్బు చక్కగా వినిమయం కావడమూ అవసరం.

*"డబ్బు తేలేనట్టి నరులకు*
*కీర్తి సంపద లబ్బవోయ్"*

నీతివంతంగా డబ్బును సంపాదించడంలో వ్యతిరేకత కవకాశం లేదు. తప్పుకాదు. దాని వినియోగంలో దోషం ఉండకూడదు. మంచి పనులు కీర్తికరాలు. అవి తిరిగి వెల కట్టరాని సంపద నిస్తాయి, అమూల్యమైనవిగానూ నిలుస్తాయి. సంపద ఏ రూపం లోనయినా ఉండవచ్చు. చరిత్రలో భాగంగా నిలుస్తాయి. సంస్కృతిలో ఒకటవుతాయి. జీవనస్థాయి పెరగడానికీ ఇతర కార్య కలాపాలు సాగించడానికీ అవసరమైన డబ్బు "క్షణశః కణశశ్చైవ విద్యా మర్థంచ సాధయేత్" క్షణ క్షణమూ కణ కణమూ విద్యనూ డబ్బునూ సంపాదించాలి అన్న హిత సూక్తి వాస్తవ జీవన స్థితికి అన్వర్థమవుతూంది.

*"జల్దు కొని కళ లెల్ల నేర్చుక*
*దేశి సరుకులు నింపవోయి"*

దేశానికి పటిష్ఠమయిన ఆర్థిక వ్యవస్థతో పాటుగా, మానసికంగా హ్లాదాన్నీ తృప్తినీ ఉల్లాసాన్నీ కలిగించే కళల అవసరమూ ఉంది. దీనికి ప్రోత్సాహమూ అవసరం. ఆర్థికం తో పాటు కళాతత్పర జీవితానికి శక్తినిచ్చేవిగా గుర్తించడం జరిగింది. ఆర్థిక భౌతిక తలాలపైనేకాక కళా రూపాలు మానసిక తలం పైన కూడా ప్రభావాన్ని నెరపుతాయి. మనిషి జీవితంలో ఈ రెండు స్థాయిల్లోనూ చక్కని వాతావరణం ఉత్తమ సమాజ స్థితికి దారి తీస్తుంది. "జల్దుకొని", "జల్దు"పదం హిందీ, ఉర్దూ భాషల్లోని "జల్దీ" పదానికి రూపాంతరం. త్వరగా వేగంగా వెంటనే అని అర్థం. ప్రాంతీయ వ్యవహారంలో మార్పులు సహజం. లౌకికమయిన స్థాయిలో అవసరాలకూ భాగ్యానికీ దారి తీసే వృత్తులూ, జీవితం గడవడానికే కాక, మానసికంగా సుఖానికీ శాంతికీ తోడ్పడతాయి. రెండిటి మేలు కలయిక భౌతిక మానసిక స్థాయిల్లో సమతకు దారి తీస్తుంది. ఇది మనస్తత్వ శాస్త్ర పరంగానూ సమ్మత మయిందీ.

రెండో అంశం శ్రామిక ఆర్థిక సమాజ వికాస స్పృహను కలిగిందీ.

*"నరుల చెమటను తడిసి మూలం*
*ధనం పంటలు పండవలె నోయ్"*

'మూల' మన్న మాట ఈ సందర్భంలో 'భూమి' ని తలపిస్తుంది. వ్యవసాయ పరమయిన ఆర్థిక వ్యవస్థకు ఆధార తలం. శ్రమ ఏ రూపంలో నయినా ప్రకటితం కావచ్చు. ఇది పలు విధాలుగా కార్య కలాపాల్లో కనిపిస్తుంది. శ్రమ ఫలాల చేత ఆహారమూ వస్తు సంపద మొదలుగా సమాజ స్వరూపం మారుతుంది. జీవన స్థితుల్లో ప్రమాణాల్లో మార్పులు వస్తాయి. ఆర్థిక సమాజ శాస్త్రాలకు సంబంధించిన మౌలిక మయిన ఆలోచన కవితాకృతిని పొందింది. సాధారణంగా వర్షించే మేఘ జలాలతో భూమి తడుస్తుంది. ఇది ప్రకృతి సహజమయిన వాస్తవం. నరుల శ్రమ చేత స్వేద జలంతో ఆర్ద్రం కావడం కవి కల్పనలో స్పందించే హృదయ భవం. ఇది సమాజానికి ఫల రూపాన్ని ప్రసాదించే శ్రమ శక్తుల ప్రాధాన్యాన్ని వ్యంజింప జేస్తూంది. ఇది మానవీయంగా తీర్చ బడింది. "ధనం పంటలు" అన్న పద బంధం ఆలంకారిక

మయింది. ఆర్థిక వ్యవస్థా పరంగా సమాజానికి భాగ్య ఫల రూపంగా అర్థవంత మవుతూంది. కవిత్వ కళను పొందింది. ఈ పద్ధతిలో పలు చోట్ల రెండు మూడు పొరల్లో అర్థ స్ఫూర్తి కవకాశం గల పదబంధాలూ, వీటి ననుసరించి భావ రూపాలూ దృష్టికి వస్తాయి. వీటిని గురించి వేరుగా సమాలోచనం జరగవలసి ఉంది.

మూడో అంశం – నైతికమూ ఉదారత శాంతి కాముకతల అవసరాన్ని చూపేదీ.

*"స్వంత లాభం కొంత మానుక*
*పొరుగు వారికి తోడు పడవోయ్"*
*"ఒకరి మేల్ తన మేలు నెంచే*
*నేర్పరికి మేల్ కొల్లలోయ్"*

నైతికమూ ఉదార భావన శాంతి ప్రియతం ఒకే భావ మూలం నుండి పాయలుగా సరిస్తాయి. వ్యక్తి స్వేచ్ఛలో ప్రవర్తనం సమాజ బాధ్యతలో ప్రవర్తనం వేరు వేరుగా ఉండవచ్చు కాని పర్యవసానం మాత్రం మంచి ఫలితాల విషయంలో ఒకటిగా ఉండడం అవసరం.

*"వ్యర్థ కలహం పెంచ బోకోయ్*
*కత్తి వైరం కాల్చవోయ్"*

మనిషిలో స్వార్థం వల్ల ఎదుర్కొనే సమస్యలూ – పరిష్కృతం కానివీ ఉంటాయి. అవి కలహానికి దారి తీస్తాయి. చివరకు రణానికి ప్రేరేపిస్తాయి. వివిధ దశల్లో హాని కారాలుగా పరిణమిస్తాయి. ఇరు పక్షాలతో పాటు సాధారణ ప్రజలూ కష్టాలకూ బాధలకూ గురి కావలసి వస్తుంది. ఈ సందర్భాల్లో కవి మనస్సు నైతికాన్ని బలపరుస్తుంది. ఉదారతను కోరుతుంది. శాంతి మార్గాన్ని వరిస్తుంది.

నాలుగో అంశం – వర్తమాన వాస్తవికతలో పురోగమన దార్శనికత. ఇది రచనలో విషయానికి సంబంధించింది. ఈ వర్తమాన వాస్తవికత, ఈ రచనలో ఆధునిక స్వరూపానికి అవసరమయిందీ. కవిలో కవితా వ్యక్తిత్వానికి ఆధారమయింది. ఇక పురోగమన దార్శనికత రచనలో లక్ష్యానికి సంబంధించింది – "మరో వైపు"లో

ఆధునిక సమాజానికి దిశా నిర్దేశాన్ని ఇస్తుంది. వర్తమానం నుండి భవిష్యత్తుకు సమ సమాజ మార్గాన్ని చూపిస్తుంది. ఈ నాలుగో అంశం గురజాడ వ్యక్తిత్వానికి మూల బలాన్ని చేకూరుస్తుంది.

*"వెనుక చూచిన కార్య మేమోయ్*
*మంచి గతమున కొంచె మేనోయ్*
*మంద గించక ముందు అడుగేయ్*
*వెనుక బడితే వెనకేనోయ్"*

ఈ పంక్తులు ఈ గీతంలోనే కాక కవి అస్తిత్వరేఖలకూ బలమైన పాత్రను పోషిస్తున్నాయి. గతంలో చూపుతో గతంలో బ్రతికే వాళ్ళను, వర్తమానంపై చూపుతో వర్తమానంలోకి పయనింప జేసేవి. గతంలో ఉన్న మంచిని స్వీకరిస్తూ, మారే కాలం వేగాన్ని అందుకొని భవిష్యత్తు పయి ఆశను వెలిగిస్తూంది. దీనికి మందత్వం పనికిరాదు. కదలిక అవసరం. ఇది చేతనకు చిహ్నం. అడుగు నేలపై వేయడం మొదటి పని. ఇక్కడి నుండి వెనక్కి అడుగు వేయడం కాక, ముందుకు అడుగు వేయడం ప్రధానం. ఇది పురోగమన లక్షణం 1) గతాన్ని గురించి స్మృతి - స్పృహ 2) వర్తమానంలో అనుభవమూ - జీవనమూ 3) భవిష్యత్తు గమ్యమూ - ప్రయాణమూ - ఈ గీతంలో దార్శనిక రూపాన్ని చేకూరుస్తున్నాయి. ఇతరులలో ఇది సామాజిక చేతనకు మహా ద్వారంలా ఉపయోగపడింది. కదలిక లేకపోవడమే మందత్వం, గతి విశేషం లేకపోవడమే సోమరితనం. ఈ అంశం యొక్క విస్తరణం "పదండి ముందుకు పదండి ముందుకు" ప్రసిద్ధమయిన శ్రీశ్రీ గీతంలో కనిపిస్తుంది. గురజాడ నుండి అందిపుచ్చుకున్న వారసత్వచ్ఛాయల్ని గమనించవచ్చు. ఆ తరువాత తన దయిన స్వతంత్ర మయిన వ్యక్తిత్వంతో పయనించడం జరిగింది. ఇది వేరే విషయం.

*"వట్టి మాటలు కట్టి పెట్టోయ్*
*గట్టి మేల్ తల పెట్టవోయ్"*

నిష్క్రియలో మాటల కన్నా సక్రియలో గతిశీలం ముఖ్యం. ప్రయోజనం లేని వేయి మాటలకన్నా ఇతరులకు మేలు చేసే ఒక్క పని గొప్పది. ఇది కాల్పనికం నుండి వాస్తవానికి దారి తీసే ఆలోచనా రూపం. కవిలో పురోగమన తత్త్వానికీ దీని కవసర మయిన క్రియాత్వానికీ సూచిక.

ఐదో అంశం – ఆధునిక చేతనతో మానవీయ స్పందనం కోరేదీ. ఈ అంశం ఈ గీతంలో కవి ఆరోహణలో శిఖర భూతమయిందీ.

"అన్న దమ్ముల వలెను జాతులు
మతములన్ని మెలగ వలెనోయ్"

అభిప్రాయ విభేదాలున్నప్పటికీ ఆధునిక జీవన విధానంతోపాటు మానవీయ భావన అందరినీ కలిపే సూత్రం. ఇది విశ్వభావనా సమర్పకమైంది.

"మతం వేరైతేను యేమోయ్
మనసు లొకటై మనుషులుంటే
జాత మన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయ్"

ఈ పంక్తుల్లో భౌతికం నుండి మానసికానికి ఆరోహణం స్పష్టం. మనసులొకటయితే, 'జాత'మన్నది ఉద్భవిస్తుంది, పెరిగి పెద్దదవుతుంది. లోక హిత కరమవుతుంది. శాంతి ప్రియమయమవుతుంది. జన్ (క్త్రాంతము) జాతము, సాధారణ మయిన శబ్దానికి అర్థం. అవతరించిందీ, పెరిగిందీ. జాతిని తలపిస్తుంది. మనుషులంతా పుట్టుకతో ఒకటై కలిసి జీవించే భావానికి దారి తీస్తూంది. ఈ శబ్దం ఆలోచనలో అర్థాన్ని దాటి సర్వ మానవ సమూహమూ మానసిక స్థాయిలో ఒకే ఒక మానవీయ దర్శనాన్ని కలిగిస్తూంది. ఈ సందర్భంలో అర్థాంతరంగా జాత మంటే మానవ సమూహ శక్తి రూపం. సంగ్రహంగా మానవ జాతి రూపం. ప్రత్యేకతల్ని కలిగింది.

"దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్"

ఇది సూక్ష్మ దృష్టితో చూడవలసిన పంక్తులు. దేశమంటే భూమి – మట్టి అన్న మాటల్లోని భావం గౌణంగానూ, భూమి పైని, మట్టి పైని మనిషి – ప్రజ– జాతి సమాజం మరో వైపు నుండి ప్రధానంగాను స్ఫురిస్తాయి. అంతే కాని పుట్టుక నుండి చివరి వరకూ అనుబంధం వీడని భూమిని తిరస్కరించడం కాదు. ఈ సందర్భంలో అంటే మరో వైపు కవి ప్రజకు ఇచ్చే ప్రాముఖ్యాన్ని బట్టి ఏర్పడే సమాజ దర్శనంలో,

దేశ మంటే మనుషులన్న మాట సరి అయిందీ, విపరీతమైన అర్థానికవకాశం లేనిదీ. కవి హృదయాన్ని పట్టుకొని రచనలో ఆలోచనా పథాన్ని అనుసరించిన ప్రయాణంలోనే సృజన దృశ్యం కనిపిస్తుందన్న విషయం, ఎప్పటికీ అన్నిటికీ వర్తించే వాస్తవం. మనిషిలో నిరంతర చేతననూ ఆధునిక మార్గంలో మానవ సమాజ వికాసాన్నీ ప్రతిఫలిస్తూందీ దేశ భక్తి గీతం.

## 2. సంస్కరణ మార్గం - పూర్ణమ్మ కథ

గురజాడ కథా కవిత్వంలో సామాజిక మయిన వస్తువుతో మార్పు లక్ష్యంగా "మరో వైపు"కు ప్రాతినిధ్యం వహిస్తుందీ 'పూర్ణమ్మ కథ'. ఇది కథనం (కథ చెప్పే విధానం)లోనూ కథలో వస్తువుకు సంబంధించిన విషయ పరిధులూ ఆయా అంశాల ఎన్నికలోనూ వాటి సంవిధానంలోనూ కవిత్వ కళతో రూపొందింది. భావ నిర్భరతలో రస నిర్వహణలో కవి ఉపజ్ఞా మహిత మయిందీ. "సహృదయ" లోకం మెప్పును పొందిందీ. కవిత్వాభిమానుల ప్రశంసనూ పొందింది. దీన్ని గురించి ఏ విధమయిన వాదోపవాదాలకూ తావు లేని గౌరవ స్థానాన్ని నిలుపుకుంది. కవితాశక్తితోనూ ప్రయోజన తత్పరత తోనూ పూర్ణమయిందీ, 'పూర్ణమ్మ' కృతి. ఆడ పిల్లల్ని ఉద్దేశించి సంబోధనా క్రమంతో ఆరంభ మయింది. పాఠకుల్ని ప్రస్తుత విషయం పట్ల సావధానతను కలిగించే సంవిధానం అవలంబింప బడింది.

*"మేలిమి బంగరు మెలతల్లా!*
*కలువల కన్నుల కన్నెల్లారా!*
*తల్లుల గన్నా పిల్లల్లారా!*
*విన్నా రమ్మా యీ కథను"*

పిల్లలు ఈ కథను విని ఉండరనే, వినాలనే ఉత్సుకతకు కారణ మవుతూంది. స్త్రీ వాచకం కథలో ప్రధాన పాత్ర పూర్ణమ్మ స్త్రీ – చిన్న వయసులో నున్నదీ – ఆమె జీవితానికి సంబంధించిన విషయం చేత ఔచిత్యాన్ని కలిగిందీ.

*"ఆటల పాటల పేటికలారా!*

*కమ్మని మాటల కొమ్మల్లార!"* ఈ దశ స్వచ్ఛతతో కొంత అమాయకతతో సంతోషంగా గడిపేదీ, ఉత్సాహాన్ని కలిగిందీ. శుభారంభంతో ముందుకు సాగవలసిన పాత్ర జీవితం మలుపు తిరుగ బోతూంది, నిరాశ ఆవరించబోతూంది. విషాదంగా పరిణమించబోతూంది "విన్నారమ్మా ఈ కథను" అనడంలోనే ఏదో అనూహ్యమయింది, జరగబోతూందన్న సూచన గుప్తంగా ఉంది. ఈ మాటలు కథలో విషయంతో తాదాత్మ్యం పొందిన కవి హృదయాన్ని స్పందింపజేస్తూంది. ఇదొక భాగం, ఒక విధంగా కథకు ప్రవేశికలాంటిది.

పూర్ణమ్మ చిన్నది. పూజారి ఇంట పుట్టింది. పుత్తడి బొమ్మ! అన్నలకూ తమ్ములకూ తోడైందీ, ఇష్టమైందీ, భక్తితో శ్రద్ధగా బంగరు దుర్గను కొలిచేదీ, ఈ దేవతా నిలయ దృశ్యం మనోహరంగా వర్ణితమయింది. కొండల నడుమ ఒక కోన ఉంది. ఆ కోనకు నడుమ ఒక కొలను ఉంది. ఆ కొలను గట్టున కోవెలలో అక్కడ వెలసిందీ. బంగరు దుర్గ! ఆయా కాలాల్లో వచ్చే పూలతో సమయాల్లో వచ్చే పూలతో రుతువుల్లో వచ్చే పండ్లతో కొలిచేది. పూలతో పూజిస్తూ పండ్లను సమర్పిస్తూ భక్తి శ్రద్ధలతో పెరిగింది. నానాటికి సుందరతా పూర్ణతకు దారి తీసే శోభను పొందుతూంది. తల్లీ తండ్రి 'కాసులకు' ఆశపడి ముదుసలి మొగుణ్ణి తెచ్చారు. దీన్ని కవి " ముదుసలి మొగుడుకు ముడి వేస్రీ" అని చివరి క్రియా రూపంలో వారీ వివాహం జరిపేందుకు పడిన తొందరను స్ఫురింప జేయడం గమనార్హమైంది. ఏ ఆటంకం వస్తుందో నన్న భయంతో కూడిన అనుమానం ఈ పనిని వేగిర పరచింది.

*"ఆమని రాగా దుర్గ కొలనులో*
*కల కల నవ్వెను తామరలు*
*ఆమని రాగా దుర్గ వనములో*
*కిలకిల పలికెను కీరములు".*

ఈ వర్ణనం సందర్భోచితంగా ఉంది. ఆమెలో యౌవన దశారంభాన్ని సూచిస్తూ వికాస శోభను తలపుకు తెస్తూంది. ఆటల పాటల్లో తోటి వారు "మొగుడు! తాత" అని కేలించడం ఆమెలో బాధను కలిగించింది. అవమాన భారంతో క్రుంగి పోయింది.

ఆటపాటల్లో తోటి వారితో కలవకుండా దూరంగా ఉంది. పూర్ణ తన పతి గృహం చేరే సమయం ఆసన్న మయింది. ఎన్నెన్నో చీరెలు సొమ్ములు కానుకలతో భర్త వచ్చాడు. పూర్ణ తనలో పొందే వేదన ఎవరికీ కనిపించలేదు. ఎవరూ గమనించనూ లేదు. ఆమె పైకి గంభీరంగా ఉంది. స్నాత అయింది. పెద్దలకు నమస్కరించింది. చిన్నలను కౌగిట చేర్చుకుంది. అమ్మనూ తండ్రినీ చక్కగా చూసుకోవలసిందిగా అన్నలకూ తమ్ములకూ చెప్పింది. "అమ్మలకు అమ్మ" అయిన బంగరు దుర్గను భక్తిగా సేవించ వలసిందిగా చెప్పింది. ఇవన్నీ, ఇంకా కొంత సమయంలో పుట్టి నింటిని విడిచి అత్త వారింటికి వెళ్ళే ముందు పలికే ఆత్మీయమయిన వీడ్కోలు మాటలుగా అందరూ భావించారు. ఇది సహజం కూడా. నలుగురిలో తన పేరు ఒక మారు తలచుకోవలసిందిగానూ కోరింది. ఇదీ సహజమే కానీ, ఇందులో విశేషమైన అర్థానికి వీలుంది. అది ఆమెను తలచుకోవలసి అవసరంలో ఇంత కన్నా దూరం ఎవరూ వెళ్ళ లేరు కూడా. తల్లి కళ్ళలో నీళ్ళు తిరిగాయి, దు:ఖించింది. ఇదీ కౌటుంబిక వాతావరణ స్థితి సహజ మనిపిస్తుంది. కానీ కూతురు పట్ల జరిగిన అన్యాయం తలపుకు రాక మానదు. భర్తతో కలిసి చేసిన పనిలో భాగస్వామ్యత్వాన్ని ఎట్లా మరచిపోగలదు? ఇది మనస్తత్వ విశ్లేషణలో తెలుస్తుంది. ఈ అంశం పైకి కనిపించదు. లోపల మనుసు బాధిస్తుంది, కలవర పెడుతుంది. ఇది తాను పూర్తిగా ఏకీభవించని స్థితిలో, ఒక పని చేయవలసి వచ్చిన సందర్భంలో తాత్కాలికంగా కనుమరుగయిన ప్రేమ వాత్సల్యం మేలుతలచే గుణం ఆ తరువాత ఆలోచనలో ఒక్కమారు మెదలడం జరుగుతుంది.

పూర్ణ తల్లి 'కంట తడి'లో ఆమె మనసులో ఆర్ద్రత ఔపచారికమయింది కాదు. కావడానికి వీల్లేదు. కారణం తల్లి కాబట్టి! కడుపుతీపి పని చేస్తుంది. తండ్రి మాత్రం "కాసుకు లోనయి" అల్లుని "చూసుక" సంతోషించాడు. నెనరూ న్యాయం విడనాడడంలో ప్రధానమైన భూమికను నిర్వహించిన తండ్రి మనోరూపం వికార చర్యతో కూడింది. అన్నలూ తమ్ములూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. బాధపడ్డారు. అల్లుణ్ణి తలచుకొని కూతురుకు సంపన్నమయిన భర్త లభించాడనీ, తనకు కాసులు లభించాయనీ రెండు భావాలూ కలిసి తండ్రిని ఆనందింప జేసాయి.

కేవలం భౌతిక మయిన స్వార్థంతో మనస్సుతో సంబంధం లేని ఆలోచనా రూపం, ఏ స్థితికి దారి తీసేదీ ముందుగా తెలియదు. ఈ స్థితిలో "ఆనందించెను అయ్యోకడె" అన్న మాట తల్లిని గురించి ఆలోచింపజేస్తూంది. ఆమెలో ఒకటి కన్న బిడ్డ పట్ల సహజమైన ప్రేమ, రెండు తోటి స్త్రీకి స్త్రీ పట్ల కలిగే మానసిక మైన మెత్తదనం మూడు ఏదో చేయరాని పనికి తల ఒగ్గిన నేర భావన లో పొరలో నుండి పైకి కనిపించనీయని స్థితిలో పూర్తిగా సంతోషించలేకపోయింది. తండ్రి ఒకడే! మిగిలాడు. ఇది మనస్తత్వ విశ్లేషణతో కూడిన వ్యక్తిత్వ చిత్రణంలో గురజాడ ఆంతర్యంగా కనిపిస్తుంది. వీడ్కోలును తలపించే కౌటుంబిక వాతావరణంతో ఈ సన్నివేశం నిర్మితమయింది. కథా గమన దృష్టితో రాబోయే కరుణ రసం పతాక స్థాయికి సూచికగా ఉంది. అంతర్లీన గుణంతో శిల్ప శోభను పొందింది.

సాయంకాల మయింది. ఎప్పటి లాగే దుర్గను కొలిచేందుకు "పూర్ణ" ఒంటరిగా సంతోషంగా గుడికి వెళ్ళింది. ముని మాపు చీకట్లు వస్తున్నాయి. అడవికి మేతకు వెళ్ళిన పశువులు ఊళ్ళోకి తిరిగి వస్తున్నాయి పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి. ఇంకాసేపటికి ఆకాశంలో చుక్కలూ మెరసాయి. పూర్ణ ఇంటికి రాలేదు. దుర్గ మెడలో హారాలు అమరాయి. పూర్ణ అదృశ్యమయింది. ఈ సన్నివేశం వ్యంగ్య శోభితంగా తీర్చబడింది.

"కన్నుల కాంతులు కలువల జేరెను
మేలిమి చేరెను మేని పసల్"
"హంసల చేరెను నడకల బెడగులు"

పూర్ణ దుర్గను చేరింది. చివరకు విషాద స్వరంతో ఒలికే కరుణ రసం రచనకు ఆర్ద్రాకృతి నిస్తూంది. సామాజికమైన దుస్థితిని హేతు దృష్టితో పరిశీలించే అవకాశాన్ని కలిగిస్తూంది. సమాజ సంస్కరణానికి ప్రేరేపిస్తూంది.

ఒక్కసారి వెనక్కి వెళ్ళితే, కథారంభంలో
"కొండల నడుమ కోనొకటున్నది
కోనకి నడుమ కొలనొకటున్నది
కొలను గట్టునా కోవెల"

లోపల వెలసిన బంగరు దుర్గ ఉంది. కథ సమాప్తిలో ఆ గుడిలో దుర్గను చేరిన పూర్ణమ్మ జీవితం, రెండు స్తంభాల మధ్య వంతెనలా ఉంది. ఆరంభంలో ప్రకృతి దృశ్యంలో పొదిగిన దైవంతోనూ, సమాప్తిలో అదే స్థానంలో ప్రకృతి దృశ్యంలో లీన మయిన పాత్ర రూపంతోనూ, రెండు భావ రూపాలూ కలిసి కవి రచనా శిల్ప దృష్టిని భావింపజేస్తాయి. కథా సమాప్తికి ముందు పుట్టింటి నుండి చివరి వీడ్కోలును తలపించే పూర్ణ ప్రవర్తనం, ఆమెలో జీవితం పట్ల కలిగిన నిరాశ నిరాసక్తిలో విషాద ఛాయ గుప్తంగా ఉంది. ఇది మనోరూప చిత్రణ స్థాయిలో కవిత్వ కళకు దీప్తి నిస్తూంది. రచనలో పూర్ణమ్మ పాత్ర కేంద్రంగా ఇతర దృశ్యాలు చేరాయి. ఇది అనవసరమయిన విషయాల జోలికి పోకుండా పరిమితుల చేత భావ సాంద్రతను పొందింది. సంక్షిప్తతకూ దారి తీసింది. అర్థాంతరంగా ఎక్కువ ఆలోచనకు పురికొల్పుతూంది.

ఇక సామాజిక కోణంలో డబ్బుకు ఆశపడి చిన్న పిల్లల జీవితాల్ని భగ్నం చేసే పెద్దల స్వార్థ మనస్తత్వాన్నీ, ఆర్థికమయిన ప్రాధాన్యంలో హార్దికమయిన శ్రేయో రూపాన్ని విస్మరించడం సమంజసం కాదన్న అభిప్రాయం స్థాపితమయింది. వ్యక్తి స్థాయిలో మొదలయి, సమాజ స్థాయిలో రావలసిన మార్పును సూచిస్తూంది. మొత్తం మీద నేడు సమాజాని కవసరమయిన ప్రగతి దృష్టినీ వాస్తవ జీవిత చిత్రణంతో సమస్యకు పరిష్కారాన్నీ భావింపజేస్తూంది. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచనలో హేతువుతో కూడిన వర్తమాన స్పృహతో ఆధునిక చేతనకు దారి తీస్తూంది. ఆధునికమన్న మాట చాల విశాలమయిన అర్థ స్ఫూర్తిని కలిగిందీ. దీన్ని ఆయా సందర్భాలకు తగిన విధంగా అన్వయించు కోవలసి ఉంటుంది. వ్యవస్థలో మార్పు కీలకమయింది. ఇందుకు సహకరించే ఆలోచనలూ విధానాలూ అన్నీ స్వీకరించవలసి ఉంటుంది. ఇది 'మరో వైపు'కు చెందిందీ. ఈ కొత్త మార్గం స్థిరమయిన లక్ష్యంతో సృజన చేతనకు ప్రత్యేకమయిన అస్తిత్వాన్ని కలిగింప చేస్తూంది. ఈ మార్గంలో గురజాడ అడుగుజాడలో తన దయిన వ్యక్తిత్వంతో వెలసిన అపూర్వమైన కృతి శ్రీశ్రీ మహా ప్రస్థానం.

గురజాడ కృతి 1) వ్యవహారిక భాషలో తెలుగు పలుకు బడితో వెలిసింది. 2) అక్షర గణ ఛందస్సులో వెలువడిన పూర్వ కావ్య సంప్రదాయానికి భిన్నంగా మాత్రాఛందస్సులో రచనకు పూనుకొని విజయవంతంగా అక్షరగణఛందో పద్యానికి

సమాంతర స్థాయిని కల్పించడం విశేషం. పూర్వం ఈ పద్ధతిలో వెలసినవి ఉన్నాయి. కానీ ఇందులో కవిత్వ కళతో రచనా శిల్పంతో భావ జాలాన్నీ రస ప్రసారాన్ని కాపాడుతూ పద్యానికి దీటుగా కొత్త ఛందస్సు "ముత్యాల సరాలు"తో ప్రత్యేకతను నిలుపుకొంది 3) ఉత్తమ కవిత్వానికి అవసరమయిన సంక్షిప్తత సుందరత వ్యంజకతతో పాటుగా ప్రయోజన విస్తృతిలో ఇందులోని ప్రగతిశీల మయిన ఆధునిక చేతన, మార్పును కోరే తరాల్ని ఆకర్షిస్తూంది. మార్పుకోరే ఆధునికమైన భావ ప్రపంచంతో ఆపూర్ణమయిందీ "పూర్ణమ్మ కథ".

## 3. కన్యక - వ్యక్తి స్వేచ్ఛ - నిరంకుశ రాజ్యాధికారం

గురజాడ కన్యక (1912 అక్టోబరు సంచిక ఆంధ్ర భారతిలో ప్రచురితం) వంద ఏండ్లు గడచినా ఇప్పటికీ సరికొత్తగా ఉంది. ప్రస్తుత సామాజిక స్థితుల్లో మార్పుకోరే మూల భావంతో అన్వయానికి తగిందిగా ఉంది. ఇది దీని అనితర మయిన ప్రభావ శక్తికి నిదర్శనం. సార్వకాలీనమయిన విలువలకు చెందిందీ.

ఇందులో వస్తువు ప్రధానంగా వ్యక్తి స్వేచ్ఛను కాల రాసే నిరంకుశమయిన రాజ్యాధికారాని కెదురుగా నిలచి (కన్‌ఫ్రంటేషన్‌తో) సత్ శీలంతో వర్తించిన ఆదర్శ స్త్రీ త్యాగ రూపం కలిగింది. రాజు – రాజ్యం, పౌరులూ వారి భద్రత, పాలనా విధానం – రాజ ధర్మం మొదలయిన సామాజిక మయిన అంశాలపై దృష్టిని ప్రసరింప చేస్తూంది. ప్రజా స్వామ్య వ్యవస్థలో విపరీతమైన వికృతమైన ధోరణుల్ని అదుపు చేసే అరికట్టే మార్గాలూ ఏర్పడినాయి. చట్టాలు న్యాయ పాలన మానవ హక్కుల పరిరక్షణ సమితులు పేరుతో, రాజ్యాంగం ప్రధానంగా ఉన్నా, దానికికి అనుబంధంగా మరికొన్ని స్థాపితమయినాయి. ఇన్ని ఉన్నప్పటికీ పాలనా యంత్రంలో తమ బాధ్యతల్ని విస్మరించని మనో రూపం ఎంతో అవసరం. వివేకంతో కూడిన ప్రవర్తనమూ చాలా ముఖ్యం. రాజరిక వ్యవస్థలో అన్నిటికి రాజే శక్తి కేంద్రం. ఇది నిరంకుశత్వానికి దారి తీసే

అవకాశాలెక్కువ. అలా జరిగితే మాత్రం మహా ప్రమాదకరమయిన విషయం! కన్యకలో ఏర్పడిన స్థితి ఇలాంటిదే!

1

ఒక రాజు తన నగరంలో ఒక పౌరస్త్రీ, కన్యక గుడికి పూజకు వెళ్ళే వేళలో నడి వీధిలో అతడు ప్రదర్శించిన దుష్ప్రవర్తన నుండి ఉపాయంతో బయట పడి, గుడిలో మండే గుండంలో అగ్నికి ఆహుతి అయిన విషయం మహా దారుణమయిందీ. కరుణ రసోపేత మయిందీ. వ్యక్తి స్వేచ్ఛకూ సామాజిక సుస్థితికీ బహు ప్రమాదకరమయింది. దీన్ని విశ్లేషిస్తే 1) సాధారణమైన పౌరస్థాయిలో ఉండవలసిన పాలనా స్థితినీ 2) వ్యక్తిగా కనీస స్థాయిలో కావలసిన మానుష ధర్మాన్నీ 3) రాజుగా పరిపాలనా ధర్మాన్నీ 4) మానసికంగా అహంకారంతో బల గర్వంతో సమత కోల్పోయిన విపరీత వైఖరినీ 'రాజు' కేంద్రంగా రాజ్యం – భద్రత కోణంలో భావింపజేస్తూంది. రాజరిక వ్యవస్థలో దుష్టత చోటు చేసుకొని, పతన మయిన విలువల్ని ఎత్తి చూపుతూందీ సృజన రూపం. దీని వెనక నుండి కవి ప్రజాస్వామ్య హృదయ స్పందనం వినిపిస్తుంది.

కన్యక తన చెలి కత్తెలతో గుడికి బయలుదేరింది. పట్టపు రాజు ఆమెను చూచాడు. కన్ను చెదరింది. చుక్కల మధ్య చంద్రుని లా కంటికి కనిపించింది. చంద్రుడు కనిపించేది రాత్రి మాత్రమే. రాత్రి చీకటికి నిలయం. ఈ సందర్భంలో రాజు మనస్సు చీకటిగా ఉందన్నమాట. అంటే వివేకం లేని స్థితి వ్యంజిత మవుతూంది. ఈ చంద్రబింబం కన్యక. తన కందని వెలుగు మూర్తిగా స్ఫూర్తికి వస్తుంది. ఆమెను వశం చేసుకోవాలనే ఆలోచన కదలింది. ఆమె అందదు. బలవంతంగా నయినా పట్టుకోవాలనే పట్టుదల ఏర్పడింది. నడి వీధిలో మంత్రులతో కలిసి "పెండెం" కట్టాడు. పెండెం కట్టడమంటే, ఆమె తప్పించుకోడానికి వీలు లేకుండా వలయాకారంగా చుట్టు ముట్టడమన్న మాట. ఆమె చేసేది లేక "దైవమే గతి"యని ధైర్యం వహించింది. "నన్ను స్పృశించకు" దైవ కావ్యం తీర్చి వస్తానన్నది. "నీ రాజ్యంలో ఉండే దాన్ని! ఎక్కడికి పోతాను?" అని ఉపాయంగా పలికింది. ఇంతలో ఆమె చుట్టాలూ తండ్రి వచ్చారు. తండ్రి కూడా కూతురు పలికిన విధంగానే మాట్లాడాడు. రాజు పట్టుదల సడల లేదు. చివరకు ఆసెట్టి "అగ్ని సాక్షిగా స్వీకరించు! కానుకలూ సమర్పిస్తా"నన్నాడు.

దానికి నరపతి సెట్టి ధర్మం నేర్పడమా!” “నేడే మంచి రోజు!” గడువులు పెట్టవద్దు! రాజులకు “గాంధర్వం ప్రశస్తం” అని కన్యకను సమర్పించవలసిందిగా ఆజ్ఞాపించాడు. రచనలో అక్కడక్కడా రాజుకు వేసే విశేషణాలు సాభిప్రాయంగా ఉన్నాయి. ఇవి రచనా శిల్పంలో భాగాలుగా కనిపిస్తాయి. రాజు ఎప్పుడు ఏది అనుకుంటే అది జరగాలి, శాస్త్రంతో ఆచారంతో ధర్మంతో నీతితో దేనితోనూ పని లేదన్న ప్రవర్తనం రాజరిక వ్యవస్థను ఆక్షేపణకు గురి చేస్తుంది. తీవ్రమయిన వ్యతిరేకతకు ప్రేరేపిస్తుంది.. దీని వల్ల లాభం కన్నా జరిగే నష్టమే ఎక్కువ అన్న నిర్ణయానికి దారి తీస్తుంది.

*“డేగ పిట్టను పట్టి విడుచున?*

*తిరిగి ఇంటికి వెళ్ళ గలదా!”* అని తన కఠినమయిన, అనుచితమయిన నిశ్చయాన్ని తెలియజేసాడు. ఆలస్యాన్ని ఓపిక పట్టకలేకపోయాడు. కానుకలు తీసుకొని రా, ‘నీవు వెళ్ళి తెచ్చే దాకా నేను కదలన”ని మొండి తనం వహించాడు. సెట్టి ఉపాయంగా “ముందు దైవ కార్యం తరువాత రాచ కార్యం కాదా” అని తెలియజేసాడు. దైవ కార్యాన్ని ముందు జరపకుంటే తన కేమి ప్రమాదం జరుగుతుందోనని రాజులోలోన భయపడం జరిగింది, ఇది సహజం. ఇంటి దైవం వీరభద్రుని గుడికి వెళ్ళి “పళ్ళెర మెత్తి” వస్తానన్నాడు. “మంచిది నేనూ వస్తానన్నాడు” సెట్టి మీద నమ్మకంలేకనో, ఆలస్యమయితే చేయి జారి పోతుందనో, అనుమానం! దైవ కార్యం ముందు వెనక్కి తగ్గాడు. తన కోరిక కాస్త ఆలస్యంగా తీరుతుందనీ ఊరట చెందాడు. వారితో బయలు దేరాడు. గుడిలో ‘అగ్ని సాక్షి’గా కన్యకను పొందడానికి సిద్ధమయ్యాడు. ఇక తనకెదురు లేదనీ, మార్గం సుగమ మయిందనీ సంతోషించాడు. దుడుకు తనం తగ్గింది. ఇంత వరకూ ఒక భాగం, నడి వీధిలో జరిగిన సన్నివేశం. వ్యక్తి స్వేచ్ఛ అంతరించింది. రాజ ధర్మం లోపించింది. నైతికత దెబ్బ తిన్నది. ఇదొక విధంగా అరాచకం, అదీ రాజు చేతనే పాలనా రూపం వికృతమైంది. ఇదొక దయనీయమైన స్థితి. ఇపుడు జటిలమైన విషమ సమస్యకు కొంచెం విరామం దొరికింది, అంతే!

2

వీర భద్రుని గుడిలో గుండంలో అగ్నిపై కెగసి మండుతూంది. ఇది రాజు మనస్సుపై  మానసిక ప్రభావాన్ని నెరపింది. అతని గుండె దిగులు పడింది. తాను

పట్టు కోలు పోతూన్నట్లు తోచింది. మనసులో లోపలి నుండి తాను చేసి తప్పు 'అగ్ని సాక్షి' ఎదుట భయ భావాన్ని కలిగించింది. ఇది దోషిలో అనుభూత మయ్యే అంతరంగ ప్రభావ పర్యవసానం. దీన్ని అణచి వేయడం కొంత వరకే సాధ్యం! ఎపుడో ఏ చర్యలోనో కలలోనో సందర్భంలోనో తల ఎత్తుతుంది, కలలో ప్రతీకలో ప్రత్యక్షమవుతుంది. బయట పడుతుంది. ఇది మానసిక శాస్త్ర విషయం. పైకి ఎంతో గంభీరంగా కనిపించవచ్చు. కాని లోపలి రహస్యం వేరు. కలత పెట్టవచ్చు. బాధించవచ్చు. వెంటాడవచ్చు. ఇవి చేసిన తప్పును బట్టి ఉంటాయి. దీని పర్యవసానం మానసికంగా అనుభవంలో ఉంటుంది.

కన్యక భక్తితో దుర్గను కొలిచింది. తాను ధరించిన నగలు తీసి దేవికి సమర్పించింది. అక్కడ ఉన్న కొలనులో మునిగి వచ్చింది. ఎరుపు గంధం అలుముకొంది. ఎరుపు పూల మాల ధరించింది. ఎరుపు వస్త్రం వీర భద్ర పూజా విధానానికి సంబంధించి గానూ దీనితో పాటు ప్రమాద విలయ చిహ్నంగానూ భావించే వీలుంది. గుండం సమీపించింది. అక్కడున్న వాళ్ళ నుద్దేశించి మానుష ధర్మాన్నీ, సమాజంలో వ్యక్తులుగా తమ బాధ్యతనూ, కర్తవ్యాన్నీ పలికింది, వ్యక్తికి తన వాళ్ళను తన బంధువులను కాపాడుకునే హక్కుతోపాటు ఇతరులను న్యాయోచితంగా కాపాడే అవసరాన్నీ ఆ ధర్మాన్ని మరవ కూడదని హితవు పలికింది. ఆ సమయంలో నిలచి రాజును ఆక్షేపించింది. రాజ ధర్మాన్ని జ్ఞాపకం చేసింది. ఇప్పుడున్న దయనీయమైన శోచనీయ స్థితిని గుర్తు చేసింది. పట్ట మేలే రాజుకు పైన, రాజు నేలే దైవాన్ని జ్ఞాపకం చేసింది. ఆ దైవ శక్తినీ తలచింది. దోషికి శిక్ష తప్పదనీ ఆమె విశ్వాసం. ఈ మాట ప్రజలకూ వర్తించే విధంగా, ఒక దుష్ట నృపతి అధర్మంగా ప్రవర్తిస్తూ ఉంటే మౌనంగా ఉండి పోవడం "సరికాద"న్నది. సాటి మనిషి అందునా స్త్రీ! బంధువులూ ప్రజలూ ఆదుకొని "పరువు నిలపను! పౌరుషము మీకేల కలగదొకో!" అని సూటిగా ప్రశ్నించింది. ఆశ్చర్యాన్ని ప్రకటించింది. పరువు నిలిపే, పౌరుషము చూపే దిశగా ప్రేరణ శక్తి కలిగినవీ మాటలు! నిరంకుశ రాజ్యాధికారాన్ని బాహాటంగా వ్యతిరేకిస్తున్నాయి.

"విద్య నేర్చిన వాడు విప్రుడు

వీర్య ముండిన వాడు క్షత్రియు" డన్న సూక్తిలోని ఉత్తమ లక్ష్యాన్ని స్వార్థానికీ చెడు పనులకూ ఉపయోగించరాదనీ స్పష్టం చేసింది. "డబ్బు" కోసం "పదవి"

కోసం, ధర్మం మరవ కూడదనీ పలికింది, విద్య మరియు బలాన్ని ధర్మబుద్ధితో న్యాయ పద్ధతితో ఉపయోగించే వ్యక్తి 'రాజులలో రాజవు' తాడని నిష్కర్షగా తేల్చి చెప్పింది. మనిషిగా కనీస స్థాయిలో వర్తించే విధంగా లేకపోవడం, రాజుగా సాధారణ స్థాయి కూడా లేకపోవడం సమస్యకు మూల కారణమన్న విషయాన్ని తెలిపింది. ఇక్కడ గమనించవలసిన అంశం, ఒక రాజ్యానికి అధిపతితో సాధారణమైన ఒక పౌరస్త్రీ, ఎదురు తిరిగి, నిలిచి (కన్‌ఫ్రంటేషన్) ప్రశ్నలకు గురి చేసింది. సమాజంలో ప్రజలకూ తమ బాధ్యతను గుర్తు చేసింది. ఇది వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయికి తీసుకొని వెళ్ళడం చరిత్రలో నిరంకుత్వానికి వ్యతిరేకమైన చర్యలో పరిణామ రూపం. ఇంతవరకు ఇదొక ఘట్టం.

కులం పెద్దలు ఇక్కడే ఉన్నారు. అగ్ని సాక్షికి అగ్ని ఇక్కడే ఉంది. నీ కళ్ళు కోరిన కన్యక ఇక్కడే ఉంది. "ఆలస్యం దేనికి? లేచిరా!" అని శాసించింది.

*"పట్టు మేలే రాజు వయితే*
*పట్టు నన్నిపుడనుచు"* అగ్ని జ్వాలలో లీనమయింది. త్యాగమూర్తిగా యశో రూపాన్ని పొందింది. హఠాత్తుగా జరిగిన ఈ మలుపును ఎవరూ ఊహించనిదీ, కోరనిదీ. ఖండింప దగినదీ.

ఆమె ఇంతటి సాహసానికి సిద్ధమవడం, ఒక అసాధారణ విషయం. ఆ రాజు నుండి తనకు విమోచనం దుర్లభమనీ, తనకు అండగా ఉండవలసిన తండ్రి రాజు బలానికి లొంగిపోయి కానుకలతో సమర్పించడానికి సిద్ధపడడమూ, ప్రజ నుండి ఏ విధమయిన స్పందన లేకపోవడమూ, ఈ విధమైన సమాప్తికి దారి తీసాయనుకోవచ్చు.

ఈ సన్నివేశం ముగిసాక కవి మాటలు చారిత్రక భూమికలో సామాజికమైన దుస్థితినీ, రాజ్య వ్యవస్థలో మార్పు అవసరాన్నీ గుర్తు చేస్తూ కవి ప్రజాస్వామ్య హృదయాన్ని భావింపజేస్తాయి.

*"రాజు గర్వం మట్టిలో కలిసింది*
*కోట పేటలు కూలి పోయాయి."* ఆకాశమెత్తుగా కన్యక యశో రూపం

సౌధాకారాన్ని పొందింది. ఇది రాజరికం బదులుగా ప్రజాస్వామ్య భావనకు దారి తీస్తుంది.

"కీర్తి అపకీర్తి" "పదం పద్యం పట్టి" నిలిచాయి, అక్షరాకృతిలో కవి మనోరూపం ప్రస్తుత స్థితి నుండి భవిష్యత్తుకు కర్తవ్యాన్ని సూచిస్తుంది. నిరంకుశమైన రాజ్యాధికారం స్థానంలో ప్రజాస్వామ్య భావ రూపాన్ని వ్యక్తి స్వేచ్ఛకూ సమాజ శ్రేణానికీ అవసరమైందిగా వ్యంజింప చేస్తుందీ "కన్యక" – కృతి.

## 4. కన్యాశుల్కం - ప్రజాస్వామ్య దార్శనికత

కన్యాశుల్కం నాటకం గురజాడ అస్తిత్వంలోని ప్రజాస్వామ్య దార్శనికతను ప్రతిఫలిస్తుంది. ఇది నాటక రచయిత ఉపజ్ఞ చేత అంతర్విలీన శిల్పాన్ని పొందింది. దీని ప్రభావం చివరలో సమస్యల పరిష్కారం భవిష్యత్తు నిర్దేశం మార్పు కోరే లక్ష్యంలో స్ఫూర్తికి వస్తుంది. తెలుగు సాహిత్యంతో మరో వైపును చూపిస్తుంది. స్థూలంగా వ్యక్తి స్వేచ్ఛ సామాజిక బాధ్యత నైతికమైన విలువలు న్యాయమైన మంచి పాలనా కర్తవ్యం అవసరాన్ని భావింపచేస్తుంది. పూర్వ సాహిత్యానికి ప్రాచీన శాస్త్రాల అవసరం వలెనే ఆధునిక సాహిత్యానికీ ఎంతో కొంత సామాజిక శాస్త్రాల పరిచయమూ అవసరం. గురజాడ సాహిత్య విషయంలో అందునా సామాజిక సమస్య వస్తువుగా ఉన్న "కన్యాశుల్కం" నాటకం గురించి సరియైన సమాలోచనకు చాల అవసరం. ఈ ఆలోచన వెనుక నుండి రచయిత వ్యక్తిత్వంలో ప్రజాస్వామ్య స్పందనల్ని స్పష్టంగా గుర్తించవచ్చు. రచనలో దీని ప్రభావం ఆధునికానికి లక్ష్యాన్ని చేకూర్చింది. ప్రయోజనానికి విస్తృతిని చేకూర్చింది. ప్రగతి మార్గాన్ని చూపించింది.

సూక్ష్మంగా : సంస్కరణమూ స్వతంత్రత – మంచి తనమూ మానవత – మార్పూ ప్రగతికీ చెందిన దృష్టి "మరో వైపు"కు నడిపిస్తాయి. నాటకంలో పాత్రల రూపంలో ఉన్న వ్యక్తులకు చివరలో ఎవరికి తగింది. వారికి మేలు చేకూర్చే యోజనతో

సిద్ధించింది. దీనికి ప్రధాన హేతువు సౌజన్యారావు. ఇది భవిష్యతుపై దృష్టితో దీర్ఘ కాలికమయిన ప్రయోజనం కలిగింది. రచయితలో సానుకూల (పాజిటివ్) మనోరూపం, రచనలో గిరీశం బుచ్చమ్మ మధురవాణి తదితరుల ఆశావహమైన భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడింది. ఈ కారణంగా నాటకంలో చివరి దృశ్యాల్లో పాత్రల తీరులో వారి వారి గమ్యాలకు చేర్చే తీర్పుకు ప్రాధాన్యం ఏర్పడింది. విషయ పరిణామంలో పర్యవసావానికి సార్థకత సిద్ధించింది. రచయిత హాస్య చతురత గిరీశంలోనూ, ఆశా (పాజిటివ్) వహమైన ఉదారత సమస్యల పరిష్కార లక్ష్యాల్లో ఒక నిర్దేశకతతో సౌజన్యారావులోను ప్రకాశ రూపాన్ని పొందాయి. ఇది గురజాడ జీవిత చరిత్రతో పరిచయం ఉన్న వారికి 'అవున'నిపించే మనస్తత్వ పరమైన అంశం.

నాటకం సప్తమాంకంలో సౌజన్యారావు ఇంట్లో దృశ్యాల్లో గిరీశం బుచ్చమ్మ, మధురవాణి ఇరువురు అవధానులూ మరియు శాస్త్రి మొదలుగా వారి వారి సమస్యల చిక్కుముడులు విప్పారడం జరిగింది. వాటికి పరిష్కారాలు కనుగొనడం గొప్ప విషయం. గిరీశం బుచ్చమ్మ ఇరువురి విషయంలో భవిష్యత్తు ప్రణాళిక నిర్దిష్టమయింది. నాటకం చివరల్లో తిరిగిన మలుపు నాటకీయ శిల్పంతో మనసుకెంతో హ్లాదాన్నీ తృప్తినీ కలిగిస్తూంది. అందరికీ వారి వారి స్వతంత్రతను మన్నిస్తూ, మేలు జరిగే విప్పుదల (unfolding) సుఖాంతంగా సాగింది. ఇది భారతీయ చింతనకు దగ్గరగా ఉంది. నాటకంలో చిట్ట చివరి పంక్తి గిరీశం నోట వెలువడిన మాట "డామిట్! కథ అడ్డంగా తిరిగింది." రచనకు "హైలైట్". దీని ప్రకాశం, ఇప్పటివరకూ జరిగిన కథను స్మరణకు తెస్తుంది. ఇక జరుగబోయే మార్పుకూ సంకేతంగా ఉంది. గిరీశం బుచ్చమ్మ మధురవాణి లుబ్ధావధానులు అగ్నిహోత్రావధానులు కరటక శాస్త్రి వేంకటేశం రామప్పంతులు తదితరులతో నాటకం చివరలో సౌజన్యారావు కీలకంగా వారి వారి సంబంధాలతో అల్లబడిన నాటకం, బలంతో పాటుగా బలహీనతల్ని కలిగిన మానవ జీవితాన్ని ప్రతిఫలిస్తూంది. చివరకు మనిషిలో సంకల్ప బలం ప్రయత్న శీలం వివేకంతో కలిసిన ఆశా రూపం బలహీనతల్ని అదుపులో పెట్టింది. కొత్త మార్గాల్ని చూపింది. క్రుంగిపోయే జీవితాల్ని పైకెత్తడమూ జరిగింది. మరో

వైపు పయనానికి సన్నద్ధం చేయబడింది. ఈ మార్పులు కాలాంతరాన మంచి భవిష్యత్తును సూచించేవిగానూ ఉన్నాయి.

సౌజన్యారావులో హిత దృష్టి లోకోప కారకమయింది. ఇది వ్యక్తి స్థాయిలో స్వేచ్ఛతో కూడిన సంస్కరణం, సమాజ స్థాయిలో మార్పుతో కూడిన పురోగమనం లక్ష్యంగా ఉంది, ఇది ప్రజాస్వామ్య దార్శనికతను బింబిస్తుంది. ప్రస్తుత పరిశీలనం ఈ పరిమితుల్లో సాగింది) ఈ దార్శనికత గురజాడ మరోవైపు, అస్తిత్వానికి మూలధారమయింది.

'కన్యాశుల్కం' సమస్య అంతటా ఉండక పోవచ్చు. ఆ కనిపించే చోట కూడా ఎప్పటికీ ఉండకపోవచ్చు. అయినప్పటికీ, వ్యక్తుల్ని అమ్ముకొనే దుస్థితి ఉండకూడదనీ, మనిషి విలువ ఎంతో కొంత డబ్బుకు అమ్మ బడే వస్తువు కారాదనీ, పిల్లల విషయంలో ప్రేమను కోల్పోరాదనీ, మానవతను కోల్పోయే మానసిక దారిద్ర్యం రాకూడదనీ, రచయిత ఆంతర్యం! వ్యక్తి స్వేచ్ఛను అణచి వేయరాదనీ, నైతికమైన విలువల్ని విస్మరించరాదనీ, ప్రేమ వాత్సల్యం స్నేహం మొదలయిన మానసికమైన అనుబంధాలు వ్యాపార వ్యవస్థలో భాగం కారాదనీ, గురజాడ ఉద్దేశం. కన్యాశుల్కమయినా వర విక్రయమయినా మరొకటి మరొకటి అయినా సామాజిక రుగ్మతలకు సంబంధించినవి. వీటిలో దౌర్భాగ్య స్థితులొకటే! ధన సంపాదనలో వికృతమైన రీతులొకటే! మానసికంగా పతన స్థితులొకటే! మనిషి జీవితంలో కోల్పోకూడనిదీ అమూల్యమైనదీ ఒకటే! అది ఆత్మ గౌరవం! ఈ కారణాల చేత 'కన్యాశుల్కం' నాటకం ఎప్పటికీ కొత్తగానే ఉంటుంది సార్వకాలికమయిన ప్రయోజనం కలిగింది. అనితరమయిన దార్శనికతతో చీకటి నుండి వెలుగులోకీ, మౌఢ్యం నుండి వివేకానికీ పయనింపజేసే కళా రూపంగా అవతరించింది.

నాటకం ఆరంభం ఒక యువకుడు గిరీశం స్వగతంతో ఆకర్షిస్తుంది. బ్రతుకు గడచేందుకు అవసరమైన డబ్బుకై బయలుదేరతాడు. దారి తప్పిన ఆలోచనలతో కాలాన్ని వెళ్ళబుచ్చే "పూర్ యంగ్ మాన్", పేద యువకుడు! జాలిగొలిపేవాడు.

ఎప్పటి కపుడు కొత్త కొత్త ఉపాయాలతో ప్రత్యక్ష మయ్యేవాడు. ఇతని మనోరూపం సంశ్లిష్ట (complex) మైంది. ఈ వ్యక్తి దుస్థితి సమాజ వ్యవస్థతోనూ ముడి వడింది. పాత్ర ప్రవేశం ఆధునికమైన పాశ్చాత్య ప్రభావ ముద్రతో జరిగింది. చిత్రమేమంటే ఈ పాత్ర నిష్క్రమణం చిట్ట చివర "కథ అడ్డంగా తిరిగింది" మాటతో పశ్చాత్తాప మనోరూపంతో ఆశ్చర్యకరంగా జరిగింది. బాధామయ మయిన దుస్థితి నుండి ఆశావహమైన సుస్థితి చూపే  సూచనకు మరలింది. ఎంతో మిగిలి ఉన్న జీవితాల్ని సరియైన మార్గంలో పెట్టేందుకు సౌజన్యారావు ప్రయత్నం ఆదర్శవంతమయింది. గిరీశంతో ముడివడి ఉన్న బుచ్చమ్మ విడోస్ హోమ్ (వితంతు నిలయం)కూ, ఆమె చదువుకొనీ తన దారి తాను ఎన్నుకొనే స్వతంత్ర మయిన జీవన లక్ష్యంగా గిరీశం మోసపుటంలోచనీ నుండి బయట పడింది. మధురవాణి తన వేశ్యావృత్తికి స్వస్తి పలికి ఉపకార గుణంతో మంచి దారి నవలంబించింది. ఈ విధంగా నిర్మాణాత్మకమైన ఆలోచనలతో నాటకం స్వేచ్ఛా రూపమైన ప్రజాస్వామ్య భావనతో స్పందితమైంది.

సౌజన్యారావు ఇంట్లో గిరీశం తన ప్రవర్తనకు దారి తీసిన పరిస్థితుల్లో తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపం ప్రకటిస్తాడు. ఇదొక మంచి పరిణామం. అతనిలో జరగబోయే మార్పుకు సూచనగా ఉంది. మళ్ళీ ఆ దారినే వెళ్ళకుండా జాగ్రత్త పడవలసి ఉంటుంది. ఇది కొనసాగుతుందనే ఆశ మానవ సహజం. మొదట పేదరికం నుండీ, డబ్బు అవసరం నుండీ దూరం కావలసి ఉంటుంది. దీనికి సౌజన్యారావు నుండి ఆశ్వాసం లభిస్తుంది. గిరీశం గతించిన జీవితాన్ని ఒక కలగా భావిస్తాడు. దాన్ని మరచి పోయి కొత్త జీవితంలోకి వచ్చిన విషయమూ చెబుతాడు. తాను రిఫార్మ్ అయిన  విశేష వార్తతో పాటు, "ఐ క్రేవ్ యువర్ మెర్సి" అని సౌజన్యారావు "దయ కోసం" తపిస్తాడు, ప్రార్థనా పూర్వకంగా అభ్యర్థిస్తాడు. ఇంతకూ గడచిన జీవితం చూస్తే మాత్రం ఎంతటి వారినైనా నమ్మించే చాతుర్యం కనిపిస్తుంది. సౌజన్యా రావునే భ్రమింపజేసాడు. సౌజన్యారావు లాయరు. ప్రతిదీ జాగ్రత్తగా హేతు దృష్టితో పరిశీలించి ఆచి తూచి అడుగువేసే వ్యక్తి. గిరీశాన్ని కనిపెట్టలేకపోయాడు. అయితే నాటకంలో కథా పరిణామ సందర్భాన్ని బట్టి గిరీశం విశ్వసనీయతను సందేహించే

అనవసరం లేదనిపిస్తుంది. గిరీశం సహజంగా మంచి తెలివికలవాడు. ఎటువంటి అననుకూల పరిస్థితుల్లోనూ నెట్టుకొని రాగలిగినవాడు. అయితే అతడు అవసరాల నిమిత్తం స్వార్థంతో ఆలోచనలు సరిగా లేక పోవడంతో నడత బాగా లేకపోవడంతో అంతటి తెలివి సామర్థ్యం వ్యర్థమవుతున్నాయి. మరొకరికి అపకారమూ జరిగే అవకాశమూ ఉంది. ఒక అంశం నుండి మరో అంశం ఒక పాత్ర నుండి మరో పాత్ర అల్లుకొని సాగే జీవితంలో వలెనే, నాటకమూ పరస్పర సంబంధాలతో "సంశ్లిష్ట" తను పొందుతూంది. మరో పాత్ర గురించి ఆలోచన తప్పని సరి అవుతుంది.

ఈ నేపథ్యంలో గిరీశం పాత్రను విశ్లేషిస్తే

1. ఆధునిక యుగంలో పాశ్చాత్య ప్రభావంతో మేలిమి వంట బట్టకుండా యువత ముఖ్యంగా పైపై మెరపుల తళతళలతో కాలం గడిపే తీరునూ.

2. చాలీ చాలని సంపాదనలో పరిస్థితుల్ని అధిగమించలేక అపమార్గాన్ని అనుసరించే విపరీత ధోరణినీ.

3. నేర్చిన కాస్త చదువుతో, అది కూడా లేని వారి ముందు తమలో ఉన్న విషయాన్ని కొండంతలుగా ప్రదర్శించడమూ.

4. ఏలాగయినా నాలుగు డబ్బులు సంపాదించి లేదా ఏదో ఒక పేరు మీద ఇళ్ళలో తిష్ఠవేసి కాలం గడపడమూ.

5. స్వార్థంతో నైతికమైన విలువల్ని మరచిపోవడమూ

6. వ్యక్తి స్థాయిలోనేకాక సమాజ స్థాయిలోనూ కనీస ప్రమాణాల్ని వదలి, బాధ్యతల్ని విస్మరించడమూ. వీటికి తోడు యువతకు చదువూ, బ్రతికే అవకాశాలూ కల్పించలేని పాలనా వ్యవస్థలో లోపాల్ని తలపిస్తూంది. ఇది ఇట్లా ఉంచి వస్తూన్న మార్పుల్ని పట్టించుకోకుండా మూఢ విశ్వాసాలతో స్వార్థ చింతనతో పాత వ్యవస్థకు చెందిన ఆలోచనలూ సమస్యలకు ప్రధాన కారణాలవుతున్నాయి. వివేకంతో ప్రవర్తించవలసిన అవసరాన్ని భావింపజేస్తున్నాయి.

ఈ విచిత్ర వాతావరణంలో 'పూర్ యంగ్' మాన్‌గా అవతరించి నాటకంలో 'ఆషాఢ భూతి'గా పేరు పొంది, ఆపైన 'డెవిల్' అనిపించుకొనీ, చివరకు పశ్చాత్తాపంతో సౌజన్య రావు దయకు తపించే 'రిఫార్మ్ అయిన వ్యక్తిగా పరిణమించడం – నాటకంలో ఒక్క గిరీశమే కాదు, సమాజంలో ఆశావహమైన ప్రతి వ్యక్తి. భవిష్యత్తును ఆవిష్కరిస్తూంది. పూర్వపు వ్యవస్థలోని పాదుకొని ఉన్న అజ్ఞానాన్నీ మౌఢ్యాన్నీ, లోకంతో పని లేని జీవన విధానాన్నీ, స్వార్థానికి ఉపయోగించుకొనే పరిస్థితి దారుణంగా ఉన్న విషయం గిరీశం పాత్ర ద్వారా స్పష్టం. ఇతని ఆలోచనలు చెడు మార్గంలోనే సాగాయి. ఇది ఎంత కాలం? ఇక్కడ గురజాడ ఫుల్‌స్టాప్ పెట్టలేదు. ముందుకు వెళ్ళాడు. గిరీశం యువకుడు, ఎంతో భవిష్యత్తు ఉన్నవాడు. ఇలా అవడం బాగాలేదు, కాని అయింది. యువ తరాన్ని కాపాడవలసిన బాధ్యత పెద్దలపై సమాజంపై ఉంది. వారూ తమ ప్రవర్తనను సమీక్షించుకొని సరిదిద్దుకోవలసి ఉంది. మానసికంగా మార్పుకు సిద్ధం కావలసి ఉంటుంది. ఎవరు తమ కర్తవ్యాల్ని విస్మరించినా సమాజానికి ప్రమాదం! ఈ విధంగా గిరీశం పాత్ర యువ లోకానికి ఆధునిక ప్రతినిధిగా ప్రాముఖ్యం ఏర్పడుతూంది. దీనిలో కీలకమయిన అంశాలు 1. స్వేచ్ఛ 2. నైతికత 3. మానవత 4. ఆధునికత, అనేవి హేతు దృష్టితో వర్తిస్తాయి. చివరి మలుపు ఈ నాల్గింటి ప్రమేయంతో గురజాడ ప్రజాస్వామ్య దార్శనికతను సమాలోచనంలో నిలుపుతూంది.

గిరీశం "రిఫార్మ్" అయినాడు! ఆ మాటను చేతల్లోకి మార్చవలసి ఉంది. అతడు కాలేజిలో చేరి చదువుకొని పరీక్షలు వ్రాసి బాగుపడే ప్రణాళికను సౌజన్యారావు సిద్ధం చేసాడు. ఇందులో నిస్సందేహంగా గురజాడ క్రియాత్మకమైన ప్రజాస్వామ్య చింతనం కనిపిస్తుంది. అతని ప్రవర్తన బాగా ఉన్నంత వరకూ డబ్బు సహాయం చేయడానికి పూనుకున్నాడు. ఇది ఒక సంస్థ వ్యవస్థ చేయవలసిన పని. బుద్ధి తెచ్చుకొని చక్కగా చదువుకొని పైకి రావలసిందిగా హితవు పలికాడు. ఇది గిరీశానికి ఉత్తమ ప్రయోజనాన్నీ సౌజన్య రావుకు ఆదర్శ సార్థకతనూ కలిగిస్తూంది.

గిరీశం పన్నిన ఉచ్చు నుండి బుచ్చమ్మను జాగ్రత్త పరచడమూ జరిగింది. ఆమెను "విడోస్‌హోమ్"కు పంపడానికి ఏర్పాటు చేయడమూ పాత్రకు న్యాయం జరిగింది. అక్కడ ఆమె చదువుకొని స్వతంత్రురాలై తన జీవన మార్గాన్ని ఎన్నుకొనే

స్వేచ్ఛను కలిగింది. ఈ ప్రయత్నం ప్రజాస్వామ్య భావనతో ఆచరణ శీలాన్ని కలిగిన నాటకకర్త మనోరూపాన్ని బింబిస్తూంది. నాటకం గిరీశం పాత్ర స్వగతంతో ఆరంభమయింది. ఆర్థికమైన ఇబ్బందిలో బ్రతకడానికి స్వార్థంతో కూడిన ఆలోచన అపమార్గాన ప్రయాణింపజేసింది. నాటకం చివరలో ఆ పాత్ర వివేకం కలిగి, తన తప్పుల్ని తెలుసుకొని బ్రతకడానికి ప్రయత్నంతో కూడిన సంస్కరణం మంచి మార్గానికి తెచ్చింది. ఈ మార్గంలో ఆర్థిక మయిన ఇబ్బందికి భరోసా కూడా లభించింది. సమాజంలో పూర్తి స్థాయిలో పాలనా పరంగా జరగవలసిన విషయం దృష్టికి వస్తుంది. ఇది వ్యక్తిపరంగా జరిగింది. ప్రభుత్వాల బాధ్యతనూ గుర్తు చేస్తూంది.

ఇందులో హాస్యం సముద్రంపై ఫేనం (నురగ)లా కదలుతూ లేస్తూన్న దృశ్యాన్ని తలపిస్తుంది. ఇదే సముద్రం కాదు. లోతుతో విస్తృతితో చలనంతో అలల గమనంతో మహా సముద్రం లాంటిది ఈ నాటకం!

యువవతతోపాటు సమాజానికీ, వ్యక్తి స్థాయిలోనూ సమాజ స్థాయిలోనూ బాధ్యతల్ని గుర్తు చేస్తూ తను తమ కర్తవ్యాల పట్ల ఉన్ముఖుల్ని చేస్తుంది. ఈ క్రమంలో సృజన రూపం సామాజిక బాధ్యతతో ఇంతకు ముందు లేని ప్రజాస్వామ్య దార్శనికతతో సాహిత్యంలో 'మరోవైపు'కు మార్గదర్శకమవుతూంది.

## 5. కన్యాశుల్కం - సంవిధాన కళ

ఆధునిక తెలుగు నాటక చరిత్రలో కన్యాశుల్కం గొప్ప మలుపును తెచ్చింది. ఇంతకు ముందు తెలుగు నాటక పరంపరలో ఎరగని కొత్త ఆలోచనా మార్గాన్ని తెరచింది. దీని కిదే సాటిగా ప్రత్యేక స్థానంలో స్థిరపడింది. కాలం గడుస్తూన్న కొద్దీ దీని ప్రయోజనం ఇనుమడిస్తూంది. ప్రయోజన విస్తృతిని పొందుతూ ఉంది. ఈ రచన విశ్లేషణలో సంవిధాన కళ నాటక నిర్వహణ శిల్పంతో కొత్త దనాన్ని భావింపజేస్తూంది. దీనికి సంబంధించిన అంశాలు అవగాహనకు బాగా తోడ్పడతాయి. ఇవి రెండు విధాలుగా ఉన్నాయి. ఒక వరుసలో 1) యథాతథ మయిన వాస్తవ

జీవితం 2) ఆధునికావసరమయిన సమాజ సంస్కరణం 3) ప్రగతి లక్ష్యం కలిగిన దార్శనికం కనిపిస్తాయి. మరో వరుసలో 1) ఎన్నుకొన్న వస్తువులో సామాజిక విషయాలకు సంబంధించిన స్థితుల సహజమైన ఏర్పాటు 2) తాము బ్రతికే వ్యవస్థలో పెరిగిన వాతావరణంతో పాత్రల మనస్తత్వరీతులూ 3) రెండు స్థాయి (పొర)ల్లో కరుణ హాస్య రస మేళనం స్థితులూ కనిపిస్తాయి. ఇవి వేటి కవిగా కాక పరస్పరమూ అనుబంధంతో ఏక రూపతను పొందాయి. ఈ ఆరు అంశాలూ నాటక రచనా ప్రణాళికలో నిర్మాణ స్తంభాలుగా నిలిచాయి. వీటి సమాకలనంలో నాటక శిల్పం విశ్లేషణ కందుతుంది. ఈ ఆరు అంశాలూ ఒక దాని నుండి మరొకటీ, ఒక దానితో మరొకటీ శాఖోపశాఖలుగా విస్తరించీ నిర్మాణంలో కలిసీ రచన బృహదాకృతిని పొందింది. ఈ కారణంగా పూర్తి నాటకాన్ని నియతమైన కాలంలో ప్రదర్శించడానికి కాస్త ఇబ్బందికరంగానూ పరిణమించింది. ఎవరికి నచ్చినవీ వారు అవసరమును కొన్నవీ వారు తీసుకొని, మౌలిక మయిన స్వరూపం కోల్పోకుండా ప్రదర్శించడం జరిగింది. ఈ పద్ధతి సహృదయలోకం ఆమోదాన్నీ ప్రశంసల్నీ పొందింది.

పూర్వం పౌరాణిక మయిన కథను తీసుకొని, పాత్రల ద్వారా సంభాషణల్లో అప్పటి సమస్యల్ని సూచించడం జరిగింది. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తి, విషయంలో, ఈ విధానం బాగా ఉపకరించింది. కన్యాశుల్కంలో సామాజిక సమస్య స్ఫుటంగానూ ప్రయోజనం స్పష్టంగానూ లక్ష్యం సూటిగానూ ప్రగతిశీల దర్శనంతో ఆవిష్కృత మయింది. ఈ నాటకంలో ఇతివృత్తం పూర్తిగా 1) జీవితమూ - సమాజమూ 2) వాస్తవమూ - నైతికాదర్శమూ 3) యథా స్థితి - పరివర్తనం స్థితుల మధ్య అనివార్యమయ్యే విభేదాలు ఘర్షణలు పర్యవసానాలతో ప్రవృత్తమయింది. వీటి కలయికలో సంవిధాన శిల్పం రచనకొక అపూర్వమయిన అస్తిత్వాన్ని చేకూర్చింది. తెలుగు నాటక చరిత్రలో ఇది కొత్త! ఈ నేపథ్యంలో వ్యక్తి కోరిక చేతనూ, సమాజ సంబంధం చేతనూ ఎదురయ్యే, సంక్షుబ్ధ మయిన స్థితుల్లో అంతర్గతంగా కరుణమూ, పైకి హాస్యమూ పారదర్శకతను పొందాయి. హాస్యమొక కళా సాధనంగా సముద్ర జలాల నుండి నావలా గట్టుకు చేర్చడం జరిగింది. పైకి కనిపించే అలల తెరలు! లోన ఉన్న జలాల లోతును కనిపించనీయవు. కాని భావన కందుతుంది. ఇది

నాటక కళాకృతిలో భాగమయింది. లోపలి జీవన జగత్తును దర్శించడానికి "ఎక్స్‌రే" దృష్టి అవసరం. పలు సందర్భాల్లో మాటల్లో చర్యల్లో హాస్యం, తేలిగ్గా బరువుగా పలచగా మందంగా సున్నితంగా మోటగా మంచు తెరల్లా కదలిపోతుంది. చాలా సందర్భాల్లో, ఆ స్థితి, సమస్యలో ఉన్న విషయ గభీరతను తలపుకు తెస్తుంది. అలల వరసపై కదలే ఫేన పంక్తిలా అలరిస్తుంది నీటిలోకి ప్రవేశిస్తే కానీ, కరుణ జల ప్రపంచం లోతు తెలియదు. ఈ నాటకంలో కరుణం స్థిరతను కలిగిందీ, వ్యక్తి చర్యతోనూ మనస్తత్వ పరంగానూ సమాజ సమస్య రూపంలోనూ గాఢమయిన ఆలోచన కవకాశం లభిస్తుంది. ఈ ప్రణాళికలో కల్పన కవకాశం లేదు. అన్నీ ప్రత్యక్షంగా ఎదురయ్యే కఠోర వాస్తవాలే. మధ్యలో ప్రబోధాలకూ వివరణలకూ అవకాశం లేదు. ఇది నాటక కర్త సంయమనాన్ని కళాదృష్టినీ జ్ఞాపకం చేస్తుంది. ఈ మహా యోజన (plan) లో రచయిత సృజన రూపం కేవలం కళాత్మకంగా పరిశీలన కందుతుంది.

ఈ నాటకంలో కరుణం అంతర్లీనంగా ఉంది. హాస్యం బాహ్యా స్ఫోరకంగా ఉంది. వీటి ప్రయోజన పర్యవసానం సమాజ విషాద దృశ్యం, కఠోర వాస్తవ జీవితం, మాత్రమే. ఇది కన్యల్ని శుల్కాన్ని సమర్పించి పొందుతూ, వయో భేదం లేకుండా ఏ ఆనుకూల్యం చూడకుండా, 'డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే, పొందే దురాచారాన్ని సూచిస్తుంది. ఈ వాతావరణం మొత్తం మీద జాలి సానుభూతి దయ వేదనతో కూడిన భావ సమర్పకంగా ఉంది, కరుణాత్మకతను పొందింది. ఏ కోణం నుండి చూచినా 'బీభత్స' రసానికి ఆస్కారం లేదు. ఎక్కడయినా అనుభవంలో స్వల్ప కాలికమయిన (passing phase) స్థితిలో సూచితం కావచ్చు. అదీ దూరాన్వయంలో మాత్రమే. హాస్య కరుణ రసాల కళాత్మకమయిన సంవిధాన కళ అనుభవానికి వస్తుంది. ఆలోచనకు గురి చేస్తుంది. హాస్యం వెను వెనుక నుండి, సమాజంలో వ్యక్తుల చర్యలతో ప్రతి చర్యలతో కనిపించే మౌఢ్యం అజ్ఞానం వంచన అనైతికం మొదలయిన వ్యతిరేక (నెగెటివ్) మానసిక స్థితు లెదురవుతాయి. జాలి వేస్తుంది. సానుభూతి కలుగుతుంది. చింతనకు దారి తీస్తుంది. మనస్సు చికిత్సకు పురికొల్పుతుంది. మార్పుకు సిద్ధమవుతుంది. ఈ ప్రతిపాదన కెన్నో ఉదాహరణల్ని ఈ నాటకంలో నుండి ఎత్తి చూపవచ్చు.

ఈ నాటకంలో ప్రముఖంగా ప్రత్యక్షమయ్యే పాత్రల్లో ఆకర్షణీయమయింది. "గిరీశం" పాత్ర. జీవితంలో వక్రతను పొందిన ఆధునికతకు ప్రతి రూపం, అగ్నిహోత్రావధానులూ లుబ్ధా వధానులూ ప్రాచీన ఆలోచనా ప్రపంచానికి ప్రతినిధులు. ఎంత గొప్ప సంస్కృతి అయినప్పటికీ జడతను పొందిన ప్రవాహకత స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవ జీవితంలో సమన్వయ లోపం కనిపిస్తుంది. మధుర వాణి పరంపరా గతమయిన శోచనీయ మయిన వ్యవస్థలో భాగంగా ఉంది. చివరలో మార్పు చెందే పరిణత మనో రూపానికి చిహ్నమైంది. సౌజన్యారావు పేరుకు తగినట్లు మంచి తనం వైపు దృష్టి కలిగిన ఉపకారశీలి. మధుర వాణి సౌజన్యారావు పాత్రలు నిర్ణాయక దశలలో ప్రదర్శించిన సానుకూల (పాజిటివ్) మనో రూపం నాటకానికి ప్రయోజన దిశనూ సార్థక లక్ష్యాన్నీ చేరుస్తూంది. సమాజంలో చెడు పట్ల విముఖత కలిగిస్తూ, నీతి రాహిత్యం పట్ల వ్యతిరేకతను కలిగిస్తూంది. దురాలోచనకూ దుశ్చర్యకూ బలి అయ్యే వివేకంలేని మనుషులపై జాలితో పాటు, మార్పును కోరే తీవ్రమయిన పరిస్థితుల్లో రచన కరుణ రస ప్రాధాన్యాన్ని పొందింది. వివిధాంశాల పారదర్శకతతో నాటకం నిర్వహణ కళను పొందింది. రామప్పంతులు లౌకిక మయిన వ్యూహ రచనలో మేటి. స్వార్థ ప్రయోజనంతో వ్యవహరించే వ్యక్తి. బుచ్చమ్మ భారతీయ సమాజంలో విషాదకరమయిన దశలో పారతంత్ర్యంలో ఉన్న స్త్రీ ఆ వాతావరణంలో స్వేచ్ఛలేని స్థితికి అద్దం పడుతూంది. నాటకంలో మొత్తం మీద సమాజంలో మంచినీ చెడునూ ప్రతిఫలిస్తూ జీవితంలో అనివార్య పరిస్థితులు చిత్రితమైనాయి. మధుర వాణి వ్యక్తిత్వం చివరలో కొసమెరపుగా ఆమెలో వచ్చిన మార్పు హితకరమయింది. మనిషిలో అణగి ఉన్న విలువల్ని పైకి తెచ్చే ప్రయత్నం, అవసరాన్ని సూచిస్తూంది. ఈమెతో పాటు సౌజన్యారావు వ్యక్తిత్వంలో మానవ శ్రేయోభావన, జీవితం పట్ల ఆశావహమయిన ఆలోచనను బలపరుస్తూంది. అగ్ని హోత్రావధానులు లుబ్ధావధానుల విషయంలోనూ మిగతా పాత్రల విషయంలోనూ ఏది సముచితం? ఏది విలువల్ని కాపాడుతుంది? అన్న వివేచనం యొక్క అవసరాన్ని తలపిస్తుంది, ఇలా సందర్భాల్ని బట్టి పాత్రల్ని విశ్లేషిస్తే, బీభత్స ముద్రల కవకాశం కనిపించదు. దూరాన్వయం (far - fetched meaning) లో అక్కడక్కడా తట్టవచ్చు. ఒక్కొక్క పాత్ర సమాజంలో ఒక్కొక్క పార్శ్వాన్ని

ప్రతిఫలిస్తూంది. గొప్ప భారతీయ వివాహ వ్యవస్థలో మనుషుల స్వార్థం వల్ల కలిగే, అపహాస్యపు తీరూ, వృత్తుల్లో అనైతిక మయిన పోకడలూ, ప్రవృత్తుల్లో స్వార్థంతో తొక్కే అడ్డదారులూ, అజ్ఞానంలో పరిభ్రమించే మనస్తత్వమూ మౌఢ్యంలో చిక్కుకున్న స్వేచ్ఛా జీవితాలూ ఎదురుపడతాయి. వీటిని ధైర్యంతో ఎదుర్కోవలసిన అవసరాన్నీ నాటకం వ్యంజింప చేస్తూంది.

గిరీశం పాత్రలో చతుర మయిన సంభాషణం, నాటకానికి జీవవంతమయిన రూపాన్ని ఇస్తూంది. నిజ జీవితంలో ఉదాహరణీయాలుగా ప్రశస్తిని పొందాయి. కాస్త లోతుగా ఆలోచిస్తే ఉన్న దుస్థితిని గురించీ ఆలోచింపజేస్తాయి. ఈ పాత్రలో హాస్య వర్తనం జుగుప్సను కలిగించదు. దీని వెనకన్ను దు:ఖ కరమయిన సామాజిక స్థితి గతుల్ని కళ్ళ ముందు నిలుపుతుంది. ఇతడు తెలివి కలవాడు. ఆధునిక వాతావరణాన్ని బాగా అంది పుచ్చుకున్న వ్యక్తి. కానీ జీర్ణమై వంట బట్టలేదు. అరకొర విద్యా విజ్ఞానాలతో నెట్టుకొని వచ్చే మనస్తత్వం కలవాడు. అయితే, మారే సమాజంలో ఈ మాత్రం చాలదు. సానుకూల దృష్టితో పాటు మార్పు పట్ల చిత్తశుద్ధి అవసరం. ఈ పాత్ర నిర్మాణంలో వ్యక్తీ – సమాజమూ స్థాయిల్లో రెండు అరలు కనిపిస్తాయి. ఈ రూపం అస్థిరమయిన జీవన యౌవన దశలో యువత అవలంబించే మార్గాన్ని సూచిస్తుంది. ఇది వ్యక్తిలో పరిపూర్ణ వికాసానికి అడ్డుగా నిలుస్తుంది. ఉన్న వ్యవస్థలో భాగంగా–యథాస్థితిని అనుసరించే మనోరూపాన్ని సూచిస్తుంది. ఇది సమాజ ప్రగతికి దోహదం చేయదు. వ్యక్తిలో స్వేచ్ఛతోనూ సమాజంలో భాగంగానూ రెండు అరలూ గిరీశం వ్యక్తిత్వంలో విశ్లేషణ కందుతాయి.

'కన్యాశుల్కం' నాటకం ప్రాచీన నాటక లక్షణాలకు లొంగదు. స్థూలంగా అన్వయించవచ్చు. ముఖ్యంగా రస విషయంలో కొంత ఉపకరిస్తుంది. ప్రాచీన సమాజానికీ ఆధునిక సమాజానికీ ఉన్న అంతరమే ఇక్కడా పని చేస్తుంది. కాలం గడచే కొద్దీ ఇది అనివార్యమవుతూపోతుంది. ఈ నాటకం గురజాడ సృజన ప్రతిభ చేత నిర్వహణ కళ చేత ప్రత్యేకతను పొందిందీ. వస్తువూ విషయమూ పాత్రలూ సన్నివేశం చర్యలూ ప్రతి చర్యలూ స్థితిగతులూ ప్రయోజనమూ అన్నీ కలిసిన స్వరూపం,

విశాలమైన జీవితాన్ని, చూపిస్తూంది. చిత్రిస్తూంది. దోషాల్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తూంది. ఆధునిక భావ జాలంతో ప్రగతి శీల లక్ష్యంగా మనిషి, మానవత, జీవితం, సమాజం స్తంభాలపై నిలిచిన కళా రూపం ఈ నాటకం. ఎన్ని సమస్యలున్నా క్రుంగి పోకుండా నిలబడి పరిష్కార దిశలో మానవ విజయాన్ని భావింపజేస్తూంది. మానవ పరిణామ సోపానలాపై ఎవరు ఎక్కడ ఉందీ? సూచిస్తూంది. మనిషిలో వ్యతిరేక (negative) ధోరణుల్ని సానుకూల (positive) దిశగా, మలచే ప్రయత్నం జరిగింది. ఇది ఒక నాటితో అయ్యేది కాదు, నిరంతరమూ సాగేదీ.

సజీవ మయిన భాషలో జీవవంతమయిన రూపాలతో ఆధునికతకు ప్రాతినిధ్యం వహిస్తూంది. నాటక చరిత్రలో కొత్త సృజన రూపాన్నీ దర్శింపజేస్తూంది. మానవతా స్వరంతో ఆధునిక సమాజ చైతన్యానికి ప్రగతి మార్గాన్ని ఆవిష్కరించే ఉత్తమ కళా రూపంగా కొత్త సంవిధాన నైపుణితో సహృదయుల్ని ఆకర్షిస్తూంది. కరుణ రసం అంతర్లీనంగానూ హాస్య రసం, బహిర్గతంగానూ రస మేళనంతో – ఆధునిక చైతన్య దిశకు దారి చూపేదీ – "కన్యాశుల్కం" నాటకం, గురజాడ ఉపజ్ఞా మహితమయింది.

## 6. గురజాడ ప్రజాస్వామ్య హృదయం

సమాజంలో పూర్వ పూర్వ స్థితుల్నీ యథాతథమైన సంస్థితినీ కోరే వారి ప్రపంచం ఒక వైపూ, ఎప్పటికపుడు అవసరమయిన మేలయిన మార్పుల్ని ఆహ్వానించే వర్తమానంలో ప్రగతిని కోరే వారి ప్రపంచం మరో వైపూ. ఈ ఆలోచనకు సాహిత్య మొక బలమైన సాధనంగా విశాలమైన వేదికగా ప్రకాశ రూపంగా రూపొందడం సహజం. సమాజ వికాస చరిత్రలో దశలు దశలుగా మార్పులు రావడమూ జరుగుతుంది. ఇది సమాజ సజీవ శక్తికీ గతి శీలానికీ నిదర్శనం. ఈ పయనం అనుకునేంత సులభం కాదు. దీనికి అవరోధాలెన్నో! ఎదురవుతూ ఉంటాయి. వివిధ సందర్భాల్లో వీటిని మెల్లగానూ వేగంగానూ తీవ్రంగానూ అధిగమిస్తూ పోవడం

జరుగుతుంది. దీనికి మార్గాన్ని చూపే నేతలో సాహసం అవసరం. పయనింప జేసే సృజన నిపుణతతోపాటు నిబద్ధమయిన వ్యక్తిత్వమూ ఉండాలి. ప్రతిభ ఒక్కటే చాలదు, దార్శనికత తప్పనిసరి. పరివర్తన కోరే నైతికమైన మనోరూపంతో పాటు క్రియా శక్తితో అనుకున్నది సాధించడం ఒక విజయం. దీనికి ఉదాహరణగా కందుకూరి వీరేశలింగం గారితోపాటుగా గురజాడ అప్పారావుగారు ఎదుట నిలుస్తారు. ఇది ఒక విధంగా సమాజ పరిణామ చరిత్రలో భాగం. మరో విధంగా సాహిత్య వికాస చరిత్రలో భాగం కూడా. అయితే దీన్ని ఎప్పటి కపుడు వేగవంతంగా ముందుకు నడిపించే, ససందర్భంగా ఉపయోగకరంగా చూపే శక్తులూ అవసరం. వీటి క్రియాశీల మయిన పాత్ర కోరే మార్పుకు బాగా తోడ్పడుతుంది.

గురజాడ సాహిత్యం విషయంలో ప్రజాస్వామ్య సహృదయులతో పాటు అభ్యుదయ సామ్యవాద శక్తులూ ప్రోత్సాహకరమయిన వాతావరణాన్ని నిలిపాయి. ఇది సాహిత్యంలో 'మరోవైపు' స్థిరతకు దోహదపడింది. సమాజంలో మార్పుకూ సహాయపడింది. గురజాడ సాహిత్య వ్యక్తిత్వం ఈ మరోవైపు ప్రపంచానికి సింహద్వారం. సాహిత్య సంపద ఆ ప్రపంచంలోని దృశ్య రూపం, కఠోరమైన జీవన వాస్తవాలకు సంబంధించిందీ. కాలం గడచే కొద్దీ పూర్వ పూర్వ యథాస్థితిని కోరే ఒక వైపు ప్రపంచమూ, మార్పును కోరే మరోవైపు ప్రపంచమూ మధ్య అంతరం బాగా పెరుగుతూ వేరవుతాయి. ముందుకు నడిపించే మార్పు స్థిర పడుతుంది. గతంలోని సారభూతమయినవీ జ్ఞాపకం పెట్టుకోవలసినవీ విలువలు కలిగినవీ మిగులుతాయి. వారసత్వ చిహ్నాలుగానూ నిలుస్తాయి. ఇది చారిత్రక వాస్తవం. 'కన్యాశుల్కం'లో ఈ ప్రసక్తినీ గమనించవచ్చు.

ఈ మరోవైపు – మార్పులోని ప్రపంచం, పాశ్చాత్య విద్యా వైజ్ఞానిక పాలనా ప్రభావాలతో సామాజిక సంస్పృహతో ఏర్పడిందీ. హేతు దృష్టితో లౌకిక మయిన స్థాయిలో మేలైన జీవిత సౌభాగ్యాన్ని కోరేదీ. భౌతికావసరాల యోజనతో కూడిందీ. వ్యక్తి వికాసంతోపాటు సామాజిక శ్రేయస్సు పట్ల చింతన కలిగిందీ. తెలుగు దేశంలో పందొమ్మిదవ శతాబ్దం నుండి క్రియాశీలతను పొందింది. దీని కారణంగా సామాజిక

సాంస్కృతిక రాజకీయ చేతన విస్ఫారించింది. దీన్ని బట్టి సాహిత్యమూ మార్పులకు లోను కావడం మొదలయింది. ఇది సహజం. సమాజంలో కొన్ని సమూహాలూ శ్రేణులూ మార్పుల్ని వ్యతిరేకించవచ్చు. మార్పులకు మానసికంగా సిద్ధంగా లేకపోవచ్చు. అభిప్రాయ భేదాలు సహజం. ఈ కారణంగా మార్పు విషయంలో వేగం అందుకోలేక పోవచ్చు. కొంతలో కొంతయిన పొందాలిసిన విస్తృత్తిని పొందలేకపోవచ్చు. కొంత ఆలస్యం కావచ్చు. ఈ మార్పు ఎవరూ సాగకుండా ఆపలేరు. కాలం గడచే కొద్దీ వెను వెంటనే వచ్చే కొత్త తరాలు ఈ "మరో వైపు" చూడక తప్పదు. ఇంతకు ముందున్న ఆటంకాలు బాగా తొలగుతూ పోతాయి. మార్పు వేగాన్ని అందుకుంటుంది. విస్తృత్తిని పొందుతుంది. క్రమంగా స్థిరపడుతుంది. కందుకూరి తరువాత గురజాడ విషయంలోనూ దీని మూడు నాలుగు తరాలు పట్టింది, ఒక శతాబ్ది కాలంలో ప్రభావ ముద్రలు స్పష్టంగా ఆధునిక సంస్కృతిలో భాగంగా లీనమై నిలిచాయి. సాహిత్యంలో అంచెలు అంచెలుగా వివిధ ప్రక్రియల్లో మార్పులు ప్రవేశించడం జరిగింది. కాలం గడచే కొద్దీ ఈ మార్పు ఎదురులేని ప్రవాహ శక్తిగా పరిణమించింది. గతంలోని సారభూతమయిన "మంచి"తో వర్తమాన గతిలో మార్పును కోరే "మరోవైపు"తో, ఆధునికానికి ప్రాతినిధ్యం వహిస్తూందీ గురజాడ సాహిత్యం. మారే పరిస్థితుల్ని బట్టి రూపొందే "కొత్త సమాజానికి వైతాళికత్వాన్ని పొందింది. ఆధునిక యుగ చేతనకు నేతృత్వాన్ని వహించింది. శక్తివంతమయిన అస్తిత్వాన్ని ఎత్తి చూపడమే ప్రస్తుతోద్దేశం.

## 2

గురజాడ సాహిత్యంలో కవిత్వం నాటకం కథ మొదలయిన ప్రక్రియల్లో మరో వైపుకు చెందిన ఆధునికతతో పాటు నిజ జీవితంలోనూ సంస్కరణ పరివర్తనం ప్రగతి లక్ష్యంపట్ల నిబద్ధత కలిగిన అంకితమయిన వ్యక్తిత్వం సాహసోపేతమయిందీ, క్రాంత దర్శన రూపాన్ని పొందిందీ. దీనికి 1) నిశితమైన హేతు దృష్టీ 2) మానవ జీవితాన్ని సుఖమయిం చేసే విజ్ఞా శాస్త్ర తత్పరత 3) "దేశి" ప్రత్యేకతతో మొదలయి "ఎల్ల లోకము లొక్క ఇల్లు"గా మానవతా బంధాన్ని కోరే విశాల బుద్ధీ 4) నైతికమైన విలువలతో ఉత్తమ సమాజ దర్శనం అనేవి మూల స్తంభాలుగా నిలిచాయి. కవిలో

అంతర్లీనంగా స్వేచ్ఛతో ప్రజాస్వామ్య భావన ప్రేరణ శక్తిగా కనిపిస్తుంది. వర్తమాన సమాజంలో స్త్రీ చైతన్యానికి కవి ఇచ్చే ప్రాధాన్యమూ ముఖ్యంగా "కన్యాశుల్కం" నాటకంలో ప్రముఖంగా చిత్రితమయింది. కవిత్వంలో "దేశభక్తి" "పూర్ణమ్మకథ" "కన్యక" మొదలయినవి అక్షర గణ ఛందస్సును వదలి మాత్రఛందస్సులో "ముత్యాల సరాలం" ప్రయోగ విజయమూ ప్రక్రియా పరంగా "మరోవైపు"కు స్పష్టమైన సంకేతాల్ని ఇస్తూంది. శ్రీశ్రీ మాటల్లో తాను "గురజాడ మార్గాన్ని వెడల్పు" చేసిన ప్రతిపాదనం ఈ సందర్భంలో గుర్తుకు రావడం సమాజం. ఇది ఛందస్సుకే కాదు సాహిత్యానికీ సంబంధించిన విషయ పరిశీలనానికెంతో ఉపకరించే అంశం. "మరోవైపు' కవిత్వ విషయంలో రచనా శిల్ప సౌందర్యంపై వెలుగును ప్రసరిస్తూంది. "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" – మనిషికీ మనిషికీ మనుషులతో సమాజానికీ ఇచ్చే గౌరవ భావం ప్రజాస్వామ్య హృదయంతో స్పందిస్తూంది. ఆధునిక యుగంలో 'మనిషి'కి గల ప్రాధాన్యాన్ని భావింపజేస్తూంది. ఇందులో ప్రజల శ్రమ చేతనతో విలసిల్లే దేశ భావన (కాన్సెప్ట్) మూర్తీ భవించింది. స్థానికం నుండి ప్రపంచం వరకూ విశ్వమయ కుటుంబ భావన ప్రపంచ గీతంగా విలసిల్లజేస్తూంది. చెట్టుకు సహజంగా ఆకులతో అస్తిత్వం వలె ప్రజలతో రూపొందే సమాజంలో గురు తరమయిన కవి బాధ్యతను స్మరింపజేస్తూంది. తెలుగు కవిత్వంలో ఈ దృష్టి సరి కొత్త మానవీయ పార్శ్వాన్ని ఆవిష్కరిస్తూంది. ఉచ్ఛ నీచ భేదాల్ని తుడిచేసే ఆలోచన సర్వ సమానతకు వేదికగా పరిణమింపజేస్తూంది. ఈ గీతంలో నెలకొన్న ఆదర్శ ప్రభావ ముద్ర ఎప్పటికీ ప్రకాశవంతంగా పనిచేసేది. దేశాల మధ్య సద్భావాన్ని నెలకొల్పేదీ.

వస్తువులో జీవితమూ విషయంలో వాస్తవికత లక్ష్యంలో సామాజికతతో కరుణాత్మకమయిన నిర్వహణ శిల్పం కలిగిన కళాఖండాలు "పూర్ణమ్మ కథ" "కన్యక" మరోవైపులోని దుర్భరమైన నారీ జీవితాల్ని బింబించే ఉత్తమ కృతులుగా శాశ్వత కీర్తిని పొందాయి. ఆధునిక యుగానికి సంకేతాలుగా నిలిచాయి.

*"మేలిమి బంగరు మెలతల్లారా! కలువల కన్నుల కన్నెల్లారా!*
*అమ్మల గన్న అమ్మల్లారా! విన్నారమ్మా ఈ కథను"*

ఆరంభంలో ఉత్సుకతను కలిగించే విధంగా "నారీజన సంబోధనతో ఒక స్త్రీ గురించి కథన శిల్పం, ఆకట్టుకుంటుంది. వస్తు గౌరవంతో సంస్కరణ గుణంతో మార్పు లక్ష్యంతో ఉదాత్త రూపాన్ని పొందింది. కవిత్వ కళలో భావ బంధురత రస నిర్భరత సంక్షిప్తత కలిగిందీ. నూరేండ్లకుపైన గడచినా సరికొత్తగా అనుభవానికి వచ్చే నవ్యతను చూపుతూంది. దీనితో సమానంగా 'కన్యక'! "పట్న మేలే రోజు వయితే పట్టుకొనుమ" నీ అగ్ని కాహుతి అయ్యే సన్నివేశం హృదయ విదారకమయింది. ఈ కృతిలో చివరి సన్నివేశం శిథిల దశకు చేరుకొన్న రాజరిక వ్యవస్థలో నిరంకుశానికి వ్యతిరేకంగా, వ్యక్తిలో విజృంభించే స్వేచ్ఛా రూపాన్ని వ్యంజింపజేస్తూంది. ఇది ప్రజాస్వామ్య భావనా సూచనతో కవి ఆధునిక దృష్టిని ప్రకటిస్తూంది.

మరో వైపుకు చెందిన మరవలేని గొప్ప ప్రపంచ రూపం 'కన్యాశుల్కం' నాటకం. గురజాడలోని ప్రజాస్వామ్య హృదయాన్ని ఆవిష్కరిస్తూంది. స్వేచ్ఛాశీలమైన ప్రగతి పథాన్ని లక్షిస్తూంది. తెలుగులో నాటక రూపానికి మార్గదర్శకంగా ఉంది.

ఇందులో ప్రధానంగా 1) ముక్కు పచ్చలారని ఆడ పిల్లల్ని అమ్ముకొనే దురాచారం – బాల్య వివాహాలు 2) వితంతువుల దుస్థితి – పరాధీనత 3) వేశ్యా వ్యవస్థ – సంస్కరణావశ్యకత 4) స్వార్థం జడత మౌఢ్యంతో బ్రతికే పూర్వపూర్వ వర్గాలూ 5) వ్యక్తి స్వేచ్ఛలో ఆధునికంలో విపరీతపు పోకడలూ – జీవిక కయి యువత – పడరాని పాట్లూ 6) దుస్తంత్రాలతో కాలం గడపేవారూ లౌక్యంలో చేయకూడని పనులు చేసేవారూ మేలు చేసేవారూ తగిన పాత్రల్లో కనిపిస్తారు. బుచ్చమ్మ మీనాక్షి మధురవాణీ అగ్నిహోత్రావధానులు లుబ్దావధానులు గిరీశం వేంకటేశం సుబ్బి రామప్పంతులూ కరటక శాస్త్రి సౌజన్యారావు ఇంకా ఎందరో బహు విధాలయిన మనస్తత్వ రీతులతో చర్యలు ప్రతిచర్యలతో ప్రత్యక్షమవుతారు. సామాజిక వాస్తవికతను బింబించే చిత్రించే వ్యాఖ్యానించే సమస్యాత్మకమైన పరివర్తన కోరే నాటకం, చివరలో మంచికీ నీతికీ ప్రాధాన్యంగా మానవతమే పేరుగా ఎదిగిన మధురవాణి పాత్ర శిఖర భూతమయింది. మంచి వైపు పయనించే నిర్మాణాత్మకతను సూచిస్తూంది. ఈ నాటకం ఎదురైన సమస్య పట్ల సానుభూతితో సహృదయుల్ని పరిష్కార దిశగా ఆలోచనకు పురికొల్పుతుంది. ఇది ప్రజాస్వామ్య భావనకు సన్నిహితమయింది.

నాటకం మొత్తం మీద ఇతరమైన అంశాలతో అల్లబడి ఉన్నప్పటికీ స్త్రీ చైతన్యం కేంద్ర స్థానంగా ఉంది. కఠోర మయిన వాస్తవాలపై నుండి నీతివంతమయిన ఆదర్శ దిశగా నడిపిస్తుంది. శిథిలమవుతూన్న రాజరిక వ్యవస్థలో మారే కాలానికి సరిపడని మనస్తత్వాలతో బ్రతికే సన్నివేశాలనేకం చింతనకు గురి చేస్తాయి. ప్రత్యామ్నాయానికి పురి కొల్పుతాయి. పైకి సన్నని తెల్లని మంచు పొరలా హాస్యం కదలుతూన్నా దాని వెనుక విచిత్రమయిన బాధలతో కష్టాలతో నష్టాలతో జీవన దృశ్యం స్ఫూర్తికి వస్తుంది. విషాద ముద్రలూ కన్నీటి బిందువులూ కనిపిస్తాయి. హాస్య రసం వెనుక నుండి కరుణ రసం ప్రతిఫలిస్తుంది. ఇది చివరి మెట్టు కాదు. నాటకం చివర సౌజన్యారావు గిరీశాన్ని బయటకు వెళ్ళ మన్నప్పుడు అదృశ్యంలో గిరీశం ఆగి "డామ్ ఇట్ కథ అడ్డంగా తిరిగింది" అని నిష్క్రమిస్తాడు. ఇది హాస్యానికి ప్రతినిధిమైన గిరీశం పాత్ర నిర్మాణంలో పరిమితుల్ని సూచిస్తూంది. ఎప్పటికీ పరిస్థితులు తన చేతిలో ఉండవనీ, పాత్రలో మార్పును పట్టిస్తూంది. రస నిర్వహణంలో మలుపును భావింప జేస్తూంది. హాస్యం వెనుక నుండి తోచే కరుణానికి పై నుండి శాంతం ప్రకాశిస్తూంది! ఎట్లాగ అంటే! మధుర వాణికి సౌజన్యారావు భగవద్గీతను కానుకగా ఇస్తాడు. ఇది ఆమెలో ప్రకాశించే నైతిక వ్యక్తిత్వానికి గుర్తింపుగా ఉంది. నాటకంలో పాత్రకు చిరస్మరణీయతను చేకూరుస్తుంది. ఈ సన్నివేశంలో సుస్థితికి దారి తీసే పరిస్థితుల్ని బట్టి శాంత రసం కవి మనసులోని చివరి మాటగా ఊహలో నిలుస్తుంది. 'కన్యాశుల్కం' నాటకంలో రస నిర్వహణం పైకి హాస్యం లోన కరుణం చివర శాంతంతో మూడు అంచెలుగా సాగింది. శాంతంలో పర్యవసించడమూ సూచనగా వివేచన కందుతుంది.

పాత కొత్తల మేలు కలయితో కొత్త పట్ల మొగ్గుతో మార్పు ఆ మార్పు పట్ల చేతనతో ప్రజలలో ఉత్సాహ శక్తిని నింపుతూంది.

జీవితంలో ఎదురయ్యే పరిస్థితులూ, ఎదుర్కొనే మనస్తత్వ రీతులూ, ఒక దాని తరువాత మరొకటి చర్యలు ప్రతి చర్యలతో అల్లిన నాటకం 'కన్యాశుల్కం', సంశ్లిష్ట (కాంప్లెక్స్) రూపాన్ని పొందింది. ఇది నాటక కర్త నిపుణ మయిన సృజన కళకు నిదర్శనంగా ఉంది. మొత్తం మీద గురజాడ సాహిత్యం 'మరోవైపు'కు మార్గదర్శక మయిందీ. ప్రజాస్వామ్య హృదయంతో స్పందించేదీ.

# 7. కన్యాశుల్కం - మధురవాణి వ్యక్తిత్వ వికాసం

కన్యాశుల్కం నాటకంలో ముఖ్యమైన మయిన పాత్ర మధురవాణి. అన్ని పాత్రలకూ కేంద్రంగా ఉంది. స్మృతిలో నిలిచిందీ. సమాజంలో పై స్థాయికి చెందని క్రింది వృత్తిలో ఉందీ. ఒక దృష్టితో నాయికగా వివేచన కందుతుంది. సంప్రదాయ నాటక లక్షణాలకు భిన్నమైందీ. సంస్కృత సాహిత్యంలో శూద్రకుని 'మృచ్ఛ కటికం' "మట్టి బండి" (నగలతో ఉంది) నాటకంలో వసంత సేన పాత్ర నాటక ప్రియులకు గుర్తుకు రావడం సహజం. ఇది చాలా పరిమితమైన అవకాశాల్లో చరించింది. మధురవాణి పాత్ర విస్తృతమైన బహు విధాలయిన అవకాశాల్లో వర్తించింది. ఈ కారణంగా మధురవాణి పాత్ర బహు ముఖీనమయింది. వైవిధ్యంలో కూడిందీ. వ్యక్తి స్థాయిలో 'మంచి వారికి మంచికీ, నీతికీ – సమాజ స్థాయిలో సంస్కరణకూ మార్పుకూ ప్రయోజన దిశగా అస్తిత్వాన్ని కలిగింది. ఇతి వృత్తంలో అనేక సంఘటనలతో పాత్ర ప్రమేయం పెరిగింది. ఏ సామాజిక పరిస్థితుల్లో వేశ్యా వృత్తిలో బ్రతుకు గడుస్తున్నా, ఆమెలో మౌలికంగా ఉన్న మంచి గుణాలు కొంత కాలం మరుగున పడి మాత్రమే ఉన్నాయి. అవి తగిన విశేష సందర్భాల్లో బయటి రావడం జరిగింది.

పాత్రకు స్థాయినీ పూర్ణతనూ చేకూర్చే కొన్ని అంశాలు ఆమెను ప్రధానమైన నాయికగా నిలిపే అర్హతను చేకూరుస్తున్నాయి. ఇవి వ్యక్తిత్వంలో భాగాలయినాయి. ఆమె వ్యక్తిత్వ వికాసానికి హేతువులయినాయి. అయితే ఈ నిర్ణయం ప్రశ్నించడానికి వీలులేనిది కాదు, కానీ ఒక స్థితిలో ఉచితమనిపిస్తుంది.

1. మధురంగా నిపుణంగా చతురంగా మాట్లాడే స్వభావమూ
2. అందమైన రూపంలో ఆకర్షణ శక్తీ
3. తన దృష్టిలో పడిన వ్యవహారాల్ని నిర్వహించే సమర్థత
4. క్లిష్టమయిన పరిస్థితుల్లో సమస్య పరిష్కారంలో సహాయపడే హృదయమూ.
5. మంచి వారికి తప్పకుండా మేలు చేయాలనే సంకల్పమూ
6. సందర్భానికి తగిన వివేకంతో ప్రవర్తనమూ
7. తన వృత్తిలోని హేయతను గుర్తించిందీ, దాని అనివార్యత నెరిగిందీ, దీని నుండి బయపడే అభిలాష, మార్పు పట్ల సుముఖత.

8. సంస్కరణ దృష్టి – సమాజంలో మార్పుకోరే మనోరూపమూ.
9. మానవతా భావనతో కూడిన ఆలోచన, ఆయా సందర్భాల్లో వివేచన కందుతాయి.

కన్యాశుల్కం నాటకం రెండవ కూర్పులో ఈ పాత్ర బహు ముఖీనంగా విస్తరించింది. ఆమెలో సహజంగా ఉన్న మంచి గుణాలు ప్రకాశించాయి. ఆమె వ్యకిత్వం సంస్కరణ పథానికి దిక్సూచి అయింది. మార్పు సరి అయిన పద్ధతిలో జరిగినపుడే మంచి ఫలితాల్ని పొందవచ్చును. అన్నదే నాటక కర్త ఉద్దేశం. మొదటి కూర్పులో "నాణెం"వలె రచన ఎట్లా చెలామణి అవుతుందో తెలిసింది. దీన్ని బట్టి రెండో కూర్పులో మధురవాణి పాత్రను "ఎక్కువ చేయడం" జరిగింది. దీని వల్ల ఇతివృత్తం విశాలతను పొందింది. ప్లాట్, సబ్ ప్లాట్‌లతో నిర్మాణం వివిధ సన్నివేశాలతో దృశ్యాలతో పాత్రల చర్యలతో వాస్తవ జీవితానికి అద్దం పట్టింది. దీనికి మధుర వాణి కేంద్ర బిందువుగా వెలసింది. పాత్రలోని మానవీయమైన గుణాల్ని సానుకూల (పాజిటివ్) దృష్టిని బయటకు తీసుకొని రావడం జరిగింది. దీని కోసం ఇతివృత్తంలో మలుపులతో పాత్రల గతిలో ఉత్సుకతను నిలపడం అవసరమయింది. రచన పెరిగింది. వీటికి తగిన సంభాషణలు వినిపించవలసి ఉంటుంది. "నేను ఎంత హాస్య ప్రియుడనో అంత గంభీరుడను" అన్న గురజాడ మాటలోని ఆంతర్యం ఈ నాటక నిర్వహణ కళలోని రహస్యాన్ని పట్టిస్తూంది.

1906లో విజయరామ గజపతికి వ్రాసిన ఉత్తరంలో నాటక కర్త కన్యాశుల్కం గురించి "This book was sucessful beyond my expectations" ఈ పుస్తకం నేననుకున్న దాని కన్నా ఎక్కువగా విజయవంతమయింది". ఈ వాక్యంలో మానసికంగా పొందిన తృప్తి వ్యక్తమవుతూంది. ఈ గొప్ప నాటకం ఎంతో వైవిధ్యం కలిగిన వాస్తవ జీవితం నుండి స్వీకరించిన ఇతివృత్తం కలిగిందీ. వాడుక భాషలో వ్రాయబడిందీ. రచనలో కళాత్మకతను విస్మరించకుండా సమాజం పట్ల రచయిత బాధ్యతను గుర్తించిందీ. ఆధునిక తెలుగు సాహిత్యంలో 'మరోవైపు'కు మార్గదర్శకమయిందీ. ఈ నేపథ్యంలో నాటకం ముందుకు సాగే కొద్దీ ఇతర పాత్రల చర్యల్లో మధురవాణి పాత్ర ప్రమేయం పెరుగుతూ వచ్చింది. పాత్ర విశ్లేషణంలో స్ఫుటమైన అంశాలు కథా సంవిధానంలో చక్కని సమన్వయాన్ని పొందాయి. దీన్ని సాధించడం ఒక కళ.

సృజన కృతిలో కళాత్మకతకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ సమాజం గురించి చింతనతో వాస్తవ జీవితం ప్రాణభూతంగా నిలిచింది. మధుర వాణిలో అందమూ మాట పనీ తెలివీ ఆమె స్వంతం. ఆమెను సహజంగా వరించినవీ. వీటికి తోడుగా ఆమె తల్లి శిక్షణలో నీతి నియమ వర్తనం బాగా అలవడింది. మంచి వారి పట్ల మంచిగా ఉండే విధమూ ఆమె తల్లి ఉపదేశరూపమే. ఇంకా వీణ వాయించే కళనూ అభ్యసించింది. కరటక శాస్త్రి వద్ద సంస్కృత భాష నేర్చుకుంది. తొలి రోజుల్లో ఏర్పడిన ఈ వ్యక్తిత్వం ఆపైన అస్తిత్వ వికాసానికి మూల భూతంగా ఉంది, ఎంతో తోడ్పడింది. జీవితంలో అనుభవ సందర్భాల్ని బట్టి ప్రత్యేకతలు బయటికి వచ్చాయి. అస్తిత్వంలో పూర్ణతకు దారి తీసాయి. అధికార శ్రేణుల్లో డిప్యూటి కలెక్టరు నుండి కానిస్టేబుల్ వరకూ, లౌకిక శ్రేణుల్లో గిరీశం నుండి రామప్పంతులూ, కరటక శాస్త్రి దాకా అందరూ ఆమె వశం కావడం జరిగింది. నాటకంలో పలు మలుపులకు ప్రేరణ స్థానమయింది. నాటకంలో కథా గమనానికి (మూవ్‌మెంట్) వస్తే, తన ప్రజ్ఞతో రామప్పంతుల్నీ, వ్యవహార దక్షతతో లుబ్ధావధామల్నీ ఆట పట్టించింది. రామప్పంతుల నుండి డబ్బుకు ఆశ పడింది. గిరీశం పట్ల మాత్రం నమ్మకంతో వ్యవహరించింది. అయితే చిత్రమేమంటే అతడు "బుచ్చమ్మ ప్యూర్‌డైమండ్" (pure diamond) అనీ "మధుర వాణి రంగు వేసిన గాజు పూస" అనీ పార్టింగ్ విజిట్‌తో గుడ్ చెప్పే ఆలోచనలో వాస్తవికత చోటు చేసుకుంది. లుబ్ధావధానుల విషయంలో అగ్నిహోత్రావ ధానులు కూతురు సుబ్బితో వివాహ వ్యవహారంలో కరటక శాస్త్రి శిష్యునికి ఆడ వేషం వేయించి ఆ వివాహం జరిపించడం, మధురవాణి పాత్ర ఆమె మతి ప్రభకు నిదర్శనం. లుబ్ధావధానుల్ని కాపాడేందుకు న్యాయ సమ్మతమైన సహాయాన్ని అందించడానికి సిద్ధమైంది. కరటక శాస్త్రిని ఒడ్డుకు చేర్చింది. మానవతా మూర్తిగా ప్రకాశించింది.

కొన్ని చోట్ల తన కన్ను కప్పి జరిగిన ఘటనలూ లేకపోలేదు. కరటక శాస్త్రి శిష్యుడు అర్ధరాత్రి స్త్రీ వేషాన్ని వదలేసి కంటెతో పారిపోవడం జరిగింది. అతడు మధురవాణి ఇంటికి చేరతాడు. రామప్పంతులు గొంతుతో మాట్లాడుతాడు. మధురవాణి నమ్ముతుంది. విషయం తెలిసాక "ఔరా! ఇంద్రజాలి! నన్ను మోస పుచ్చితివే!" అని

మెచ్చుకుంటుంది. లుబ్ధావధానుల్ని పెళ్ళి చేసుకున్న పిల్ల "బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది' అన్న పుకారు పుట్టింది. దీనితో పోలీసులూ – రామప్పంతులుపై అనుమానంతో "కంటె"కు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సందర్భం మృచ్ఛ కటికం నాటకంలోని నగలు గల "మట్టిబండి" తలపుకు వస్తుంది.

మొత్తం మీద మనిషికి సహాయపడే సాటి మనిషిగా, తన వృత్తిపరమైన అంశంతో సంబంధం లేకుండా కేవలం మానవతా కోణంలో ఉపకారశీలిగా తన పాత్రను నిర్వర్తిస్తుంది. ఒక మారు లుమ్ధావధానుల భార్య తమ్ముడు కరటక శాస్త్రితో "ఎపుడయినా కనికరించి మీ ఇద్దరి ప్రాణాల్నీ తానే కాపాడాలి కాని మరెవరికీ సాధ్యం కాన్న మాటపై నిలిచింది. ఆత్మ విశ్వాసంతో పని సాగించింది. ఇతరుల విశ్వాసానికి పాత్రమైందీ.

సౌజన్యారావుతో మాట్లాడుతూ "చెడని వారిని చెడగొట్ట కూడద"ని తన తల్లి అన్న మాటల్ని చెబుతుంది. దాన్ని పాటిస్తుంది. అటువంటి వారి పట్ల మంచిగా ఉండడం ఆమె జీవన సూత్రమయింది. మాటలతో పాటుగా చేతలతో "సత్తెకాలపు బ్రాహ్మణ్ణి", కాపాడింది. ఈ సంఘటన నాటకానికి హైలైట్లలో ఒకటి.

తన పట్ల సౌజన్యారావులో తల ఎత్తిన సందేహాల్ని పటా పంచలు చేసింది. తాను బ్రతికే వేశ్యా వృత్తికి అతీత మయిన మానవీయ మూర్తిగా వర్తించింది. నాటకంలో అన్ని పాత్రలపై పట్టును సంపాదించింది. మొదటి నుండి చివరదాకా ఏదో ఒక విధంగా ఆకర్షణ కోల్పోని ప్రధానమైన నాయిక పాత్రగా నిలిచే యోగ్యతను పొందింది.

పెండ్లి కూతురు బావిలో పడి ఆత్మహత్య పుకారూ, కంటె మాయం కావడం మొదలుగా ఉదంతంతో మధురవాణి విశాఖపట్నంలో సౌజన్యారావు ఇంటికి చేరే అవకాశం లభించింది. కరటక శాస్త్రి నోట సౌజన్యారావు లాయరు "మంచివాడు – నీతి పరుడు" అన్న మాట ఆమెను ఆకర్షించింది. మగ వేషంలో లాయరు ఇంట్లో ప్రత్యక్ష మయింది. అతనితో మాటల్లో వేశ్యల పట్ల ద్వేషం హేతువుకు నిలవదనీ నిరూపిస్తుంది. వేశ్యా వృత్తి మానడానికి ఏర్పడే ఆటంకాల్ని ఇబ్బందుల్ని ప్రస్తావిస్తుంది. వారు పాటకూ ఆటకూ ప్రాతినిధ్యం వహిస్తారు. ఎవరైనా పిలిస్తేనే వారి బ్రతుకులు

గడుస్తాయి. పెళ్ళి చేసుకొని స్థిరపడే కోరిక ఉన్నా కోరదగిన వరుడు ముందుకు వచ్చే వీరు డెక్కడు? అని ప్రశ్నిస్తుంది. సౌజన్యారావు ఆలోచనలకు పదును పెడుతుంది. వేశ్యా సమాజం పట్ల అతనిలో ఏర్పడిన వ్యతిరేకతను తొలగిస్తుంది. సౌజన్యారావును ఒప్పిస్తుంది. ఇదీ మధురవాణి వ్యక్తిత్వంలో ప్రకాశ రూపం. తనకూ కొన్ని నీతి నియమా లున్నాయని మధురవాణి మాట్లాడడం అప్పుడున్న పరిస్థితుల్లో ఒక ఎత్తుగానూ భావించవచ్చు. కాని ఆమె మనసును శంకించలేని విధంగా పాత్ర రూపొందింది. ఆమె సాని వృత్తి మానడానికీ అతని నీడలోకి రావడానికీ మానసికంగా సిద్ధమయింది. తన వృత్తిలోని “హైన్యత”ను గుర్తించింది. స్వశక్తితో పరిణతి చెందిన స్త్రీగా పరివర్తనా సంప్రసారాన్ని టాన్స్‌మిషన్ (transmission) పొందింది. ఇది వ్యక్తిత్వ వికాసానికి జీవ భూతమయింది. జీవితంలో దొరకిన అవకాశాలతో సానుకూల (పాజిటివ్) దృక్పథంతో నిర్మాణ (కన్‌స్ట్రక్టివ్) భావనతో సాధ్యమయింది. సంస్కరణ దృష్టీ – మార్పు లక్ష్యంగానూ నైతికమైన విలువల పట్ల గౌరవంతోనూ అనితరమైన పాత్రగా రూపొందింది. కన్యాశుల్కం నాటకంలో గురజాడ. అప్పారావుగారి మరోవైపు – ప్రగతి శీల దార్శనికతకు మధురవాణి పాత్రలో వ్యక్తిత్వ వికాసం సమాజానికి మార్గ దర్శకంగా నిలచింది.

## 8. చీకటి నుండి వెలుగులోకి

## గిరీశం - నాటకానికి కిరీటం

‘కన్యాశుల్కంలో చీకటి నుండి వెలుగులోకి పయనించిన పాత్ర గిరీశం. ఈ నాటకానికి స్వర్ణ కిరీటం. అతని హాస్యం జల్లులు, ఆ కిరీటంలో పొదిగిన మణి ప్రభలు! మనసుకు జిగేల్ మనిపిస్తాయి. ఊహకు మిరుమిట్లు గొలుపుతాయి! ఆ ప్రభావం అలలపైన సామాజికులు తేలిపోతారు! సమయం తెలియదు. కాలం గడుస్తుంది వేగంగా. చుట్టూ ఉన్న వాస్తవ సమాజ చలనంలో బొమ్మలు లోపలి తెరపై అలరిస్తాయి. పైపై హాస్యం ఆగుతుంది. లోపలి కరుణ జలం కదలుతుంది.

ఇదీ పాత్రలో ప్రాణవంత మయిన ప్రత్యేకత. ఆధునిక సమాజ చిత్రణంలో యువ లోకానికి ప్రతినిధి గిరీశం. గడచిన కాలం చీకటిగానూ, రాబోయే కాలం వెలుగుతోనూ పొందే ఆశారూపం సూచితమయింది. ఈ పాత్ర మహా కవి గురజాడ సృజన కళా రూపం, అపూర్వమైందీ, ఎక్కువగా విద్యా వివేకాలు లేకపోయినా లోకజ్ఞానంలో చతురత కలవాడు. స్వార్థంలో ఎంతటి వారినయినా నమ్మించి పబ్బం గడుపు కోగలడు. ధైర్య శాలి! 'ఆషాఢ భూతి' అన్న విశేషణాన్ని పొందినవాడు. ఈ దేశం ఆదేశం అని లేకుండా ఎక్కడయినా కనిపించే మనస్తత్వం గల పాత్ర! తెలుగు సాహిత్యంలో శాశ్వతమైన యశోస్థానాన్ని పొందింది. ఆధునిక యుగంలో సమాజంలో వచ్చే మార్పుల నేపథ్యంలో అవతరించిన పాత్ర, తన అవసరాలకు ఒక్కొక్క విధంగా మనుషుల్ని తన వైపుకు తిప్పుకునే నేర్పు అతని స్వంతం.

నాటకం మొదటి దృశ్యం ఆరంభంలోనే 'డబ్బు' అవసరంతో ప్రత్యక్షమవుతాడు. విలాసాలకు కపట నటనలో ప్రతిరోజూ గడపడం అలవాటయింది. డాన్సింగ్ గరల్స్ కావచ్చు, మరొకటి కావచ్చు. అతని జీవితంలో ఇదొక తప్పని అనుభవ క్రీడ. అమాయకురాలై వితంతువు బుచ్చమ్మను తీసుకపోవాలనే ఆలోచన మోసపు క్రీడకు పరాకాష్ఠ. నాటకం చివర ఇది తెలిసిన సౌజన్యారావును బాగా కలచివేసింది. ఇక కథా గమనంలో మరెన్నో! నాటకారంభంలో గిరీశం స్వగతం! చైతన్య ధోరణి (స్ట్రీమ్ ఆఫ్ కాన్షెస్‌నెస్) ధోరణిలో ఆంతర భాషణాన్ని (ఇంటర్నల్ మోనలాగ్)ను తలపిస్తుంది. ఇది రచయిత అనుకోకుండా జరిగినా అనుకొనీ (కాన్షియస్‌గా) వ్రాసినా దాని ప్రభావ గుణాన్ని బట్టి, నాటక కళలో అంశంగానే సమాలోచనంలో నిలుస్తుంది. చిట్ట చివర గిరీశం మాట "కథ అడ్డంగా తిరిగింది," తానను కున్న పథకం తారుమారై కొత్త మలుపు ఏర్పడింది. ఇది అతడు వెలుగులో పయనించే అవకాశానికి హేతువయింది.

గిరీశం పాత్ర పట్ల రచయిత అభిలాషనూ తెలియజేస్తూంది. ఇది ఆకర్షణకళతో ప్రవర్తించిన పాత్ర, చివరలో వ్యర్థం కాకుండా ప్రయోజన యుతం కావడం జరిగింది. ఈ సంవిధానం (మార్పులో పరిస్థితుల కలయిక) జీవితం పట్ల గురజాడ ఆశావహమైన సానుకూల (పాజిటివ్) ధోరణినీ, సమాజం పట్ల గురుతరమైన బాధ్యతను భావింపజేస్తూంది.

2

నాటకంలో ఇతివృత్తం తన చుట్టూ ఉన్న వైవిధ్యంతో కూడిన వాస్తవ సమాజానికి చెందింది. ఇది రచయితలో జవాబుదారిని పెంచింది, మార్పు అనేది ఒక్క నాటితో జరిగేది కాదు. ఏవో కొన్ని విషయాలకే పరిమితం కాదు. ఇది నిరంతర ప్రక్రియ. సమాజంలో ఒక విధంలో – సంప్రదాయ పరంపరలో ఆచార వ్యవహారాలతో మూఢ విశ్వాసాలవల్ల ప్రవహించడం దాదాపు ఆగినంత పని అయి, గడ్డ కట్టే ప్రవాహ స్థితిలో ఉన్నదీ. దీనికీ నాటకంలో అగ్నిహోత్రావధానులూ లుబ్ధావధానులూ ప్రాతినిధ్యం వహిస్తారు. మరో విధంలో పాశ్చాత్య భావ జాల ప్రభావంతో పరంపరగా వచ్చే స్థితులకు దూరమై, కొత్తగా వచ్చే వాటి ఫలాలు అందకా, స్థిరత చేకూరని స్థితులతో, జీవికకు అవకాశాలు లేక, దిశా నిర్దేశం లేక గాలి పటాల్లా తిరిగే యువత, దీనికి గిరీశం ప్రాతినిధ్యం వహిస్తాడు. పాత వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థ సంపూర్ణ రూపం పొందడానికి కొంత కాలం పడుతుంది. సంధి సమయంలో మార్పులు చోటు చేసుకునే సందర్భాల్లో క్లిష్ట స్థితులేర్పడతాయి. వీటిని కొందరు దాటలేరు. అవకాశాలు తక్కువ. అవసరాలు ఎక్కువ. ఈ కారణంగాను కొత్త పరిస్థితుల మనస్తత్వం వల్లనూ ప్రభావంతో ఏర్పడిన "డబ్బు" సులభంగా పొందే ప్రయత్నంలోనూ అవలక్షణాలకూ దుర్నీతికీ చెడు నడవడికీ ఆస్కారం ఉంది. వ్యక్తితోపాటు సమాజమూ పాలనా వ్యవస్థ – ప్రభుత్వం బాధ్యతల్నీ విస్మరించడానికి వీలు లేదు. దీనికి జడ స్థితిని వదలించే చేతన అవసరం. సమస్యల పట్ల సరి అయిన అవగాహనతో అవకాశాల్ని కల్పించే యోజనతో యువతకు దిశా నిర్దేశం అవసరం.

ఈ నాటకంలో సౌజన్యారావు పాత్ర కొన్ని పరిమితుల్లో అంతో ఇంతో నిర్వహించడం జరిగింది. "మంచి వాడూ నీతి పరుడూ" కావడం బాగా లాభించింది. ఈ ప్రయోజనాన్ని పొందిన వారిలో గిరీశం ఒకడు. ఈ పాత్ర కొందరు భావించినట్లు గాలి పటంలా గాలిలో వదలబడలేదు. లాయరు సౌజన్యారావు బోధ (కౌన్సిలింగ్)తో, పై చదువుల్లో ఉత్తీర్ణుడయి ఎదగడానికి మంచి అవకాశం దొరకింది. అతడు పడే డబ్బుకు ఇబ్బంది చివరలోనూ ప్రసక్తమయింది. అయితే తాను సహాయం చేయడానికి ముందు మాట ఇవ్వడం, సమాజంలో ఉన్న వారు లేని వారి పట్ల ఉదారతను

చూపవలసిన కర్తవ్యాన్నీ చూపిస్తూంది. ఇది మంచి మలుపు. అటు గిరీశానికి పోవలసిన దారినీ, ఇటు సమాజానికి చేయవలసిన పనినీ సూచిస్తూంది. సమాజమనే నాటకంలో గిరీశం ఒక పాత్ర మాత్రమే, అదీ కొన్ని పరిమితుల్లోనే వర్తిస్తుంది. ఈ మేరలో పాశ్చాత్తాపంతో రిఫార్మ్ అయిన విషయం, కోర దగిందీ. మంచి వైపూ వెలుగులోకీ అడుగులు వేసే అభిలాష సంతోషకరమైందీ. గిరీశం పాత్ర ఆకర్షణీయ మైన వ్యక్తిత్వంతో రూపొందిన మాట వాస్తవం. అమాయకురాలైన వితంతువు బుచ్చమ్మను వదలి, ఆమె జోలికి పోకుండా, తన దారి తాను చూచుకొని వెళ్ళే మానుష ధర్మం, గిరీశంలో మేల్కొని మానవతను వరించడం గొప్ప విషయం. ఆకర్షవంతమైన గిరీశం పాత్ర గురించి నాటక కర్తకూ ఒక సమయంలో సందేహం కలిగింది. తాను "దుర్నీతినీ" "దుర్నడత"నూ కలిగిన పాత్రను "ఆకర్షవంతం చేసి హాని చేసానా?" అనీ. దీన్ని గురించి ఆలోచన చేయడమూ జరిగింది. తాను అలా "చేయలేద"నే సమాధానం ఎంతో తృప్తినీ కలిగించింది. సౌజన్యారావు విశాల హృదయం చేత వెలుగులోకి అడుగు వేసేందుకు సమాజంలో ద్వారం తలుపులు తెరవబడినాయి. అనేకమైన అనుకూల కారణాల వల్ల వచ్చే మార్పుల కనుగుణంగా జీవితాన్ని సరిదిద్దుకొనే అవసరం ఉంది. దాన్ని గుర్తించడం జరిగింది. ఇది నాటకానికి మార్గదర్శక లక్షణాన్ని. చేకూర్చింది. సమస్యను ధైర్యంగా ఎదుర్కొని "విజయవంతంగా ముందుకు పోవడమే" కర్తవ్యంగా స్థాపితమయింది. మధుర వాణికి గిరీశం "చెడ్డ వాడ"ని తెలుసు. సౌజన్యారావుతో "క్షమించండి!" "ఆయనను బ్రతకనివ్వండి" అన్నది. బుచ్చమ్మను కాపాడే ఉద్దేశం విని, గిరీశం గురించి మాట్లాడింది. అతడు యువకుడు! భవిష్యత్తు ఉన్నవాడు. అతని పట్ల జాలి పడింది. అతనిలో ఉన్న ఆకర్షణ అలాంటిది. ఇది ముమ్మాటికీ జాలి పడవలసిన పాత్ర!

మూఢ విశ్వాసాలకు చరమ గీతం పాడవలసిందే! అయితే మౌలికమైనవీ ఉత్తమమైనవీ సాంస్కృతికమైన – మానవీయమైన విలువలకు క్షతి కలగకూడదు! యువత మంచి దారిలో పయనించడానికి, మార్పుతో పాటు సామాజిక ప్రగతిలో, వ్యక్తి జీవితానికి ఆర్థికమైన భద్రతతో జీవనానికి అవకాశాలతో సార్థకతను కలిగించే అవకాశాలూ తెరవబడాలి! అపుడే ఆధునికత రాణిస్తుంది, సమాజానికి బలం

చేకూరుతుంది. ఈ సామాజిక నేపథ్యంలో గిరీశం పాత్ర ఆధునిక చేతనకు మార్గదర్శకమయిందీ. యువత గురించి గురజాడ ఉద్దేశంలోని భవిష్యత్ దార్శనికతను ప్రతిఫలింపజేస్తూంది.

## 9. ముత్యాల సరాలు - ఆధునిక యుగ భావన

1

గురజాడ ముత్యాల సరాలు తెలుగు కవిత్వ చరిత్రలో ఆధునిక యుగ భావనకు ఆదర్శమైంది. మాత్రా ఛందో ప్రవాహాన్ని అందించింది. సులభంగా సూటిగా చిక్కని భావనతో కవిత్వకళ - దీని ప్రత్యేకత. ఇదొక శ్రేణికి చెందింది. సమాజ సంబంధమూ మానుష స్పందనమూ జీవన వాస్తవికతనూ కలిగింది, మరోశ్రేణికి చెందింది. ఈ రెండు శ్రేణుల చక్కని మేళనంతో ఏర్పడిన స్వరూపం యువ హృదయాలను బాగా ఆకర్షించింది. పెద్దల ప్రశంసలనూ పొందింది. ఈ దీర్ఘ కవిత నూట పదహారు (116) పంక్తుల్లో ఉంది. ఈ సంఖ్య ఎంత సన్మానసీయమయిందో అందరికీ తెలిసిందే! ముత్యాల సరాలు సరికొత్త ఛందో రూపం. నాలుగు పాదాలు కలిగింది. ఇందులో 3+4+3+4 మాత్రాగణాలు 1,2,3 పాదాలలో ఉంటాయి. నాలుగో పాదంలో పై పాదంలోని మాత్రా గణాల్లో చివరనున్న 7 నుండి 14 అక్షరాల మధ్య ఎక్కడైనా నిలపబడవచ్చు. చివరి గణంలో మధ్యలో అక్షరాన్ని పొడిగించే కాకువు స్వరం (ఎక్సెంట్)తో దీర్ఘానికి అవకాశం ఉంది. ఇదొక అందం. గతి విశేషంలో దీర్ఘస్ఫూర్తి రచనకు శిల్ప శోభ నిస్తుంది. దీర్ఘంతో సంగీత స్వర సుందరత కలుగుతుంది. ఒక్కొక్కపుడు చకితంగా ఆగుతుంది. మరొకపుడు వేగంగా కదలుతుంది. ఇంకొకపుడు దీర్ఘంగా సాగుతుంది. ఇవి సందర్భాన్ని బట్టి ఉత్సాహాన్నీ హ్లాదాన్నీ శాంతాన్నీ కలిగించే గుణాల్ని పొందుతాయి. ఇదీ ముత్యాల సరాలలోని ఛందో రహస్యం. కవిత్వ కళలో అనుభవంతో ఆనందాన్ని కలిగించడమే దీని లక్ష్యం. గురజాడ అనగానే “ముత్యాల సరాలు” మనస్సులో కదలుతుంది. ఇది కవి సృజన చేతన యొక్క ఇన్నొవేషన్, సరికొత్త అన్వేషణం విజయవంతమయింది.

ఈనాటి అవసరాల్ని బట్టి మారిన పూర్వపు విద్యా వాతావరణంలో ఈ ఛందో రూపం కవితా ప్రియుల ఆమోదాన్ని పొందింది. ప్రసిద్ధినీ పొందింది. ఇది ఏ భావాన్ని అయినా ప్రకటించే, ఏ రసాన్ని అయినా ఒలికించే శక్తి కలిగింది అన్న అభిప్రాయాన్ని రుజువు చేసింది. ఆధునిక యుగంలో కేవలం తెలుగు భాషకే పరిమితం కాకుండా ఇతర భాషలలో కవిత్వంతో పరిచయా లేర్పడడం వల్ల రసజ్ఞులు కొత్తదనాన్ని కోరడం సహజం. హృదయాన్ని స్పందింప జేసే యోగ్యత కలిగి ఉంటే చాలు నన్న భావమూ కనిపిస్తుంది. గురజాడ తన అన్వేషణలో పొందిన బహుమానంగా గౌరవాన్ని పొందిందీ ముత్యాల సరాలు. ఈ వరం దేవతల నుండి కాక మనిషి మేధ నుండి హృదయ స్పర్శతో సరించింది. పదాలు ముత్యాలవలె కూర్చిన నాలుగు పాదాలు, నాలుగు వరసలుగా తీర్చిన ఛందో రూపం సరి కొత్త ప్రయోగంగా ఛందశ్శాస్త్రంలో చేరింది. కవిత్వానికి మరో కొత్త రూపం సిద్ధించింది.

ఈ దీర్ఘ కవిత స్థూలంగా కవిత్వ స్వరూప ప్రతిపాదనం, హేతు దృష్టి, సంస్కరణం – మార్పు గురించి ప్రగతి భావనతో 'మరోవైపు' కు మార్గదర్శకమైంది. కొత్త పాతల మేలు కలయికతో, మంచి చెడ్డల వివేచనతో కూడిందీ. సమాజ సంబంధాల్నీ మానవీయ శక్తినీ ప్రతిఫలిస్తూంది.

*"గుత్తునా ముత్యాల సరములు*
*కూర్చుకొని తేటైన మాటల*
*కొత్త పాతల మేలు కలయిక*
*క్రొమ్మెరుంగులు చిమ్మగా...."*

ఇదొక విధంగా తన కవిత్వం గురించి కవి "మానిఫెస్టో"లా ఉంది. ముత్యం స్వచ్ఛతకూ అందానికీ అలంకారానికీ చిహ్నం. ఒక ముత్యం తరువాత మరొకటి వాటి మధ్యలో బంగారు రేకుతోనో / ముడితోనో కూర్చిన ముత్యాల వరసలతో పేరుగానూ దండగానూ మాలగానూ సరంగానూ హారం వాడుకలో ఉంది. ఇది మన జీవితంలో అనుభవంలో ఉన్నదీ. ఈ సరంలా "తేట" అయిన మాటలతో కూర్చిన అందమయిన రూపంతో కవిత్వం రూపితమయింది. ఇది "కొత్త" లోని మంచినీ

పాతలోని మంచినీ కలిపి రూపొందించింది. కొత్తత మెరుగుల్ని ప్రసరిస్తుంది. కవిత్వంలో జీవ కళకు చెందిన ప్రకాశం వ్యంజితమయింది. ఈ మాటలో 'తేట' లక్షణం ఉంది. సారవంతమయిందీ నిర్మల మయిందీ, సుందరమయిందీ, ప్రసన్నమయిందీ. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధమయిన అర్థస్ఫూర్తితో అనుభవంలో మెరుస్తుంది. ఇది అనుభవైక వేద్యమయింది. ఇది ఉత్తమ కవిత్వం గురించి విజ్ఞులు చెప్పేమాట! ఇది మొదటి భాగంలో మొదటి ఖండం (యూనిట్).

రెండో ఖండం (యూనిట్)లో జీవ కళ ఉన్న కవిత్వానికీ, లేని కవిత్వానికీ గల భేదం వర్ణితమైంది.

*"మెచ్చునంటా వీవు నీవిక*
*మెచ్చుకుంటే మించి పాయను.*
*కొయ్య బొమ్మలె మెచ్చు కళ్ళకు*
*కోమలుల సౌరెక్కునా?"*

దీనిలోని భావం సహృదయుల స్పందనతో ముడివడింది. ఒక్కొక్కరిలో ఒకొక్క దృష్టి కోణం ఉంటుంది. ఆ రేఖలో ఉన్న దృశ్యం చూచే వ్యక్తిలో మానసికమైన అభిలాషను బట్టి అర్థమవుతుంది. ఆనందిస్తారు. మెచ్చుకుంటారు. ఇది సర్వ కాలాల్లోనూ ఉండేది, దృశ్య ప్రపంచంలో కొందరు కొయ్య బొమ్మల్ని అభిమానిస్తారు. వీటిలో జీవ కళ ఉండదు. పనితనం ఉంటుంది. శుష్కత కఠినత ఉంటుంది. ఇవి మెచ్చే వారికి ఆర్ద్రత కోమలత కలిగినవీ జీవ కళతో ప్రకాశించేవీ రూపాల అందం తెలియదు. దీన్ని ఆనందించే గుణం సుకుమారమయిన అనుభూతి సూక్ష్మతకు చెందింది. ఇది నిజమైన కళా దర్శనానికి సంబంధించిన విషయం. ఇందులో కవి తన కవిత్వం పట్ల ఆత్మ విశ్వాసం స్పష్టం. ఈ మాటల్లో ఒక భాషా వైచిత్రి ఉంది. "మెచ్చుకుంటే" "మించి పా/పోయెను" ఈ క్రియా రూపం మాండలిక భేదం. ఈ మాట కాకువు స్వరంలో ఎగతాళి అపహాస్యం వ్యతిరేకార్థం వినిపిస్తాయి. ఈ రెండు ఖండాలతో కూడిన విభాగం ముందు రాబోయే కవిత్వానికి పీఠిక లాంటిది.

(2)

తూర్పున తెలవారింది. తోక చుక్క, ఈ వేగు చుక్కలో "ఒడయుడౌ" వేవెలుగు ప్రకాశం కనిపించింది. "ఒడయుడు" అచ్చమయిన తెలుగు పదం "ప్రభువు" అని అర్థం. ఈ విధమయిన అచ్చమైన తెలుగు పదాలు, అందులోనూ వాడుకలో ఉచ్ఛారణలో బహు విధాలయిన స్వర విశేషాలతో అర్థాలు మారేవి ఎన్నో! తటస్థ పడతాయి. ఈ కారణంగా తిక్కన తరువాత గురజాడను శ్రీశ్రీ తన అభిమాన కవుల్లో చేర్చి ఉండవచ్చు. రాత్రి అంతా మెరసిన చుక్కలు ఉదయం వెలుగు నీటిలో మునిగిపోయాయి. రాత్రి నుండి ఉదయానికి మార్పులో కోకిల గళ స్వరం, కోడి మేలు కొలుపూ మొదలుగా భావ చిత్రాలు కవితా ప్రియుల్ని అలరిస్తాయి. "ఆకుల్ని కదలించడానికి గాలి వెనకాడు" తూంది. "పూలు కళ్ళు తెరచి" చూస్తున్నాయి. సుకుమారమైన ప్రకృతి దృశ్యాలతో తెలుగు పలుకుల సొగసుతో కథ మొదలయింది.

కవిలో ఒక పాత్ర రూపం ఏదో పని మీద పట్నం వెళ్ళి పదిరోజులు ఉండవలసి వచ్చింది. అక్కడొక విశేషం జరిగింది. పెద్దలతో పరిచయంలో తెలిసిన విషయం 'సంఘ సంస్కరణ' భావరూపం (కాన్సెప్ట్) బలమైన ప్రభావాన్ని నెరపింది. ఇదీ కవిత్వానికి ప్రాణభూతమయింది. ఇదీ! "సంగతి".

ఇంటికి వచ్చాడు. ప్రేయసిని నిదుర నుండి లేపాడు. ఈమె మరో పాత్ర, తన ప్రేయసిలో రూపుదిద్దుకుంది. "చూచావా? మింటిలో కాము బాణం"అన్నాడు! ఇది ధూమ కేతువు నుద్దేశించింది. ఆమె ముఖం తిప్పుకుంది. ఈమె ప్రవేశించింది. కారణం వేరే కథ. తరువాత వస్తుంది. ప్రస్తుతం 'సంఘ సంస్కరణ' భావనతో సన్నివేశం నిర్మితమయింది. ఇక్కడొక మంచి భావ చిత్రం (ఇమేజ్)! "ధూమ కేతువు! తోక చుక్కను"కేతువనీ (తొమ్మిది గ్రహాలలో ఒకటి) దుష్టమైందనీ అపకారం చేస్తుందనీ (ప్రజల నమ్మకం!) "నీ ముఖ చంద్రుడలిగి చూడడు" అంటాడు. చంద్రునికి కేతువు శత్రువు! పురాణ ప్రసిద్ధమైంది. ఆ కథ ఇక్కడ అనుసంధించుకుంటే సరిపోతుంది. 'భయపడనవసరం లేదు', ఇది "దేవతాస్త్రీల విహార క్రీడలో తెల్లని కలువ పూవు సుమా!" అంటాడు. ధూమ కేతువు పట్ల సద్భావాన్ని కలిగించే యత్నంలో ఇదొక మంచి భావ చిత్రం! ఇది ఎపుడో ఆకాశంలో కనిపించదు. అల్ప బుద్ధులు భయపడినారు. దీని వల్ల కీడును శంకించారు. అంతే కాని దీని వల్ల రవంత కూడా ఆపద కలగదు.

"సృష్టికర్త సృజన నిపుణతకు చివరి రూపమన్నట్లుగా ఉంది" అనీ ప్రశంసిస్తాడు. అది "ఆకాశాన వ్రేలాడుతూందనీ పరిపరి విధాల ప్రశంస చేయబడింది. కవుల కల్పనలో వస్తువు కొత్త కొత్త "వన్నె చిన్నెలు" పొందుతుంది. అమాయకమైన పురాణ గాథల్ని నమ్మడం ఉచితం కాదనీ ప్రబోధిస్తాడు. వైజ్ఞానిక దృష్టి అవసరాన్ని చెబుతాడు. హేతుదృష్టి అవసరమనీ, కళ్ళతో చూడలేని వస్తు తత్వాన్ని కాంచిన విజ్ఞాన మూర్తుల్ని పేర్కొంటాడు.

ఇతడెవరో కాదు! భూమికి దూర బంధువు! తనదారిన పోతూ చూచేందుకు వచ్చాడు. డెబ్బయి ఎనబయి ఏండ్ల కొక మారు మనుషుల కళ్ళకు సంతోషంగా కనిపిస్తాడు. ఇతడు బాధలకు కారణమనీ దిగులు చెందడం మంచి పని కాదంటాడు. తాను మాత్రం ఈ ధూమ కేతువును "సంఘ సంస్కరణ ప్రయాణంలో పతాకగా భావిస్తాడు. సమాజాన్ని ముందుకు నడిపించే ప్రగతి చిహ్నంగా భావించడం, ఎలాంటి వస్తువునైనా ఆధునిక భావ జాలానికి మలచే ప్రజ్ఞను తలపిస్తూంది. ఇదొక పార్శ్వం!

(3)

మరో పార్శ్వం, జాతి "బంధాల గొలుసులు" వీడి "మనుషులంతా ఒకటయి" "లోకమంతా ఇల్లయి" పోయే కాల్పనిక దార్శనికతకు చెందిందీ. వర్ణ భేదాలు సమసిపోయి "హద్దులు లేని ప్రేమ"తో సంతోషాన్ని పెంపొందించే విశ్వ భావనా మయమైందీ. అన్ని మతాలకూ మూల మైన "జ్ఞానం" ఒకటే. ఇది వెలుగై దారి చూపిస్తుంది. పట్నంలో తాను విన్న "ప్రాజ్ఞుల" మాటల్ని, ఆరోహణలో "మొదటి మెట్టు"గా భావిస్తాడు. అన్ని జాతులకు చెందినవారు ఒక చోట కలిసి విభేదాలు మరచి విందులో పాల్గొనడం, గొప్ప మార్పుకు సంకేతంగా ప్రేయసికి చెబుతాడు.

ఇక్కడొక చిన్న మలుపు! ప్రస్తుత స్థితికి భిన్నమైంది. గురజాడ కథన శిల్పాన్ని తెలియచేస్తుంది. అతడు పట్నం వెళ్ళినప్పటి నుండీ ఇంటికి చేరేవరకూ తన పట్ల తోటి కోడలూ అత్తగారూ సాటి వారూ వ్యవహరించిన తీరునూ ఎదుర్కొన్న కటు పరిస్థితులనూ ప్రేయసి ఏ కరవు పెడుతుంది. తన విషయం పోనీ అతని తల్లిదండ్రుల విషయమూ జ్ఞాపకం చేస్తుంది. కుటుంబానికి సంబంధించిన చిన్న చిన్న విషయాలతో స్త్రీ సమాజం

ఎట్లా ఉందీ చిత్రితమైంది "ఇంగ్లీషు చదువు ఇందుకా?" "సంప్రదాయ భావాల్ని వదలేందుకా?" అని ప్రశ్నిస్తుంది. తోక చుక్క విషయమూ ప్రస్తావిస్తుంది. ఇదొక పాత్రగా, సమాజంలో నెలకొన్న హేతుదృష్టి లేని అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆమె మాటల్లో కొంత నిజం లేకపోలేదు. అది కటువైన జీవన వాస్తవికత చాలా అల్పమైన విషయాల పట్ల శ్రద్ధ – చింతనమూ కలిగింది.

అందరూ కలిసి తిని నంత మాత్రాన ఐకమత్యం కలుగుతుందా? సంఘ సంస్కరణ మనేది నలుగురు మెచ్చుకోడానికీ ప్రచారానికీ కాదు. హృదయంలో నుండి రావాలి. నిబద్ధత అవసరం. దీన్ని, అవకాశం ఉన్న లోపాన్ని ఆమె మాటల్లో చెప్పించడం జరిగింది. ఆమె అంతటితో ఆగలేదు "మరొకరిని మరులు గొనరాదో!" అని దెప్పి పొడిచింది. "సరుల మైచరచి" నిష్క్రమించిందని. చమత్కారమైన గడుసుదనంతో ముగిసింది.

ఈ పాత్ర మాటల్ని విశ్లేషిస్తే ఒకటి ప్రత్యక్షంగా 1) భారతీయ కుటుంబాల్లో సర్వ సాధారణమైన చిన్న చిన్న తగవుల వాతావరణాన్నీ 2) హేతు దృష్టీ – మార్పు అవసరమన్న భావనను కలిగిస్తాయి. రెండోది పరోక్షంగా 1) సంస్కరణోద్యమాన్ని విపరీతార్థాలతో అపహాస్యం పాలు చేసే వారి వైఖరినీ 2) సమాజ ప్రగతికి సంస్కరణను కోరే హృదయం అవసరమన్న భావనను కలిగిస్తాయి. స్త్రీలలో హేతు దృష్టినీ దీనితోపాటు సమాజ స్పృహనూ కలిగించే వాతావరణాన్ని నిర్మించే అవసరాన్నీ తలపిస్తుంది.

*"తూరుపున తెల్లవారింది*
*తోక చుక్క అదృశ్యమయింది*
*లోక మందలి మంచి చెడ్డలు*
*లోకు లెరుగుదురా?"* అన్న ప్రశ్నతో ముగిసింది. మళ్ళీ తోక చుక్క ఎన్ని దశాబ్దాలకో కనిపిస్తుంది! అప్పటిలోగా నయినా మంచి చెడ్డలను మనుషులు తెలుసుకుంటారన్న ఆశాభావం జవాబుగా తోస్తుంది. దీనికి వివేచన అవసరం. ఇది అందరిలో స్త్రీ పురుష భేదం లేకుండా, జాతి వర్ణ భేదం లేకుండా పనిచేసి మంచి సమాజాన్ని చూపిస్తుందనే కవి అభిప్రాయం.

'ముత్యాల సరాలు' కృతి – అన్వేషకుడుగా సృజన శిల్పిగా గురజాడ సంఘ సంస్కరణ దృష్టినీ విశ్వభావనా హృదయాన్నీ ఆవిష్కరిస్తోంది.

## 10. కన్యాశుల్కం యుగకర్త - అస్తిత్వం

ఆధునికాంధ్ర సాహిత్యానికి యుగ కర్త గురజాడ అస్తిత్వాన్ని భావింపజేసే రచనల్లో 'కన్యాశుల్కం' నాటకం అగ్రేసర మయింది. సమాజ చరిత్రలో పరిణామ స్థితులకూ సాహిత్య చరిత్రలో వికాసగతులకూ చెందిన పోకడలతో విలువలతో లక్ష్యాలతో కూడింది. ఆదర్శంగా నిలిచింది. ఈ కృతి రెండో కూర్పుతో ఇతివృత్తం విశాలమయింది. పాత్రల చర్యలు ప్రతి చర్యలతో వైవిధ్యాన్ని పొందింది. సామాజికంగా ఉన్నతమైన లక్ష్యాన్ని చేరే ఆలోచనలో వివిధ సంఘటనలకు సంబంధించిన నాటక సంవిధాన కళ స్థాయి పెరిగింది. గురజాడలో ఉద్యమ వ్యక్తిత్వం సంస్కరణకూ మార్పుకూ బాగా తోడ్పడింది. ఈ మార్గంలో ప్రజలకు చేరువ అయ్యేందుకు వాడుక భాషలో వ్రాయబడింది. ఈ ప్రయత్నం సఫలమయింది. గొప్ప రచనకు వాడుక భాష ఉపయోగపడుతుందనీ ఉన్నతమైన ప్రమాణాల్ని సాధించవచ్చుననీ నిరూపితమయింది.

ఆనంద గజపతి రాజా వారి ప్రేరణతో కన్యాశుల్కాలతో ఆ కాలంలో జరిగిన బాలికల వివాహాల పట్టిక తయారు చేయబడింది. దీని ఆధారంగా సమస్యను గురించి ఆలోచన మొదలయింది. ఈ దురాచారాన్ని రూపుమాపే సాధనాల్ని గురించి చింతన జరిగింది. నాటక ప్రక్రియ ఉత్తమంగా తోచింది. ఈ సామాజిక దుస్థితుల్ని రూపు మాపే ఉద్దేశంతో సంస్కరణ పథంలో వేశ్యావృత్తి కూడా చోటు చేసుకుంది. దేని కయినా సంస్కరణమూ మార్పులో నైతికమయిన విలువలు ముఖ్యం. ఈ భూమికతో కన్యాశుల్కం అవతరించింది. గురజాడ అస్తిత్వానికి ఆధార భూమిగా నిలచింది.

ఈ నాటకం పూర్వ సంప్రదాయ నాటక సూత్రాల్ని నియమాల్ని అనుసరించలేదు. రస నిర్వహణలోనూ నాయికా నాయక భావనలోనూ వీటిని పూర్తిగా అధిగమించి, రచయితలో తన దయిన సృజన కళను పొందింది. ఇది గురజాడ అస్తిత్వానికి మూలంగా ఉంది. రస విషయంలో పైకి తెరలు తెరలుగా హాస్యం

అనుభవానికి వస్తుంది. ఇదే ఇందులో ముఖ్యమా? అన్నంతగా విరియపూసింది. అయితే దీని వెనక నుండి మానసికమైన అనుభూతిలో జాలిని కలిగించే కరుణ రసంతో గభీరతను పొందింది. సాధారణ స్థాయిలో దీన్ని గురించి ఆలోచన జరగదు. ఇది చివరలో సంస్కరణమూ పరివర్తనమూ లక్ష్యంగా ఉంది, శాంత రామణీయకతను పొందింది. అంటే గిరీశం, మధురవాణి బుచ్చమ్మ లుబ్ధావదానులు మొదలుగా 'సమస్యల నుండి ఒడ్డున పడి శాంత మనస్కులు కావడమన్న మాట. ఈ పరిణామాలకు సౌజన్యారావు వ్యక్తిత్వం ఎంతగానో సహాయపడింది. ఇక నాయికా నాయక భావమూ దీనికి సరిగా వర్తించదు. కానీ మధురవాణి పాత్ర పరిణామం చెంది మధ్యమణిగా రూపొందింది. సౌజన్యారావు తుది పర్యవసానాలకు ప్రేరణ శక్తిగా నిలవడం నాటకం ఏ దిశకు వెళ్ళేదీ ముందుగానే సూచితమయింది. ఇరువురి మనసులూ కలసి విజయం అంచులు చేరడం నాటకానికి ఉన్నత స్థాయి చేకూరింది. నాటక కర్త స్వతంత్రమైన సృజన కళతో నెరపిన నిర్వహణ ప్రయోగం దానికదే సాటిగా నిలచింది. దీన్ని గురించి నాటక కర్త స్వయంగా "తాననుకున్న దాని కన్నా ఎక్కువ సంతృప్తి నిచ్చిందన్న"మాట ఇది నాటకం సర్వాంగీణతను భావింపజేస్తూంది. ఇది సంప్రదాయ పద్ధతిలో కాకుండా కొత్త పద్ధతి ననుసరించిందన్న భావన కాస్కార మిస్తూంది.

ఈ నాటకం గురించి వాద వివదాలతో చర్చలతో తెలుగు నాటక విమర్శకు వేదిక అయింది. సాటిలేని క్లాజిక్‌గా స్థిరపడింది. సామాజికుల ఆమోదాన్ని పొందింది. మరోవైపుకు దిశా నిర్దేశం చేసింది. ప్రగతి మార్గాన్ని పరచి చూపింది. మార్పు కోరే తరాలకు బలమైన ప్రేరణ శక్తిగా నిలచింది. సామాజిక వాస్తవికతతో కరుణోపేతమయిన సమస్యను తీసుకోవడం పెద్ద సవాలుగా మారింది. దయనీయమైన స్థితుల్ని చిత్రించడం అవసరమయింది. ఈ సందర్భంతో స్త్రీల విషయంలో రావలసిన స్వేచ్ఛతో పాటు తెరచుకోవలసిన అవకాశాల్ని గురించి ఆలోచింపజేసింది. ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యతను గుర్తు చేయడం జరిగింది. రచయిత సంస్కరణమూ మార్పూ అన్న రెండు కళ్ళతో సమాజాన్ని వీక్షించి పరిశీలించి వివేచించి ఆశావహమైన పరిష్కార యోజనతో కూడిన గురజాడ అస్తిత్వం సమాలోచనంలో నిలుస్తుంది.

బాల్య వివాహాలూ కన్యల్ని అమ్ముకొనే దుస్థితీ, పిల్లలకు విలువ కట్టి స్వంతం చేసుకొనే దౌర్భాగ్యమూ, మూఢ విశ్వాసాలతో మోసాలకు గురి అయ్యే పెద్దల స్థితులూ, స్త్రీ జీవితంలో దైన్య హైన్య స్థితులూ, యువతలో దారి తప్పిన ద్రిమ్మరితనం, చెడు పోకడలూ వాస్తవ జీవిత చిత్రణంతో దృశ్య రూపాల్ని పొందాయి. నాటకంలో ఒక స్థలానికి చెందిన అగ్రహారమనేది యాదృచ్ఛికం. ఊరేదయినా పేరేదయినా ఆయా కుటుంబాల్లో జీవనగతులూ ఏర్పడే సమస్యలూ నాటకంలో ఇతివృత్తాన్ని నేలపై మట్టిపై ధూళిలో నడిపించాయి. దీని నుండి శుభ్రమయిన మానవతా రూపం అవతరించింది. ఇవి మనిషిని గురించీ చరిత్ర పరిణామంలో సాంస్కృతిక వికాసాన్ని గురించీ ఆలోచింపజేస్తాయి. వీటిలో వేశ్యావృత్తి – గాలికి తిరిగే యువత – వస్తూన్న మార్పుల్ని గురించి పట్టించుకోని పెద్దలూ ఆలోచనల్లో కదలిక లేని జడ మతులూ ఈ వ్యవస్థ గురించి తీవ్రంగా ఆలోచింపజేసే అంశాలు నిజంగా నాటక కర్తకు ఛాలెంజ్! గానే నిలిచాయి. సమాజంలో నెలకొన్న దుస్థితుల్ని చిత్రించడంతో నిలచిపోక, మంచి స్థితులకు దారి తీసే ఆలోచనకూ ప్రాధాన్య మిస్తూందీ రచన. జీవితం పట్ల ఆశా కిరణంతో సమాజం గురించి ఆలోచన చేయడమూ కనిపిస్తుంది.

కఠోరమైన వాస్తవానుభవాలు జీవితంలో తప్పని సరిగా రావలసిన మార్పుల్ని గురించి వేదనకు గురి చేసాయి. వీటి అవసరం గురజాడను ఆధునిక చేతనతో నడిపించింది. నైతికమైన విలువల్ని కాపాడే మానవతా గుణాన్ని ప్రోత్సహించే రచనా వ్యాసంగంపై దృష్టి పడింది. ప్రజల్లో మంచి అవగాహన కలిగేందుకు ప్రజలు మాట్లాడే సన్నిహితమైన వాడుక భాషలో నాటకం వ్రాయాలనిపించింది. సామాజిక బాధ్యతతో పాటు కళాత్మకమైన విలువలపట్ల శ్రద్ధ వహించడం గొప్ప విషయం. ఇది సాధింపబడింది. ఆదర్శంగా నిలిచింది. మానవ జీవితంలో కష్టాలూ నష్టాలూ బాధలూ వ్యథలూ వైరుధ్యాలూ స్వార్థాలూ దారి తప్పిన నడతలూ దురాచారాలతో కొట్టు మిట్టాడే సమూహాలు ఆలంబనంగా, గురజాడ అస్తిత్వంలో వ్యక్తిత్వం ఏర్పడింది.

ఈ నాటకంలో గిరీశం మధురవాణి సౌజన్యారావు పాత్ర గతుల మూవ్‌మెంట్స్ రేఖలతో ఏర్పడిన త్రిభుజాకారం శిఖరం ఆదర్శం వైపు ఉన్ముఖమైంది. వేరు వేరు

స్థానాల నుండి బయలు దేరిన జీవితాలు సాగుతూ పైపైకి ఒక చోట కలిసిన బిందు రూపం సమాజ భవిష్యత్తుకు ప్రగతిబింబంగా మారింది.

కన్యాశుల్కంలో ప్రధాన సమస్యలకు పరిష్కార సూచనలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆయా పాత్రల మనస్తత్వాల్ని బట్టి ప్రవర్తనల్ని బట్టి ఇవి ఏర్పడినాయి. ఇది గురజాడ పాజిటివ్ దృష్టికీ ప్రయోజనాత్మకమైన ఆశయానికీ ఫల రూపాలుగా మారాయి. ఇది కవి అస్తిత్వంలో సింహభాగాన్ని ఆక్రమిస్తుంది. ఇది ప్రత్యేకంగా పరిశీలించవలసిన విషయం. స్థూలంగా చూస్తే గిరీశం గాలికి వదలిన పటంలా కనిపిస్తాడు. కాని ఆలా కాదు. అతనికి సౌజన్యా రావు చేత జీవితంలో బాగుపడే పైకి వచ్చే దారి చూపబడింది. బుద్ధి తెచ్చుకొని బ్రతికే హిత బోధలో అవసరమయితే తాను ఆర్థిక సహాయం చేయడానికీ సిద్ధమయినాడు. ఇది వ్యక్తుల్లో సామాజిక బాధ్యతనూ తోటి మనుషుల పట్ల సానుభూతి కలిగి ఉండడం మాత్రమే కాక, అవసరమైన సాయం చేయడానికి వెనుదీయని మనస్తత్వం నాటకానికి కాంతి రేఖ నిస్తూంది. ఇక మధురవాణి తన వృత్తిని వీడి ప్రధాన స్రవంతిలోకి వచ్చే అభిలాష ఉన్నదీ. తన వృత్తిలోని దోషాన్ని గుర్తించింది. 'మంచి' వైపు పయనించింది. 'మేలు'కు సిద్ధమైంది. తన తల్లి మాట ప్రకారం నడచింది. ఈ వృత్తికి దారి తీసే పరిస్థితుల్నీ తన వలె ఈ వృత్తిలో ఉన్న వారు బయటపడలేని కారణాల్నీ పరిశీలించింది. తన నడవడి చేత ఆ వృత్తిలోని మచ్చను తొలగించే ప్రయత్నం చేసింది. మానసికంగా సిద్ధమయింది. క్రమ క్రమంగా సౌజన్యారావుకు దగ్గర అయింది. అతడు తనతో "షేక్ హాండ్" తీసుకొనే స్థాయికి చేరింది. తన వృత్తిలో మార్పుకు ఆదర్శంగా నిలిచింది. ఇక సౌజన్యారావు సత్య కాలపు బ్రాహ్మణ్ణి కాపాడడంలో ప్రదర్శించిన లౌకికమైన ప్రజ్ఞ సాంస్కృతికమైన మర్యాద, మానవతా దృష్టి గురజాడ లక్ష్యానికి శోభను చేకూర్చాయి. సౌజన్యారావులో గురజాడ వ్యక్తిత్వం రేఖా చిత్రంలా మనోదృష్టికి గోచరిస్తుంది. ఇందులో గమనించవలసిన విషయ మొకటి ఉంది. ఒక్క రచయిత పదే పదే అనుకుంటే సరిపోదు. పాత్రలు కూడా మానసికంగా తమ తమ చర్యల ద్వారా మార్పుకు సిద్ధం కావాలి. కన్యాశుల్కం నాటకంలో దీని కనుగుణమైన నిర్వహణ శిల్పం! ప్రశంసార్హంగా ఉంది. ఇక బుచ్చమ్మ విషయంలో నిస్సందేహంగా మంచి పరిష్కారమే! దీన్ని ఎవరూ

తప్పు బట్టడానికి వీలు లేదు. ఇది ఏ విమర్శకూ తావు లేనిది. ఆమె “విడోస్ హౌస్”కు వితంతు నిలయానికి చేరుకొనీ “ప్రాజ్ఞురాలై” తనకు “నచ్చిన వ్యక్తిని” చేసుకొనే లేదా మానే వికల్పం చాలా సమంజసమైంది. ఈ పరిష్కారం ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించడంతో పాటు వ్యక్తి స్వేచ్ఛ – స్త్రీ స్వాతంత్ర్యం అన్న రెండు మహత్తరమయిన భావ రూపాలకు సార్థకత చేకూరింది. ఆమె ఉన్న పరిస్థితుల్లో పునర్వివాహ ప్రయత్నం మేలు చేయదు, పైగా ఆమెను అలాగే వదలించుకున్నట్లు వదలినట్లవుతుంది. ఇపుడామె కాళ్ళపై నిలబడే ఆధారతలాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశం చాలా గొప్పది.

నాటకంలో సాధారణమైన స్థాయిలో జీవితంలో విషయాలెన్నో! నిర్వహణంలో భాగాలై మధ్య మధ్య ఆకర్షిస్తాయి. స్త్రీ పురుషుల మధ్య పరస్పరం అవగాహన ప్రేమ గౌరవం ఆదాన ప్రదానంతో కూడిన ప్రవర్తనం వారి వ్యక్తిత్వాల్ని తీర్చి దిద్దుతాయి. మధుర వాణి సౌజన్యారావుల మధ్య అభిలాష క్రమంగా బలపడుతూ వచ్చింది. ఇది హఠాత్తుగా జరగలేదు. ఆమె తన వృత్తిని వదలింది. మరో వైపు పయనానికి ఉత్సాహ పడింది. నాటకంలో ఆమె ఒక్కొక్క అడుగు జాగ్రత్తగా ముందుకు వేసింది. వేశ్యావృత్తికి సంబంధించిన మొత్తం సమస్య గురించి సంపూర్ణ పరిష్కారానికిది అదను కాదు. దీనివల్ల నాటక కళ విషయంలో రచనలో బ్యాలెన్స్ తప్పే ప్రమాదం ఉంది.

గురజాడ జాతీయ వాది. భిన్నమైన అభిప్రాయాల్ని ప్రకటించే సాహసమున్న స్వేచ్ఛా ప్రియుడు. ఆంగ్లేయులు చేసే మంచి పనుల్ని అభినందించిన మాట నిజమే! ఇది ఆయన సంస్కార రూపాన్ని తెలియజేస్తుంది. ఇప్పటికీ పాశ్చాత్యులు భాషా సాహిత్య పాలనా విద్యా విజ్ఞాన క్షేత్రాల్లో స్వాతంత్ర్యానికి పూర్వం చేసిన సేవలు మరచి పోరానివి. వారి ఉపదను స్మరించడమూ ఇప్పటికీ జరుగుతూనే ఉంది. అయితే పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుకరించరాదనీ ఆ ప్రభావంతో విపరీతపు పోకడలు పోకూడదనే నాటక కర్త ఉద్దేశం. గిరీశం పాత్ర చిత్రణంలో ఈ అంశాన్ని చూడవచ్చు.

తన రచనల్లో మౌలిక మయిన విలువలు దిగజారిపోతూన్న తరుణంలో వాటిని కాపాడే ఉత్సాహంతో కుల మత భేదాల్ని విస్మరింపజేసే మానవీయానికీ మానవతకూ పట్టం గట్టిన మహాకవి. ప్రజల పట్ల బాధ్యతతో తనదైన ఆలోచనతో

తన అనుభవాన్నీ ఆదర్శాన్నీ జోడించి బ్రతికిన మహా మనీషి. తెలుగు భాష పట్ల ప్రేమతో తెలుగు సంస్కృతిని అభిమానిస్తూ భారతీయ భావనతో కదలీ, తన కవిత్వంలో విశ్వ ప్రేమను ఆవిష్కరించిన సృజన యశస్వి. ఒక స్థలానికీ కాలానికీ కట్టువడని సమాజ బంధువు. గురజాడ ఉద్యమ మనస్వి. ఆలోచనతో పాటుగా ఆచరణపై విశ్వాసం గల ధైర్యశాలి. ఇదీ ఈయన అస్తిత్వ రేఖా చిత్రం. మౌలికంగా ప్రజాస్వామ్యాన్ని స్పందించే రూపం.

"కన్యాశుల్కం"లో జీవితంలో వలె పుష్కలమైన సంఘటనలతో వైవిధ్యం గల పాత్రల చర్యలతో నవ్విస్తూ అనుభవింపజేస్తూ ఆలోచింప జేస్తూ ప్రబోధిస్తూ పోయే లక్షణం కలిగిందీ రచయిత అస్తిత్వంలో వ్యక్తిత్వం.

అపూర్వమైన ప్రతిభతో వర్తమానంలోనే కాక భవిష్యత్తుకూ దారి చూపే వెలుగు రూపం, ఆధునిక సాహిత్యానికి యుగకర్త కావడం చారిత్రక వాస్తవం.

## 11. గురజాడ పరిపూర్ణ వ్యక్తిత్వం - రేఖా రూపం

ఏ దేశమయినా ఏ కాలమయినా ఆ కవి నేపథ్యాన్ని బట్టీ, తన జీవితంలో నిర్వహించే భూమికల్ని బట్టీ సృజన రచన రూపొందుతుంది. ఇది సహజ క్రమం. కృత్రిమతకు చోటు లేదు. వీటిలో ఒక విధం వ్యక్తిగతమైనవీ. మరోవిధం సమాజ వాతావరణానికి చెందినవీ. ఇంకొక విధం సార్వజనీనమైనవీ. సార్వ కాలికమైనవీ. విశ్వ భావన కలవీ. ఇవి ఒక చోట కలుస్తాయి. ఇదొక విశిష్టమయిన సంకలనం. ఈ సమావేశాన్ని అంటుకొనీ సూక్ష్మమైన అనుభూతులూ జీవన బంధాలు మానుష రీతులూ కార్యకలాపాలూ ఏర్పడతాయి. ఈ ప్రాతిపదికపై ఏర్పడిందీ గురజాడ వ్యక్తిత్వం. దీనికి రచనలే ఆధారం. ఇది వివిధాంశాలతో పరిపూర్ణమైంది. దీనికి కారణాలనేకం. ఇవి ఒక దాని కన్న మరొకటి మీరే విధంగా, ప్రాధాన్యం పొందే విధంగా, ఒక దానికి మరొకటి సహాయ పడే విధంగా, ఒక దానిలో మరొకటి కలిసే విధంగా అనుభవానికి వస్తాయి. గురజాడ రచనలు ఆధారంగా ఈ ప్రణాళికపై అన్వయ పూర్వకంగా చాలా జాగ్రత్తగా పరిశీలించాలిసిన విషయం. జరగవలసి ఉంది.

గురజాడ రచనల్లో కవిత్వమూ నాటకంలో 1) సృజన ప్రతిభ 2) తనదైన కవిత్వ దృష్టి 3) స్వేచ్ఛా మనో రూపం 4) వాడుక భాషా ప్రియత్వం 5) సరికొత్త మాత్రాఛందో రూప కల్పన 6) సమాజ సంస్కరణం – మార్పు పట్ల నిశ్చయమైన భావన 7) కార్య కారణ వివేచనలో హేతువుకు ప్రాముఖ్యం 8) మనిషిలో కోరదగిన ప్రేమ–కరుణ, ఉపకృతి – ఉదారత, నైతికత – మానవత, మంచి – మేలుకు చెందిన మానవీయంతో ఏర్పడిన ఆదర్శం కనిపిస్తుంది. ఇది కళాత్మకమయిన "ప్రభుత"నూ కలిగింది. స్వతంత్రమయిన ఆలోచన, సామాజిక బాధ్యత, కళాత్మకత ఈ మూడింటి కలయికతో పరిపూర్ణతకు మంచి అవకాశం సిద్ధించింది. యుగకర్త వ్యక్తిత్వం ఈ రేఖలతో ఏర్పడింది. దీనికి తోడుగా నిజ జీవితంలో తలచే ఆలోచన, పలికే మాట, చేసే పని ఈ మూడు గుణాలూ కలిసిన పాజిటివ్ కోణాలు ఆశా రూపానికి బలాన్ని చేకూర్చాయి. యువతరాలకీ పరిపూర్ణతకు మంచి అవకాశం సిద్ధించింది. యుగకర్త వ్యక్తిత్వం ఈ రేఖలతో ఏర్పడింది. దీనికి తోడుగా నిజ జీవితంలో తలచే ఆలోచన, పలికే మాట, చేసే పని ఈ మూడు గుణాలూ కలిసిన పాజిటివ్ కోణాలు ఆశారూపానికి బలాన్ని చేకూర్చాయి. యువతరాలకీ ఒక పరిపూర్ణమైన వ్యక్తిత్వం ఆదర్శంగా నిలిచింది.

ఏదేని ఒక సమస్య ఎదురయినపుడు భాషకూ సంస్కరణానికీ మార్పుకూ ప్రవర్తనకూ దేనికి సంబంధించింది అయినా, నిశ్చయమైన నిర్ణయ గుణంతో ముందుకు పయనించడం పయనింపజేయడం నాయక లక్షణం. ఇది యుగ కర్తకు చక్కగా అన్వయిస్తుంది. ఇది గురజాడలో మెండుగా ఉంది. స్కూలులో విద్యార్థిగా ఉన్నపుడూ స్వతంత్రమైన నిజాయితి గల వ్యక్తిగా, సమకాలికుల స్మృతి విశేషాల్లో రికార్డు చేయబడింది. ఇదే ఆపైన రచయితను విశేష స్థాయికి చేర్చింది. గౌరవ స్థానాన్నీ సంపాదించి పెట్టింది. ఈ కోవకు చెందిన రచయితలు వేళ్ళపై. లెక్క పెట్టదగిన సంఖ్యలో ఉంటారు. ఈ అపూర్వ వ్యక్తిత్వం దశాబ్దాలూ శతాబ్దాలూ గడచినా పాతబడదు. కాలం గడచే కొద్దీ మరింతగా ప్రకాశిస్తుంది. గురజాడ విషయంలో జరుగుతూంది ఇదే! భౌతికంగా దూర మయ్యాకనే రచనలు గురించీ వ్యక్తిత్వం గురించీ సమాలోచనం అందుకుంది. విలువల్ని గుర్తించడమూ జరిగింది. ఈ విధంగా "మరోవైపు" మార్గం – అవసరమూ ప్రయోజనమూ హేతు సహితంగా కాల పరీక్షకు

నిలిచాయి. ఆధునిక చేతనకు ఆదర్శరూపాలుగా రచనలు పేరొందాయి. కాలం గడుస్తున్న కొద్దీ కొత్త తరాలలో, గురజాడ రచనల అధ్యయనం పెరిగింది. అవగాహన విస్తరించింది. ఈ మార్గానికి స్థిరత చేకూరింది. ఆధునిక సాహిత్య వికాస రూపానికి ప్రేరణ శక్తిగా నిలచింది. ప్రగతి శీల భావజాలానికి సారథ్యం వహించింది.

2

బహుముఖ ప్రజ్ఞాశాలి గురజాడ సృజన రచనలనూ జీవిత చరిత్రనూ బట్టి పరిపూర్ణతను సాకారం చేసే ప్రధానమైన రేఖలు.

1) తెలుగు ప్రజల నాల్కలపై కదలే వాడుకలో నున్న భాషను మన్నించడం, రచనకు సాధనంగా స్వీకరించడం. ఈ ఉద్యమం తరపున నిలబడడం.
2) తెలుగు కవిత్వంలో "ముత్యాల సరాలు పేరుతో సరికొత్త మాత్రాఛందో రూపాన్ని ప్రవేశ పెట్టడం,
3) రచనలో వస్తువూ నిర్వహణమూ – లక్ష్యంలో సమాజ పరమయిన వాస్తవ యుతమైన ప్రగతి శీలమైన మార్పును కోరడం.
4) ప్రజల్లో పాతుక పోయిన అంధ విశ్వాసాల్నీ దురాచారాల్నీ హేతు దృష్టితో ఎదుర్కొనే సామాజిక చేతనతో పాటు సాహిత్యానికి అవసరమైన కళాత్మకతను సాధించడం.
5) భారతీయ పాశ్చాత్య భాషా సాహిత్యాల అధ్యయనంతోనూ, స్వయంగా లలిత కళల్లో (వీణ వాయించే వాడు) క్రీడా రంగాల్లో (టెన్నిస్, బిలియర్డ్స్ ఆడేవాడు) చిత్ర లేఖనంలోనూ ఆసక్తితోనూ వ్యక్తిత్వ వికాసాన్ని పొందడం.
6) ప్రతిభ – వ్యవహార దక్షత – నైతికత – దార్శనికతతో "కొత్త పాతల మేలు కలయిక"ను ఆవిష్కరించడం, దృష్టికి వస్తాయి.

ప్రధాన స్రవంతి (మెయిన్ స్ట్రీమ్) రచనల్లో వ్యవహారిక భాషనూ, గడ్డ కట్టిన సంప్రదాయానికీ హేతువుకు నిలవని ఆచారాలకూ ఎదురుగా వివేచనతో సంస్కరణనూ మార్పునూ నిలపడం, సాహసంతో కూడిన పనే. దీన్ని ముందుకు తీసుకొని వెళ్ళడానికి నిబద్ధత నిపుణత నిబ్బరమూ అవసరం.

మద్రాసు విశ్వవిద్యాలయం సిండికేట్ నియమించిన ఎకడమిక్ సమావేశంలో, భాషా విధానం గురించి చర్చలో, తన అభిప్రాయాన్ని వ్యవహారిక భాష వైపు నిష్కర్షగా

ప్రకటించడం జరిగింది. ఈ చారిత్రక సన్నివేశంలో సమావేశం మినిట్స్‌లో మినిట్ ఆఫ్ డిసెంట్ (నోట్) పత్ర సమర్పణం ఒక హైలైట్! ఇందులో గ్రాంథికానికి బదులుగా వ్యావహారికాన్ని విద్యాలయాల్లో ప్రవేశ పెట్టే విషయం ప్రతిపాదితమయింది. భాష ఎప్పటిదే, 'పాతదే, కాని పద రూపాలు "కొత్తవి." దీన్ని గుర్తింప చేసేందుకు సిద్ధం చేసిన పత్రం గురజాడ ప్రతిభనూ విద్వత్తునూ అంకితభావాన్నీ సమయస్ఫూర్తినీ ధైర్యాన్నీ ప్రతిఫలింపచేస్తూందనీ, పలువురు సాహిత్య వేత్తలు ప్రశంసించిన విషయం జగద్విదితం.

వేయి ఏండ్లుగా పరంపరగా వచ్చే ఛందో రూపాలకు సమాంతరంగా "ముత్యాల సరాలు" సరికొత్త ఛందో రూపం గురజాడ ప్రతిభా ఫలం. ఇక్కడ ఒక విషయం! ఆంధ్ర పత్రికలో శతావధానుల విమర్శకు గురజాడ సమాధానంలో ఛందశ్శాస్త్ర రహస్యాలు తేట తెల్లమయినాయి. శాస్త్ర నియమాలకూ అనుభవంలో రూపానికీ మధ్య ఏర్పడే అంతరాన్నీ భేదాన్నీ వివరించడం జరిగింది. ఏదీ చిరకాలం స్థిరంగా ఉండదు. మార్పులు తప్పవు. దీనిలో అంటే కొత్త దానిలో గుణముంటే నిలుస్తుంది. "ఒక జాతి ఫార్సిగజల్ నడక ముత్యాల సరాల్లో తెచ్చుటకు ప్రయత్నించితి"ని "నా నేర్పు కొలది వ్రాయడం జరిగింది. నలుగురి ఆమోదం లభిస్తే మంచిదే" తనకు నచ్చనిదాన్ని దూషించి ప్రయోజనం లేదనీ, మంచి పని చేసేప్పటికంటే, చెడు పని చేసేప్పుడు వివేచన అవసరమనీ, విమర్శలకు స్పందనలో రచనలో శ్రుతి సుభగత్వానికి ఇచ్చే ప్రాధాన్యాన్నీ వివరించడం జరిగింది, ఈ ఉదంతం ఛందశ్శాస్త్ర హృదయం తెలిసిన మనీషతో పాటు ఉదాత్తమైన సంస్కారాన్నీ తెలియజేస్తూంది. కవి వ్యక్తిత్వ పరిపూర్ణతకు శోభనిస్తూంది.

విజయనగరం మహారాజా వారి వ్యవహారాలు చూచే ఆధికారిక స్థానంతో పాటుగా, బంధు భావంతో గౌరవాన్ని పొందే స్థాయి కలిగిన వ్యక్తి గురజాడ అప్పారావుగారు. రాజావారు ఎక్కడికి వెళ్ళినా తోడుగా ఉండడం చేత, పెద్దల పరిచయాలతో అనుభవ విస్తృతీ ఆలోచన వైవిధ్యమూ లభించింది. తెలుగు ప్రాంతం భారతదేశం, ప్రపంచం, వరుసలో ఆరోహణలో మూడింటినీ క్రమించిన మనీషిగా కనిపిస్తాడు. "దేశభక్తి" కవిత దీనికి చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. ఇంగ్లీషు భాష సాహిత్యంతోపాటుగా సంస్కృతం, బెంగాలీ, కన్నడం, పార్సి భాషలతో పరిచయమూ ఆలోచనా వికాసానికి తోడ్పడినాయి. మొదట్లో ఇంగ్లీషు భాషలో కవిత్వం వ్రాసేవాడు.

తర్వాత బెంగాలి భాషలో పత్రికా సంపాదకులు శంభు నాథ ముఖర్జి సూచన మేరకు మాతృ భాష తెలుగులో వ్రాయడం మొదలు పెట్టాడు. ఈ ప్రభావంతో పాటు దేశ స్వాతంత్ర్యానికి ఉద్యమించే కాంగ్రెస్ పార్టి సమావేశాలు ఆకర్షించాయి. 'దేశభక్తి' ఏదో మొక్కుబడిగా కాక హృదయ పూర్వకంగా కొత్త ఉత్సాహాన్ని నింపింది. అయితే కొన్ని విషయాల్లో విభేదించడమూ జరిగింది. చరిత్ర – తత్త్వ శాస్త్రమూ ఇష్టమైనవి. వేదాంతులకు కూడా "తత్త్వోపదేశం చేయగల విద్వత్తు కలిగిన" వాడనీ మిత్రుల చేత కొనియాడబడిన తత్త్వవిదుడు. విస్తృతమైన గ్రంథ పఠనమూ విశాలమయిన అనుభవమూ బాగా తోడ్పడినాయి.

సృజన రచనలో కవిత్వంతోపాటు నాటకం కన్యాశుల్కం యశశ్శిఖంగా నిలిచింది. సామాజికత మరియు కళాత్మకత రెండిటి సమ్మేళనంతో గురజాడ వ్యక్తిత్వానికి నిండుదనాన్నీ గభీరతనూ ఇచ్చింది.

ఆనంద గజపతి మహారాజా వారి ప్రేరణతో సమాజంలో నెలకొన్న బాల్య వివాహాలు – మూఢ విశ్వాసాలు – దురాచారాలు – వేశ్యావృత్తి – పాశ్చాత్య ప్రభావంతో విపరీతపు పోకడలూ, అరికట్టే ఉద్దేశంతో అవతరించిందీ నాటకం. 1906లో ఆనందగజపతి మహారాజావారికి వ్రాసిన లేఖలో "This book was successful, beyond my expectation. Then my mission is ended" "నేను ఆపేక్షించిన దాని కన్నా ఎక్కువగా ఈ గ్రంథం (కన్యాశుల్కం) విజయవంతమయింది." "నా నిర్దిష్టమైన కార్యం సమాప్తమైంది." తాను వివేచనా దృష్టితో తలపెట్టిన సంస్కరణ పథం మార్పు రూపంతో, సామాజిక దర్శనం ఫలవంతం కాబోతూందన్న, సంతోషం, తృప్తీ తెలుగు జాతికి గర్వకారణమైంది. పూర్వ సంప్రదాయ సమాజంలో, ఏది ఎంత చెడుగా ఉన్నా ప్రమాదకరమైనా, ప్రశ్నించే వీలులేదు. కట్టుబాటూ వినయ విధేయతల పేరుతో ఎన్నో ఘోరాలు జరిగేవి. వీటిని గురించి పరిశీలనలో కార్యకారణ సంబంధ జ్ఞానం అవసరమన్న గురజాడ మాటల్లోని సమంజసత్వం. తరువాత కాని తెలిసి రాలేదు. జరిగే దానిలోని కారణాన్నీ దానికి తగిన పరిష్కారాన్నీ, అన్వేషించకుండా "విధి రాత" అనీ, "వేళా విశేషమనీ", "దైవ సంకల్పమనీ", "దురదృష్టమనీ" సరిపెట్టుకోవడం

పరిపాటి అయింది. ఇది పనికిరాదనీ, రచనల ద్వారా మేల్కొల్పడం చైతన్యవంతుల్ని చేయడం మహాకవి సాహిత్య లక్ష్యాల్లో పేర్కోదగింది. ఇది మహత్తరమైంది.

మానుష శక్తిలో నమ్మకంతో ఉత్తమమైన వివేచనతో, సమాజాన్ని సౌభాగ్యవంతంచేసే ఆలోచనకు కార్య సూచనగా, పరిపూర్ణ వ్యక్తిత్వం గోచరిస్తుంది. ఇది మరో వైపుకు ఆకర్షించే ప్రకాశ రూపం. కాలం నిర్ణయించిన చారిత్రక సత్యం.

## 12. గురజాడ విమర్శనా దృక్పథం

సృజన రూపంతో పాటు విమర్శనా రూపమూ కొంత అయినా రచయితల్లో పని చేస్తుంది. ఇది ఏ సృజన ప్రక్రియ కయినా వర్తిస్తుంది. కవిత్వంలో అయితే సూక్ష్మ సూక్ష్మంగా పనితనానికి శిల్పానికి ప్రేరేపిస్తుంది. పనితనంలో కవి శిల్పానికిచ్చే ప్రాధాన్యాన్ని బట్టీ కళా సౌందర్య రుచిని బట్టీ ఉంటుంది. ప్రతి రచయితలో తన రచనకు సమగ్రత చేకూర్చే ఉద్దేశంతోనే ఉంటాడు. ఈ సమగ్రతకు చివరి మాట అంటూలేదు. దేని స్థితి స్థాయి విలువ ప్రశస్తి దానిదే. "లోకోభిన్న రుచి:" అని రుచుల్ని బట్టి స్పందనల్లో విభేదాలు తప్పవు. ఇది సృజన సాహిత్యంలో సహజం.

విమర్శనా రూపం గురించి గురజాడ ఆలోచన స్వతంత్రమైంది. ప్రత్యేకతను భావింపజేస్తుంది. అవసరమయితే నియమాల్ని అతిక్రమించి ముందుకు సాగుతుంది. ప్రతిభకు పట్టం కడుతుంది. "సృజనతోపాటు విమర్శనమూ" రెండూ "కుడి ఎడమలుగా కావ్య సృష్టిని కొన సాగిస్తాయి" ఇది గురజాడ ప్రతిపాదనం. దీనికి రచయితలో "గుణమూ దోషమూ విషయం"లో "నిశ్చయమైన జ్ఞానం అవసరం." ఇవి గురజాడ మాటలు. ఆ రచయిత ప్రతిభను బట్టి నిపుణతను బట్టి సాహిత్య సంస్కార విధాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా రచయితలందరిలోనూ అంతో ఇంతో విమర్శనా శక్తి తప్పకుండా ఉంటుంది. సృజనవేళ పని చేస్తుంది. ఇది శిల్ప దృష్టికి బాగా సహకరిస్తుంది. ఈ గుణం విశేష స్థితిలో ఉన్నపుడు కాన్షియస్ ఆర్టిస్ట్ (conscious artist) అనడం జరుగుతుంది. అంటే తాను చేసే పనితనాన్ని తెలిసీ, కావాలనీ, మిక్కిలి జాగరూకతతో

ఉండడ మన్న మాట! ఇక్కడ గురజాడ మాట ఒకటి జ్ఞాపకం పెట్టుకోవలసి ఉంటుంది. లేకపోతే ప్రతిపాదనం తప్పు దారి పట్టే ప్రమాదం ఉంది. అది ఏమంటే? అందరికీ తెలిసిందీ. కళకు కవిత్వంలో ప్రాధాన్యమున్నప్పటికీ ("ప్రభుత" – గురజాడ వాడిన మాట) ఆధిక్యానికి సంబంధించింది. సమాజం పట్ల "నా బాధ్యతను మరచేది లేద"ని తన నిశ్చయాన్ని నిష్కర్షగా చెప్పడం జరిగింది. ఇది సామాజిక తత్పరత (సోషల్ కమిట్‌మెంట్)కు అద్దం పడుతూంది.

సృజన ననుసరించిన విమర్శనా రూపం కొన్ని సందర్భాల్లో నేరుగా ప్రకటితమవుతుంది. కొన్ని సందర్భాల్లో పరోక్షంగా సూచితమవుతుంది. ఇవి కాక మరొక విధం సృజన రూపానికి బయట వివిధ సందర్భాల్లో వివరింపబడుతుంది. ఏవిధమయిన విమర్శనా స్పృహ లేకుండా సృజన రచనా సమావిష్కారం జరగదు. గురజాడ ప్రతిపాదనంలోని ఆంతర్యమిదే! స్థూలంగా ఇది రచయితలోని కళా హృదయాన్నీ ఔచిత్య గుణాన్నీ తలపుకు తెస్తుంది.

"ముత్యాల సరాలు" దీర్ఘ కవిత ఆరంభంలో రెండు పద్యాల్లో ఈ ప్రతిపాదనంలోని ఆలోచనా రూపాన్ని చూడవచ్చు.

*"గుత్తునా ముత్యాల సరములు కూర్చుకొని తేటైన మాటలు*
*కొత్త పాతల మేలు కలయిక కొమ్మెరుంగులు చిమ్మగా..."*

ఇంపైన స్వచ్ఛమైన సుందరమైన మాటల్ని కూర్చే ఆలోచనలో, కొత్త మెరుగులు చిమ్మే పనితనం అంటే శిల్పం విషయంగా విమర్శనా రూపం ఉంది. ముత్యాల సరాలు అన్న పదబంధం కొత్త మాత్రా ఛందో రూపాన్ని ఉద్దేశించింది. ప్రియతకూ ఆలంకారికతకూ చిహ్నంగానూ ఉంది. ప్రధాన విషయానికి అగ్రభాగంలో ఉంది.

*"మెచ్చనంటా వీవు నీవిక*
*మెచ్చుకుంటే మించి పా/ పోయెను*
*కొయ్య బొమ్మలు మెచ్చు కళ్ళకు*
*కోమలుల సొరెక్కునా?– "*

ఇందులో అనుకూలంగా లేని స్థితిని త్రోసేస్తూ, హేతువుతో కూడిన సమాధానం కళా సౌందర్యతత్వాన్ని (aesthetics) స్పృశిస్తూంది. ఇవి చాలా ప్రసిద్ధమైన కవితా పంక్తులు. ఈ ఎనిమిది చరణాలూ కలిసి, కావ్య తత్త్వంలో కవి విమర్శనా దృష్టికి ఒక యూనిట్‌గా నిలుస్తాయి. వెలుగును ప్రసరిస్తాయి.

ఆంధ్ర పత్రికలో 'ముత్యాల సరాలను విమర్శిస్తూ ఒక శతావధాని వ్రాతలో గురజాడ తన కలం ఎట్లాపోతే అట్లా వ్రాసినట్లు చేసిన నిందను తిరస్కరిస్తూ వ్రాసిన సమాధానంలో మరో ప్రతిపాదనం ఉంది. "చిత్రం" వేసేప్పుడు శిల్పం చెక్కేప్పుడు "శిల్పకు డెట్టి పరిశ్రమ చేయునో, అట్టి పరిశ్రమను చేసిన గాని కావ్య గుణాలు అబ్బనేరవని నామతం" రచన చక్కగా ఏర్పడడానికి రచయిత పడే శ్రమ వెనక ఆలోచనలో కదలే విమర్శనా రూపం సూచితమవుతూంది. ఆవేశంలో భావంతోపాటు అది శబ్దంలోకి మారేప్పుడు ఆలోచనలో, విమర్శనా జ్ఞానం తప్పకుండా ప్రేరణ శక్తిగా ఉంటుంది. ఇక కావ్య గుణాల్ని గురించి ప్రస్తావిస్తూ, ఇవి "ఒకరి సొమ్ములు కావు!" లక్షణ గ్రంథాల్లో పండితులు కావచ్చు కానీ పాఠకులను రంజింప జేసే మంచి కావ్యాన్ని వ్రాయడానికి ప్రతిభ అవసరం." "ప్రతిభ చేతనే ఇది సాధ్యం" "అంత మాత్రాన వారి పాండిత్యంలో లోపంగా భావించరాద"నీ విశాల హృదయంతో సృజన పూర్ణతకు ముఖ్యమైన అంశాలు చూపడం జరిగింది.

1. 'ప్రతిభ'వల్ల 2. కావ్యాల పఠనమూ – కళాజ్ఞానమూ వల్ల 3. కావ్యానుభూతిచేత కావ్య రసం మనసుకు పట్టడం అనేవి పేర్కోబడినాయి. ఇవి శబ్దమయ మయ్యే ప్రక్రియ ప్రాసెస్ (process) లో విమర్శనా రూపం దాగి ఉంది. లక్షణ గ్రంథాల్లో "కానరాని" "కావ్య గుణాలు" కొత్తవి ఏర్పడతాయి. వీటిని గురించి ఆలోచనకు విమర్శకులు సిద్ధం కావాలి. ఇవి గురజాడ మాటలు! ఇది మరో ప్రతిపాదనం.

కొందరిలో విమర్శనా బుద్ధి "హాస్య రసం వైపు పరుగిడుతుంది." కొందరిలో "దోషాన్వేషణ"లో బాగా ఆరి తేరుతుంది. కొందరిలో "తిట్ల"లో మునిగి తేలుతూ ఉంటుంది. చాలా తక్కువ మంది ఆలోచనలు మంచి గుణాల వైపు సాగుతాయని గురజాడ అభిప్రాయం. ఒక సందర్భంలో విమర్శనా శక్తిని గురించి ఆలోచన

చేయబడింది. ప్రతిభ టంక సాల వంటిది. రచయిత సృష్టించేవి స్వతంత్రమైన రచనలు, టంక సాలలో నాణేల వంటివి. అవి "చెల్లునో చెల్లవో మ్రోగించి చూచినట్లు" విమర్శనా శక్తి పని చేస్తుంది. "ఉపాధేయములవునో కావో" అని పరీక్షకు నిలుపుతుంది. ఈ మాటలు విమర్శనా రూపమెంతటి ప్రభావ శక్తి కలిగిందీ తెలియ చేస్తాయి.

రచయిత సృజన కృతిలో సందర్భవశాత్తుగానూ, అక్కడక్కడా కవి మాటగానూ విమర్శనా రూపం కనిపిస్తుంది. ఇదొక విధం. మరో విధం సృజన కృతికి వెలుపల చర్చల్లో సమాధానాల్లో వ్యాసాల్లో ఉత్తరాల్లో డైరీల్లో దొరకుతుంది. గురజాడ విమర్శనా రూపం ఈ రెండు మూడు విధాలుగానూ కనిపిస్తుంది. గురజాడ సాహిత్య సమాలోచనానికీ అస్తిత్వ మూలాల్ని తెలుసుకోడానికీ వ్యక్తిత్వ రేఖల్ని చూపడానికీ రచనల పరిశీలనకూ బాగా ఉపకరిస్తుంది.

ఒక రచన గురించి సమాలోచనానికి ముందుగా సమగ్రమైన అవగాహన అవసరం. ఇది లేకుండా "ఒక్కొక్క పుస్తకంలో వస్తువును బట్టి పది పంక్తులు తీసుకొని పుస్తకం మొత్తాన్ని గ్రహించడం అల్ప దృష్టి" ఇది గురజాడ అభిప్రాయం. ఈ విధమైన విమర్శకులు అప్పుడూ ఇప్పుడూ ఉన్నారు. అల్పదృష్టి గల విమర్శకులకు కొరతలేదు. దీని వల్ల విమర్శనా ప్రక్రియ దెబ్బతింటుంది. సమాలోచనానికి చేకూరవలసిన స్థాయి ప్రయోజనమూ చేకూరవు. సాధారణ పాఠకులనూ సాహిత్యాభిలాషులనూ అపమార్గం పట్టించే ప్రమాదమూ లేకపోలేదు.

మరొకటి యతిప్రాసల విషయంలో ఛందస్సులో నియమాలకు సంబంధించిన వాటి పట్ల కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. "ఛందస్సు శ్రుతి రంజనానికి సాధన భూతం"గా ఉండాలి. "పద్యాలు సువ్వి పాటల్లా ముఖం మొత్త కూడదు. యతి ప్రాస లనేవి ఫర్లాంగుల రాళ్ళవలె ఉండకూడదు.  పాతబాట అట్లాగే ఉండదు. మార్పులు సహజం. నియమాలు తెచ్చి పెట్టుకున్నట్లు "ఈడ్చుకొని పోయినట్లు" ఉండకూడదు. ఈ ఆలోచన కొత్త ఛందస్సు "ముత్యాల సరాలు కనుగొనడానికి దారి తీసింది. దీని అవతరణకు వెనక జరిగిన చింతనం మానసికంగా జరిగిన విమర్శనా రూపమే. ప్రతిభ చేతనే సాధ్యమయ్యే మార్పుల్లో ఇదొకటి. "ముత్యాల సరాలు" కవిత్వం. తరువాతది "కన్యాశుల్కం" మహా నాటకం.

ఆధునిక మహా నాటకం 'కన్యాశుల్కం' లో ఇతివృత్తం మారింది. జీవన వాస్తవికతనూ సామాజిక సమస్యనూ గ్రహించింది. ప్రజలూ వారి స్థితిగతులూ మనుషులూ వారి మనో రీతులూ లోతులూ ఎత్తులూ చిత్రితమైనాయి. బలమూ బలహీనతలూ పాత్రల రూపంలో ఎదుట నిలిచాయి. అన్నిటిలో "Man is the Gold for all this" "ఉన్న వాటిలో మనిషి బంగారం" బర్న్ మాటల్ని గురజాడ ఉదాహరించడమూ జరిగింది. మనిషి బంగారమే, కానీ, కోరేదీ అయ్యేదీ రూపాలు వేరు వేరుగా ఏర్పడతాయి.

నాటక రచన వెనక నుండి పని చేసిన విమర్శనా రూపం, కన్యాశుల్కం – బాల్య వివాహాలు – వేశ్యా సమస్య – వితంతువుల దుస్థితి – యువకుల (దిమ్మిరితనం) – పాశ్చాత్య ప్రభావం – మూఢ విశ్వాసాలు – మోసాలూ, విపరీతపు పోకడలూ – మొదలయిన విషయాల్ని గురించి నిర్ణయానికి దారి తీసింది. "మరోవైపు"కు దృష్టిని ప్రసరింపజేసింది. దీనికి స్వతంత్రమైన మనోరూపం అవసరం. దార్శనికమైన ప్రతిభ ముఖ్యం.

గిరీశం ఉపాధ్యాయుడు – విటుడు – బ్రతుక నేర్చిన వాడు, పెద్ద చదువు నేర్చినట్లు డాంబికంలో మెలగేవాడూ, కొంచెం ఇంగ్లీషు నేర్చిన వాడు – హాస్యంతో అలరించే పాత్ర. జీవితంలో అనేక సందర్భాల్లో అతని మాటలు గుర్తుకు వస్తాయి. పాశ్చాత్య ప్రభావంతో యువతలో ఏర్పడిన ఖాళీ స్థితికి నిదర్శనం. అగ్నిహోత్రావధానులూ లుబ్ధావధానులూ ఛాందస బ్రాహ్మణ మనస్తత్వాలూ – మూఢాచారాలతో ప్రవహించడం మానిన జీవితాలకు ప్రతినిధులు. రామప్పంతులు వ్యవహర్త, కోతల రాయడు – అహం భావంతో తన యంతటి తెలివి గలవాడు లేడనే ధీమాతో కాలం గడపేవాడు. మధురవాణి వేశ్యావృత్తిలో నున్నది. పరస్పర విరుద్ధ లక్షణాలతో కూడిందీ, సానివాళ్ళలోనూ "మానవత్వాన్ని" గుర్తింప జేసింది. చివరకు మేలుకూ మంచికీ గుర్తుగా సంస్కరణకూ మార్పుకూ సూచనగా నిలిచింది. ఇక సౌజన్యారావు సామాజిక పరివర్తనంలో ఆశారూపానికి చిహ్నంగా నిలిచాడు. కరటక శాస్త్రి రామప్పంతులు తల దన్నిన వాడు. బుచ్చమ్మ వితంతువు. అమాయకురాలు. సులభంగా మోసపోయేదీ. మీనాక్షి తన పంతం నెగ్గాలనే పట్టుదల కలిగిందీ. వేంకటేశం

మందమతి, లోక జ్ఞానం లేనివాడు. ఇట్లా ఒక్కొక్క పాత్ర మనస్తత్వమూ – ప్రవర్తనమూ ఎంతో నిశితమైన విమర్శనా పరిశీలనంతో నిర్మింపబడినాయి.

సమాజంలో మనుషుల జీవితాల్లో ఎన్నో సంఘటనలు కనిపిస్తాయి. ఇవి ఎంతో వైవిధ్యంలో కూడినవీ. ఈ వాస్తవ జీవితం నుండి, సమకాలికమయిన సమస్యల్ని – కలిగిన ఇతివృత్తాన్ని స్వీకరించడం గొప్ప సాహసమే. అయితే దీన్ని కళాత్మకమైన రూపాన్ని ఇవ్వడానికి ముందు గురజాడ విమర్శనా దృష్టి నిశితమైందీ. ప్రగతిశీలమైందీ. హేతుయుతమైందీ కావడం విశేషం. “కోరికలుండడంలో దోషం లేదు. మితి మీరిన ఇంద్రియ చాపల్యందోషం” అన్నమాటలు పాత్రలకూ వర్తిస్తాయి.

తాను రచయిత కావాలని గురజాడ కోరలేదు. పాండిత్యాన్ని పెంపొందించుకొని, ఇతరుల “రచనలు చదివి, ఆనందిస్తూ సంతృప్తి” పడేవాడు. అయితే చుట్టూ సమాజంలో నెలకొని ఉన్న, దుస్థితుల్ని చూచి కలత చెందాడు. సమాజంలో మార్పుకూ, వ్యక్తిలో మానవ ప్రేమకూ – వికాసానికీ చెందిన “ఒక ప్రయోజనాన్ని” కాంక్షించాడు. “ఒక మార్గాన్ని నిర్దేశించడం” కోసం కన్యాశుల్కం నాటకాన్ని ప్రజల వాడుక భాషలో వ్రాయడం జరిగింది.

ఆ ప్రయోజనాన్ని తనలో విమర్శనా దృష్టి చేత, ఆ మార్గాన్ని తనలో విమర్శనా రూపం చేత దర్శించాడు. తాను ఆశించిన దాని కన్నా ఎక్కువ విజయాన్ని పొందాడు. ఈ విజయం తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగానికి మరోవైపునూ, మానవ సమాజ శక్తికి ప్రగతి మార్గాన్నీ ప్రసాదించింది.

## 13. గురజాడ చూపులో దార్శనికత ప్రజాస్వామ్య భావన

ఆధునిక యుగకర్త ‘గురజాడ’ వర్తమానం నుండి భవిష్యత్తును దర్శిస్తుంది. ప్రజలకు ఉపయోగకరమైన భవిష్య సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తుంది. వ్యక్తి గమనంలో వేగం పెంచుతుంది. జన పయనంలో వెలుగును ప్రసరిస్తుంది. ఇది ప్రజా స్వామ్య దార్శనికతతో ఆ కాలానికి అపూర్వమైంది. కవిత్వం నాటకం కథ సమాలోచనంలో వ్యాసాలు (అపుడపుడు వ్రాసిన డైరీ పేజీలు లేఖలు అభిప్రాయాలు

చర్చలుతో అభిప్రాయాలు – నిర్ణయాలు ఆధారంగా) సాహిత్య చరిత్రలో ఆధునిక యుగాన్ని సిద్ధింపజేసాయి. కొత్తదనాన్ని కనుగొన్న (ఇన్నోవేట్ చేసిన) ఘనత ఆయనదే. సృజన కళతో రచనా శిల్పం చేత ఉత్తమమైన సాహిత్య ప్రమాణాలతో దిశానిర్దేశంతో రచనలు నిలిచాయి. ముత్యాల సరాలు దేశభక్తి పూర్ణమ్మ కథ కన్యాశుల్కం కథలు వెలుగు బాటను చూపాయి. ఆ ప్రక్రియల్లో ఆధునికతకు ప్రాతినిధ్య స్థానాన్ని పొందాయి. ఇది సమాజ స్థాయిలో సంస్కరణం పరివర్తనం మానవీయం మానవత వ్యక్తి స్వేచ్ఛ ప్రగతి రూపం అంశాలు ప్రజాస్వామ్య భావనకు బలమైన కేంద్రాలుగా పని చేసాయి. ఈ కారణంగా చూచే "చూపు" భిన్నమైంది. సమాజ గతమైంది. వ్యక్తిత్వం ప్రత్యేకమైంది. అస్తిత్వం విశిష్టతను పొందింది.

రచనలలో మొత్తం మీద స్థానీయ సమస్యల నుండి విశ్వ భావన వరకు ఆలోచన విస్తరించింది. రచయిత భౌతికంగా దూరమై నూరేండ్లు (1915–2015) అవుతున్నా ఇప్పటికీ ఫ్రెష్‌గా రెలవెంట్‌గా ఉండడం, సజీవ శక్తికి తార్కాణం. ప్రయోజనం కోల్పోలేదు. అవసరం విస్తరించింది. ఈ అంశం వీటి అనివార్యతను స్థాపిస్తోంది. వస్తువులో కొన్ని అంశాలు మారినా సమస్యల మౌలికమైన స్థితులు ప్రయోజన పరంగా మనస్తత్వ కోణంలో మిగిలే ఉన్నాయి. పూర్తిగా లక్ష్యాన్ని పొందవలసిన దూరం మిగిలే ఉంది. ఎంత కాలం గడచినా ప్రాధాన్యం మిగిలే ఉంది. ఇది ఆధునిక దృష్టితో అభ్యుదయాన్ని కోరే ప్రగతి శీల సమాజానికి ప్రేరణ శక్తిగా పని చేస్తుంది. సమస్య గురించి రచయిత ఆలోచన ఆవేదన పరిష్కార సాధన పట్ల నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుంది. గురజాడలో ఉపజ్ఞా విశేషం చేత కాలాన్ని జయించే శక్తి సమకూడింది. సమాజానికి ఉపయోగకరం గాను పరిణమించింది. మహాకవి "ముందు చూపు" ప్రగతి సమాజానికి వెలుగు సూచికగా పని చేస్తోంది.

మొత్తం మీద రచనలలో (1) సాహిత్యానికీ సమాజానికీ గల శాశ్వతమైన సంబంధం (2) జనహితకరమైన భవిష్యత్తుకు దారి తీసే వర్తమానంలో సంస్కరణంతో సమాజ వికాసం (3) జెండర్ భేదం లేకుండా వ్యక్తి గౌరవం, సమన్యాయం, సమానమైన అవకాశాలు గురించి ఆలోచనలో అంతర్లీనమైన ప్రజాస్వామ్య భావన పతాక స్థానాన్ని పొందింది. కన్యాశుల్కం నాటకంలో (ఇంకా కవితలలో) చివరి సన్నివేశాలలో ఈ

ప్రతిపాదనం విప్పారిన సందర్భాల్ని గమనించవచ్చు. సమస్యకు పరిష్కారం వ్యక్తులలో చతురత కన్నా వివేకంతో కూడిన ప్రజాస్వామ్య హృదయం స్పందిస్తూంది. ఆశావహమైన సూచనతో చేసిన ముగింపు దార్శనికతను భావింప జేస్తూంది. ఇది గురజాడ సానుకూల (పాజిటివ్) నిర్మాణాత్మక (కన్‌స్ట్రక్‌టివ్) దృక్పథానికి నిదర్శనంగా ఉంది. నాటక గమనం (మూవ్‌మెంట్)లో సామాజిక వాస్తవికత స్పష్టంగా విశ్లేషణకందుతుంది.

ఈ "చూపు" ఆశావాదంతో వికసించింది. తోటి మనిషిపై నమ్మకాన్ని పెంచింది. ఇక్కడ ఒక విషయం సమాజ పురోగతిలో వ్యక్తి సమాజంలో స్వతంత్రంగా బ్రతికే, స్వేచ్ఛగా వర్తించే విషయాల్లో (1) నిర్ణయం (2) నిర్దేశం రెండూ మార్పుకెంతో తోడయినాయి. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తిని భావింప చేస్తూంది. గురజాడ జీవిత విశేషాల్ని పరిశీలిస్తే ప్రజాస్వామ్య ప్రకాశ రూపం ప్రత్యక్షంగాను పరోక్షంగాను విశ్లేషణలో కనిపిస్తుంది. ఈ సందర్భంలో మరో ముఖ్యమైన విషయం దైవం – ముక్తి – ప్రారబ్ధం – విధి కేంద్ర బిందువులుగా సాగే ఆలోచనకు బదులుగా రచనలో మనిషికి ప్రాధాన్యంతో శ్రమ హేతువు వివేకం మొదలైన భావజాలంతో సంపన్నమయింది. వీటికి మానవీయం కీలకంగా ఉంది.

1) వస్తువు ఎన్నికలో 2) విషయ పరంపరలో 3) చూచే విధంలో 4) అభిప్రాయ ప్రకటనంలో ఉద్దేశం – లక్ష్యం స్థాపనలో 5) ప్రయోజన విస్తృతిలో ప్రజాస్వామ్య దార్శనికత ఆ కాలానికి చాలా కొత్త విషయం. ఈ ప్రతిపాదనా (ప్రపోజిషన్)నకు సంబంధించిన అవగాహనకు దారి తీసే అంశాలకు ఉదాహరణలెన్నో కన్యాశుల్కం నాటకంలో కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తాయి. ప్రతి రచనకు ముందు రచయిత ఒక పరిశోధనా కార్యక్రమంలా అవసరమైన నేపథ్యానికి విషయ సేకరణాన్ని చేపట్టడమూ జరిగింది. మహా శ్వేతాదేవి నవలలు ఈ విధంగా సమాచార సేకరణంతో వాస్తవాలు ఆధారంగా సమాజ చిత్రణంతో మానవ మనస్తత్వ ప్రకాశనంతో రూపొందాయి. ఈ కారణంగా ఇవి ఆథంటిక్ రచనలుగా నిలిచాయి. ప్రామాణికమైన స్థాయిలో విషయ గౌరవాన్ని పొందాయి. కన్యాశుల్కం నాటకంలో విషయంలో రచయిత జరిపిన సమాచార సేకరణం అందరికీ తెలిసిందే. వర్తమాన సమాజానికి పనికి రాని వాటిని వదలి కావలసిన వాటిపై హేతుదృష్టితో ప్రయోజన విస్తృతిని

పొందింది. ఈ చూపు (పెరిస్పెక్టివ్) సాహిత్యానికి సంబంధించిన మైలికమైన విలువల్ని కాపాడుతుంది. సామాజిక విషయ ప్రాధాన్యంతో ఈ విధమైన ప్రగతిరూపం అప్పటికి కొత్తే. ఇప్పటికీ ఇంకా అవసరమైన విశేషంగానే ఉంది. నిరంకుశ రాజ్యాల స్థానంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు దారితీసే సూచనలు రేఖామాత్రంగా మనసులో మెదలుతాయి.

కాలం గడచే కొద్దీ సామ్యవాద ప్రభావం కలిగిన 'విశాలాంధ్ర', 'ప్రజాశక్తి' మొదలైన సంస్థలు గురజాడ అభ్యుదయ మార్గానికి "చైతన్య వేదికలు" కావడం చారిత్రకంగా పేర్కోదగిన విషయం. గురజాడ రచనలకు విస్తృతంగా ప్రచారమూ లభించింది. సమాజంలో సంస్కరణాన్ని పరివర్తనను కోరే వారు ఆధునికతను ఆహ్వానించే వారు తదితర ఉదార వాదులు ప్రత్యక్షంగాను పరోక్షంగాను ప్రజాస్వామ్య హృదయంతో గౌరవించడమూ జరిగింది. దీనితో సామాజికమైన సమ్మతి సంపూర్ణంగా లభించినట్లయింది. "My cause is the cause of the people, I have cultured opinion at my back" ఈ రెండు వాక్యాలు గురజాడ సమాజ నిబద్ధతకు సాహిత్య సంస్కారానికీ దర్పణాలుగా ఉన్నాయి. ఇవి తాను చేపట్టిన ఉన్నతమైన లక్ష్యసిద్ధి పట్ల ఆత్మ విశ్వాసాన్ని ప్రకటిస్తాయి సందేహాన్ని పోగొట్టేవి.

తెలుగు ప్రజల భాషా చరిత్రలో సాహిత్య చరిత్రలో గురజాడ "చూపు" కొత్త దిశను చూపే పాత్రను ధరించింది. తొలి నాళ్ళలో సామ్యవాద భావజాలానికి చెందిన వారు, ప్రగతి కోరే బృందాలు, మార్పుకోరే నవీనులు, దీన్ని తమ సిద్ధాంతాలకు ఆలోచనలకు వాదాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవడం జరిగింది. ఇది తెలుగు వారి సకారాత్మక (పాజిటివ్) దృష్టికీ ప్రజాస్వామ్య భావనకు నిదర్శనంగా నిలిచింది. ఈ రచనలతో ఒక వినూత్నమైన ఉత్సాహం ఆవహించింది. ఇది ఎవరూ కాదనజాలని వాస్తవం. సహజమైన పరిణామ శీలం కలిగింది. కాలం గడుస్తున్న కొద్దీ రచనల పట్ల అభిమానం పెరుగుతూ వచ్చింది. రచయిత వ్యక్తిత్వం పట్ల గౌరవం ఇనుమడించింది. మార్పులో వేగం హెచ్చింది. అందరూ దీన్ని మానవాళికి గురజాడ ఉపదగానూ భావించారు.

ఇక దీని ప్రభావాన్ని విశ్లేషిస్తే – (1) యథార్థ జీవన చలనంలో సమస్యను వాయిదా వేయకుండా, పట్టనట్లు ఉండకుండా ధైర్యంగా ఎదుర్కొనే మానసిక సంసిద్ధతను

(2) వ్యక్తి స్వేచ్ఛతో పాటు వ్యక్తి భాధ్యతను విస్మరించని సమాజ ప్రమేయాన్ని కర్తవ్యాన్ని (3) చరిత్రలో సమాజ పరిణామ దశలలో అనివార్యమయిన పురోగమన లక్ష్యాన్ని స్థాపిస్తుంది. ఈ విషయం మరింత విస్తృతమైన ప్రణాళికతో చేపట్టవలసిన అవసరమూ ఉంది.

స్వేచ్ఛ సమానత్వం స్వాతంత్ర్యం సమన్యాయం సౌభ్రాత్రం విశ్వ బంధుత ఆధునిక సాహిత్యానికి ఆధారస్తంభాలు. ఇవి గురజాడ రచనల్లో ఒక్కొక్క చోట ఒక్కొక్క కోణంలో సమీకరణాన్ని పొందాయి. రచనలో శిల్పం చేత అంతర్లీనమై ఒదిగి పోయాయి. నైతికమైన విలువలకు రచయిత ఇచ్చే ప్రాధాన్యాన్ని "కన్యా శుల్కం" నాటకంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇది లోపిస్తే పడిన శ్రమ అంతా వ్యర్థమే అవుతుంది. నైతికతతోనే మిగతావి ప్రకాశిస్తాయి. ఇది "చూపు"లో వెలుగులతో విప్పారింది. 'కన్యాశుల్కం' నాటకం చివరి సన్నివేశాలలో బుచ్చమ్మ పాత్ర సౌజన్యారావు సూచన మేరకు స్వతంత్రమైన వ్యక్తిత్వంతో కొత్త జీవితంలోకి స్వేచ్ఛగా ప్రవేశించింది. శరణాలయం చేరింది. తన భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశంతో ఆలోచనలో ప్రవర్తనలో మార్పు ఆహ్వానించదగింది. లభించింది. ఇది ఆమె హక్కు దాన్ని పొందింది. ఇంకా కొన్ని ఆశావహమైన మార్పులు చోటు చేసుకున్నాయి. నిరాశలో క్రుంగి పోవడం జరగలేదు. పునర్జవాన్ని (రిజువనేషన్) పొందడం జరిగింది. ఇది కొత్త జీవితం ఆరంభానికి శుభ పరిణామం. కొత్త జీవన భావన వారిలో ఉన్న శక్తిని మేల్కొలిపింది. బాగుపడే మంచి స్థితికి దారితీసింది. ఈ మార్పు ప్రగతి మార్గాన్ని పొందింది. గిరీశం మధుర వాణి విషయంలోను, వారికి తమ పూర్వ జీవితాన్ని మరిచి కొత్త జీవితాల్ని నిర్మించుకొనే "స్వేచ్ఛ" లభించడం గొప్ప విషయం. పూర్వపు బంధనల నుండి పొందిన స్వాతంత్ర్యం సామాన్యమైంది కాదు. ప్రజాస్వామ్య హృదయాన్ని ఆవిష్కరిస్తుంది. సౌజన్యారావులోని హేతుబద్ధ మయిన వివేక స్ఫూర్తితో కూడిన ఆలోచనలు – సహజంగా మంచి స్వభావం కారణంగా పరిణామాలు ప్రగతి లక్ష్యాన్ని వరించాయి.

గురజాడ 'చూపు'లోని ప్రజాస్వామ్య దార్శనికత పౌరుల జీవితాన్ని వికసింప జేసేది జీవితంలో ఉన్నతిని సాధించే సంకల్పానికి దారి తీస్తుంది. అతడు లాయరు

కావడం సహజంగా మంచి మనస్తత్వం లౌకిక నైతిక స్థాయిల్లో ఉపయోగకరమైన నిర్ణయాలకు బాగా ఉపకరించాయి. భవిష్యత్తుత ప్రకాశవంతంగాను పరిణమించింది. ఈ విధంగా ఈ రచన తెలుగు సాహిత్యంలో ప్రగతి మార్గ చరిత్రకు శ్రీకారం చుడుతూంది. గురజాడ సాహిత్యంలో వెనుక నుండి పని చేసిన ప్రజాస్వామ్య భావన ("డెమొక్రాటిక్ కాన్సెప్ట్")ను ఎత్తి చూపడమే ప్రస్తుతోద్దేశం.

సమాజంలో వ్యక్తుల ప్రవర్తనలో పరిస్థితుల ప్రాబల్యంతో చోటు చేసుకునే బలహీనతల్ని గుర్తించి, ఏర్పడే వైరుధ్యాల్ని విశ్లేషించి, విభేదాల్ని సమం చేసి సమభావనతో స్త్రీ పురుష సంబంధాల్లో మర్యాదతో కూడిన విలువలతో గురజాడ చూపు ప్రకాశించింది. సమాజంలో మానవతా స్పందనలతో గొప్ప ఆకర్షణను పొందింది. గురజాడ చూపులో ప్రకాశించే దార్శనికత ప్రజాస్వామ్య భావనతో తీర్చబడింది. ఇది వర్తమానం నుండి భవిష్యత్తుకు ఆధునిక మార్గానికి నిర్దేశకత్వాని వహిస్తూంది. ఈ ప్రతిపాదనం గురజాడచే ఆధునిక యుగారంభాన్ని స్థాపిస్తూంది.

## 14. గురజాడ ప్రభావం

ఈ వంద ఏండ్లలో గురజాడ ఆదర్శ లక్ష్యాన్ని ఎంత వరకు అందుకున్నాం? అనే ప్రశ్న ఈనాడు కలగడం సహజం. ఇది సమీక్షతో మునుముందుకు సాగడానికి బాగా ఉపకరిస్తుంది. ఒక యుగకర్త ఆదర్శాన్ని సంపూర్ణంగా చేరుకోవడమనేది ఒక నియతమైన కాలంలో జరిగే పని కాదు. ఇది నిరంతరమైన ప్రక్రియ. క్రమ పరిణామ శీలం కలిగింది. సమాజం అంటే వివిధ శ్రేణులతో వర్గాలతో సమూహాలతో ప్రత్యేకతల్ని కలిగిన ప్రజా రూపం. అందువల్ల దీని ప్రవేశం వివిధ స్థాయిలో వివిధ సమయాల్లో జరుగుతూ పోతుంది. ఒక మారు వేగాన్ని అందుకోవచ్చు. విశాల తరం కావచ్చు. దీర్ఘ దీర్ఘంగా కాలాన్ని ఆవహిస్తూ సమాజ చరిత్రలో మలుపులకు కారణమవుతుంది. పరివర్తన గుణంతో చరిత్రలో కేతనంగా రెపరెప లాడుతుంది. ఇపుడు వున్నది ఇదే. ఇది చిరమైంది.

గురజాడ ఆదర్శంలో ప్రధానమైన అంశాలు 1) సమాజ సంస్కరణం. 2) మూఢ విశ్వాసాలు నిరాకరణం. 3) హేతుదృష్టి – వైజ్ఞానిక స్పృహ, 4) మానవా దరణం – వికాస భూమిక, 5) వ్యక్తి స్వేచ్ఛ – స్వతంత్ర భావన, 6) సర్వసమానత

– విశ్వమానవ దృష్టి – ఈ ఆరు యుగకర్త ఆదర్శ రూపానికి మూల స్తంభాలు. వీటిని సమాజం అంతా పంచే కార్యక్రమం ఒక ఉద్యమం లాంటిది. ప్రణాళికా బద్ధంగా సాగవలసింది. మార్పు కాలాంతరాన క్రమ క్రమంగా వస్తుంది. ఎందుకంటే 1) భిన్న భిన్న భావ రూపాలు (కాన్సెప్ట్స్) కూ విశ్వాసాలకూ, 2) ఎప్పటి నుండో పేరుక పోయిన ఆలోచనలకూ, 3) స్థిరపడిపోయిన దృష్టి కోణాలకూ, 4) పలు శ్రేణుల్లో వివిధ వర్గాలకూ నిలయమైందీ, ఈ సమాజం, దీనిలో పరివర్తన గుణం రావడానికి తరం మారవలసి ఉంటుంది. కొత్త తరంలో దీన్ని గురించి పరిజ్ఞానంతో పాటు జాగరూకత (ఎవేర్‌నెస్)తో వాతావరణం ఏర్పడవలసిన అవసరం ఉంది. ఈ కారణంగా ఏదీ, అందునా మార్పు అనేది అందరిలో ఒకే స్థాయిలో ఒకే కాలంలో జరిగే వీలు లేదు. ఇది వ్యక్తి గుణంతో సమాజ తత్త్వంతో ముడివడింది. అందువల్ల తరం తర్వాత తరం నెమ్మది నెమ్మదిగా ఆధునికతను పొందడం జరుగుతుంది. ప్రస్తుత సమాజంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండే అవకాశాలు సహకరిస్తూన్న మాట వాస్తవం. వచ్చే కొత్త తరాలు అవగాహనతో వైజ్ఞానిక స్పృహతో మారిన వ్యక్తిత్వాలతో గురజాడ ఆశయాలకు చేరువ అవుతూ ఉన్న స్థితుల్ని గమనించవచ్చు. వంద సంవత్సరాల్లో అప్పటికీ ఇప్పటికీ వచ్చిన మార్పు అనేక కారణాల వల్ల గణనీయమయింది. లౌకిక (సెక్యులర్) వ్యవహార రూపాలతో పాటు మానవతా వాదం దీనికెంతో తోడ్పడుతూంది. ముఖ్యంగా మతాలలో నెలకొన్న మార్పుకు ఇష్టపడని జడస్థితి తొలగి వివేకంతో వర్తించడమూ జరుగుతూంది. ఈ ఆధునిక చేతన నిర్వహించే పాత్ర గొప్పది. అలజడి అశాంతి ఘర్షణ హింసలకు వ్యతిరేకంగా సహనంతో కూడిన రక్షణ కవచాన్ని చేకూరుస్తుంది. గురజాడ ఆదర్శం నిశ్శబ్దంగా పరివర్తన గుణంతో సమాజాన్ని ప్రభావితం చేస్తున్నదని చెప్పడమే ప్రస్తుతోద్దేశం.

కన్యాశుల్కం నాటకంలో సమస్యల పరిష్కారం విషయ పరిజ్ఞానం అవగాహన వివేకంతో పాటు సానుకూల (పాజిటివ్) మైన సమాజ నిర్మాణ రూపం నిశ్శబ్ద పరివర్తనకు సంబంధించింది. ఈ విషయం రచనలో కళాత్మకంగా నిర్వహింపబడింది. యుగకర్త ఆదర్శం ఇప్పటికి వంద ఏండ్లుగా పరచబడి సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. శాశ్వతమైన వెలుగు రూపాన్ని పొందింది. ఇదే మును ముందు కూడ

సాగుతుంది. ఎందుకంటే ఎన్ని వందల ఏండ్ల నుండో పాతుకపోయిన వేళ్ళను తొలగించడం, కొత్తవాటితో నింపడం సాధారణమైన పని కాదు. ఇది అవసరాలు జీవితాలు సందర్భాలు ప్రయోజనాలతో ముడి వడిన విషయం. ఇది ఏదో వెంటనే వదిలించుకొని పోయేది కాదు. చాల సంక్లిష్టమైంది. సమాజంలో దీని వెనుక నుండి పని చేసే (1) సామాజిక భూమిక (2) మానసిక రూపం (మైండ్ సెట్) మారవలసి ఉంది.

అయితే మౌలికమైన సాంస్కృతికమైన మూలాలు చెదరకుండా నిర్మాణంలో ఆధునిక రూపాన్ని ఈనాటి అవసరాల్ని బట్టి సమాజం స్వాగతిస్తుంది. పరివర్తనం వేగాన్ని పుంజుకుంటుంది. క్రమంగా "పాత" స్థానంలో "కొత్త" అనుభవ రూపం స్థిరపడుతుంది. దీన్ని స్పష్టంగా గమనించవచ్చు. గురజాడ రచనలు ఎప్పటికప్పుడు ప్రతి తరానికీ కొత్తగా ఆలోచనల్ని ప్రేరేపిస్తాయి. ఉత్సాహాన్ని నింపుతాయి. అందువల్ల వాటిలో వెలుగు రూపం సమాజానికి అవసరం ఎప్పటికీ ఉంటుంది. ఇది చారిత్రకంగా సమాజ పరిణామంలో తన పాత్రను గొప్పగా నిర్వహించడం విశ్లేషనకు అందుతుంది. కాలం గడుస్తున్న కొద్దీ, వీటి సందర్భం (రెలవెన్స్)తో పాటు ప్రయోజనమూ విస్తరిస్తుందే తప్ప తగ్గే ప్రసక్తి లేదు. సమాజ పురోగమన తత్త్వం కలిగింది. కాబట్టి, ఇందులో హేతువుతో కూడిన భావజాలంతో పాటు వివేకంతో కూడిన స్థిరమైన నిర్ణయం చెప్పుకోదగిన అంశం. ఇది వర్తమానాన్ని ప్రగతి రూపంలోకి మార్చే (ట్రాన్స్‌ఫార్మర్ చేసే) శక్తి కలిగింది కావడమే. ఈ దారిలో ప్రయాణం ఆశావహమైంది. "మరోవైపు"కు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇందులో వ్యక్తి వికాసంతో పాటు సమాజాభ్యుదయం ఎవరూ వ్యతిరేకించలేని కాదనలేని ఆకర్షణ. ఇది ప్రగతిశీల గుణంతో క్రియారూపాన్ని పొందడం సామాన్య విషయం కాదు. ఆ ఆకాలంలో ఎవరూ సాహసం చేయలేని పనిని, గురజాడ తన రచనల ద్వారా జీవితంలో విలువల ద్వారా చేసి చూపాడు. ఇది ప్రభావ శక్తిని పొందడం, అనేది ఆ ఉత్తమమైన ఆదర్శ రూపంలోని ప్రజలకు ఉపయోగకరమైన మహత్తరమైన గుణం వల్లనే.

ఈ దేశంలో ప్రస్తుతం నెలకొన్న (1) ప్రజాస్వామ్య వ్యవస్థ (2) ప్రజలలో ఆధునికతను కోరే మనోరూపం ఈ రెండూ కలిసి ప్రభావానికి విస్తృతిని కలిగించాయి. "మనుషులంతా ఒక్కటే" అన్న విశాల భావన కుల మతాలకు అతీతమైన మానవతా

పూర్ణమైన అంశం. ఆదర్శానికి వెన్నెముకలా పని చేసింది. ఇపుడున్న దేశ పరిస్థితులకు బాగా అన్వయిస్తుంది. మునుముందు ఉపకరిస్తుంది. వంద ఏండ్లు అయినా ఇప్పటికీ అన్వర్థమయ్యే సమాజానికి సరిపడే భావరూపం, ఎంతటి ప్రభావ శీలమయిందో వేరే చెప్పనవసరం లేదు. సర్వసమానత అన్న ఆలోచన పూర్వకాలంలో సూత్రంగా ఉంది, ఇపుడు అనుభవంలో వాస్తవ రూపాన్ని ధరించింది. మహిళలకు సమానమైన గౌరవ స్థితి సమాజంలో అందరానిదిగా ఉంది, ఇపుడు జీవన గతిలో నిజం అవుతూంది. సమాజంలో ప్రగతి స్పృహతో పాటు తగిన చర్యలకూ వీలయిన వాతావరణంతో తరం తరువాత తరంలో, గురజాడ ఆదర్శ ప్రభావం సహజమైన పరిణామంలో భాగమవుతూంది. చివరలో "ఎల్ల లోకములొక్క ఇల్లై" పోయే విశ్వ భావన ఇపుడు వస్తూన్న ప్రపంచీకరణకు సూచనగా ఉంది. ఈ యథార్థ రూపాన్ని గుర్తించడం గొప్ప విషయం.

ఈ నాటి జీవన విధానంలో (1) స్వేచ్ఛ – స్వాతంత్ర్యం (2) సమానత – సౌభ్రాతృత్వం (3) మానవీయం విశ్వ ప్రగతి దృష్టితో పరివర్తనమే – గురజాడ దార్శనికమైన అస్తిత్వం. సమాజ పరిణామంలో వెలుగు రూపం. ఈ వెలుగు రూపం అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ ప్రేరణశక్తిగా నిలిచేదీ. ఈ వంద ఏండ్లుగా ప్రసరించిన ప్రభావం సమాజంలో గుణాత్మకమైన (క్వాలిటేటివ్) మార్పుకూ మేలైన జీవితానికీ, ఉత్తమమైన సమాజానికి మార్గదర్శకంగా నిలిచింది. యుగకర్తలోని వెలుగు మనిషి వ్యక్తిత్వాన్ని ప్రస్థానంలో ముందు నిలుపుతూంది. ఇంకా కొన్ని వందల ఏండ్లు దారిచూపుతూనే ఉంటుంది. ఇది సమాజం మనుగడకు అవసరమైంది, మనిషి ప్రజాస్వామ్య స్వేచ్ఛలో వ్యక్తిత్వానికి వికాస హేతువుగా నిలిచేదీ. అభ్యుదయ భావనా పథాన్ని ఆవిష్కరిస్తూంది.

# మరో వైపు - గురజాడ

"ఆధునిక చేతనతో మతి పండిన మనస్వి
మరో వైపు మార్గానికి సృజన దర్శనం.

కార్య కారణంతో జీవన నైజం చూపే
మానుష రూపానికి ప్రగతి శక్తి విజయం.

మూసిన హృది దిశలను తెరపించే సాహిత్యం
ఎదురుగ కనిపించే విభాత రూపం.

చీకటి కోటకు ఆవల స్వేచ్ఛకు సంకేతం
పరివర్తన చరిత్రలో నవ దినమణి! గురజాడ

అమాయకం అమానుషం అజ్ఞానం నుండి
ప్రతి మనిషి! పునర్భవం కోరే మనీషి.

చుట్టూ బాధనూ ఆర్తినీ చీల్చుకొనీ
సమాజ బంధువై తరలే విద్యుత్ కవి

- మాదిరాజు రంగారావు

# మాదిరాజు రంగారావు కృతులు

(రచనా కాలం 1952 - 2013)

రసధుని-సాహితీ పరిషత్తు శాంతినగర్, హైదరాబాద్-500 028.

**A. స్వేచ్ఛా కవిత్వం - మొదటి భాగం రచనాకాలం 1952 - 2002**

1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం
3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం
5. యుగ సంకేతం 6. ఆవాహన
7. ముక్తకాలు 8. నాలో ప్రవహిస్తోంది నది
9. నాకు జ్ఞాపకముంది 10. కిర్మీరం 11. మనోభూమికలు
12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై
15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం
18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై 20. అగ్ని నుండి ఆనందానికి
21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం
23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం
26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య
29. కిరణ పథం 30. స్వేచ్ఛకు సిగ్నల్

**స్వేచ్ఛా కవిత్వం - రెండవ భాగం రచనాకాలం 2003 - 2012**

31. అభిషేకం - 2003 32. ఆగమనం - 2005 33. ఎప్పటికీ కొత్తే - 2005
34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం
37. సమకాలీనం - 2007 38. అభినవ యానం 39. ఆత్మ బంధం - 2008
40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం
43. నవ దర్శనం -2009 44. గిఫ్ట్ ప్యాకెట్ 45. పునర్దర్శనం
46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి-2010
49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం-2011
52. అద్దంలో ప్రజాస్వామ్యం-2011 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం -2012
54. ఖడ్గం కన్నీరు కార్చదు- 2013

**B. పరిశోధన - సమాలోచనం**

55. కవిత్రయం సృజనకళ – నిర్వహణ శిల్పం
56. స్వేచ్ఛా కవిత్వం 57. నవల స్వరూపం 58. పరిశోధనా స్వరూపం
59. అధికార భాష 60. అనువాద కళ 61. దాశరథి కవితా సమాలోచనం
62. సమ దర్శనం – స్వేచ్ఛా కవిత్వం 63. ఆలోకనం (సాహిత్య వ్యాసాలు)
64. సృజన దృష్టి – మానవీయ భావన 65. సాహిత్య వ్యాసాలు
66. మహాప్రస్థానం – సమాలోచనం 67. Facets of T. Free-verse
68. సృజన చేతన 1వ భాగం రా. కల్పవృక్షం (తులనాత్మక – 2వ భాగం వ్యాఖ్యానం
69. స్వేచ్ఛా కవిత్వం – ప్రజాస్వామ్య / మానవీయ భావన
70. స్వేచ్ఛా కవిత్వం సహృదయ స్పందనం 71. గురజాడ – ఆధునిక చేతన - 2013



## సంక్షిప్త పరిచయం

మాదిరాజు రంగారావు జననం 1936 జనవరి 7, ఖమ్మం పట్టణానికి పదిమైళ్ళ సమీపంలో పండితాపురం గ్రామం. ఖమ్మంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం. తదుపరి నిజాం కాలేజి, ఆర్ట్స్ కాలేజి, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో M.A. (Sanskrit) 1960, M.A. (Telugu) 1962, Ph.D (Telugu) 1962-64 యు.జి.సి. రిసెర్చ్ స్కాలర్ గానూ సాగింది. తెలుగు మహాభాగవతం పరిష్కరణ సమితిలో, తెలుగు మహాభారతం పరిష్కరణ సమితిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ప్రవేశం. కాకతీయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ప్రొఫెసర్‌గా Chairman Board of Studies and Dean Faculty of Arts గానూ ఉన్నారు. పదవీ విరమణం తరువాత యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (న్యూ ఢిల్లీ) రిసెర్చ్ ప్రాజెక్టుల (1995–98, 1999–2002) ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ గానూ తరువాత హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ (న్యూఢిల్లీ) రిసెర్చ్ సీనియర్ ఫెలో (2003–2006)గానూ పనిచేశారు.

సాహిత్య క్షేత్రంలో 1952 నుండి స్వతంత్ర, నవత, భారతి, స్రవంతి, జయంతి, వాఙ్మయి, మూసీ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమిలో కవితలు, సాహిత్య వ్యాసాలు ప్రకటితమయినాయి. స్వేచ్ఛా కవిత్వం (54), పరిశోధన – సమాలోచనం(17) మొత్తం 71 పుస్తకాలు 1952–2013లో ప్రచురితమైనాయి.

**స్వేచ్ఛా కవిత్వంలో** 1. ప్రజాస్వామ్య దృక్పథం 2. మానవీయ భావన 3. సామాజిక వాస్తవికత 4. వర్తమాన స్థితి చలనం 5. మనస్తత్వ చిత్రణంతో ఒక పార్శ్వమూ.

**సమాలోచనంలో** 1. కవి దృష్టి – వ్యక్తిత్వం – కృతి 2. సమాజమూ – ఆదర్శరూపం 3. మానవీయం – విశ్వభావన 4. మనస్తత్వ ప్రకాశనం 5. సృజన కళ – సంవిధాన శిల్పంపై వెలుగుతో మరో పార్శ్వమూ కలిగిందీ, కవి సాహిత్య వ్యక్తిత్వం.

సృజన రచనలో చారిత్రకం సామాజికం మరియు కవి మనోరూపం నేపథ్యంలో భిన్నత్వం అనివార్యమే కాదు, సహజమూ అన్న అభిప్రాయం కలిగిందీ.

1970 నుండి రసధుని సాహితీ పరిషత్తు వ్యవస్థాపకులూ, అధ్యక్షులూ.


నివాసం
# జ్యోతి సౌభాగ్య అపార్ట్‌మెంట్, 10–2–289/61,
ఫ్లాట్ నెం. 202, శాంతినగర్, హైదరాబాద్ – 500 028.